# తెలుగువాణి

ఏప్రిల్ - ఆగస్టు 2016

త్రైమాసిక సమాచార పత్రిక


గౌరవ సంపాదకులు

**ఆచార్య వి. సత్తిరెడ్డి**

రిజిస్ట్రార్, ఐ/సి

సంపాదకులు

**డా॥ జె. చెన్నయ్య**

ప్రజాసంబంధాల అధికారి

ఉప సంపాదకులు

**రింగు రామమూర్తి**

**డా॥ ఎన్. సుధాకర్ నాయుడు**

ప్రచురణ

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

హైదరాబాద్

**ముఖచిత్రం :**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన ఉపాధ్యక్షులు
ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ.

**చిరునామా :**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు – 500 004
తెలంగాణ, ఇండియా.
ఫోను నెంబర్లు : 040–23230435, 23231003
ఫ్యాక్స్ నెంబరు : 040–23236045

**డిజైనింగ్ & డి.టి.పి.**

చరిత ఇంప్రెషన్స్

**ఫోటోల సౌజన్యం**

చిత్రవాణి, ఆడియో–వీడియో స్టూడియో, తెలుగు విశ్వవిద్యాలయం.

**ముద్రణ**

చరిత ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్ – 500 020.
ఫోను : 040–27678411

# తెలుగు వెలుగుకు కృషి

దేశ విదేశాల్లోని తెలుగు వారికి సంబంధించిన సమాచారాన్ని, తెలుగు విశ్వవిద్యాలయ కార్యాకలాపాల సమాచారాన్ని ఒక చోట రాసి పోసి అందించేందుకు తెలుగు వాణి ఒక చక్కని సాధనంగా ఉపయోగపడుతున్నది. తొలుత పూర్వపు అంతర్జాతీయ తెలుగు సంస్థ ఈ పత్రికను ప్రారంభించింది. సంస్థ రద్దయినా గత 30 ఏళ్ళుగా విశ్వవిద్యాలయం పత్రిక లక్ష్యం అనుగుణంగా కొనసాగిస్తున్నది. ఇప్పుడు రాష్ట్రేతర ప్రాంతాల్లోని తెలుగు సంఘాలు నిర్వహించిన కార్యక్రమాల గురించి, తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ కార్యక్రమాల విశేషాల గురించి తాజా సంచికలో చూడవచ్చు. విదేశాలలో మన తెలుగు వారు నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక వార్తలను ఇక నుంచి వెలువడే సంచికల్లో ప్రచురిస్తాం.

నేను తెలుగు విశ్వవిద్యాలయం పదో ఉపాధ్యక్షునిగా జూలై 25న పదవీ స్వీకారం చేశాను. విశ్వవిద్యాలయం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికపై దృష్టిసారించాను. ముఖ్యంగా ఈసారి వివిధ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. సవ్యంగా జరిగేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం. తొలిసారి కాబట్టి ఏమైనా లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్ది వచ్చే సంవత్సరానికి మరింత మెరుగైన పద్ధతిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.

ఇది తెలుగు రాష్ట్రాలకు మాత్రమే సంబంధించిన విశ్వవిద్యాలయం కాదు. ప్రపంచంలోని తెలుగు వారందరికీ సంబంధించింది. భౌగోళికమైన పరిధులు పరిమితులు, భావ వ్యాప్తి నిరోధాలు లేవు. ఒకప్పుడు విదేశాలకు వెళ్ళి మనవారు ఉద్యోగాలు సంపాదించుకొని వాటిల్లో స్థిరపడి ఇక్కడ తమ వారి యోగక్షేమాలు చూసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. ఇప్పుడు తమ పిల్లలు మాతృభాషా సంస్కృతులకు దూరం కాకుండా తాము నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని గురించి ఎక్కువ ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు విశ్వవిద్యాలయం తన పరిధిని గణనీయంగా విస్తరించుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికాలో, ప్రపంచంలో, మరో 12 దేశాల్లోనూ సిలికానాంధ్ర నిర్వహిస్తున్న 'మన బడి' తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి అనుబంధంగా ఉంది. ఈ కార్యక్రమం నానాటికీ విస్తరిస్తూ ఈనాడు ప్రపంచంలోనే అతిపెద్ద భాషాభ్యాస, అధ్యయన కార్యక్రమంగా ఆవిర్భవించింది. దీన్నింకా విస్తరింపజేసేందుకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రోత్సాహ సహకారాన్ని అందిస్తుంది. ఇటీవల మలేషియా తెలుగు సంఘానికి చెందిన ప్రతినిధి బృందం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. సంఘం అధ్యక్షులు డాక్టర్ అచ్చయకుమార్ రావు ఆ దేశంలో తెలుగు నేర్చుకొనేందుకు ఉన్న అవకాశాలను గురించి తెలిపారు. ఉన్న ఉపకరణాల సహాయంతో పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు. కాని తెలుగు పలికే విధానం ఎలా ఉంటుందో చెప్పాలంటే భాషా ప్రయోగశాల (లాంగ్వేజ్ ల్యాబ్) సౌకర్యం కావాలి. హైదరాబాద్‌లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పాను. భాషను నేర్పించేందుకు నిర్దేశించిన ప్రణాళికలో కొన్ని రోజులు భాషా ప్రయోగశాలలో శిక్షణ పొందేలా చూడడానికి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనుంది. విదేశాల్లోని తెలుగు వారంతా తమ పిల్లలకు తప్పకుండా తెలుగు నేర్పించి, భాషలో లిఖితమైన సాహితీ, సాంస్కృతిక, కళా వారసత్వ సంపదను ఒంటబట్టించుకునేలా చేయాలని నేను కోరుతున్నాను.

దేశ విదేశాల్లోని తెలుగు వారందరినీ ఒక వేదిక పైకి తెచ్చి భాషా సాంస్కృతిక సమస్యను చర్చించుకునేందుకు ఉద్దేశించిన అఖిల భారత తెలుగు మహాసభలను, ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించాలని భావిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేశ విదేశాల్లోని తెలుగు సంఘాల సహకారంతో తెలుగు మహాసభలు నిర్వహించేందుకు కృషి చేస్తాం.

నిరంతర అధ్యయనం, నిర్విరామ కృషి మాత్రమే విజయాల్ని సాధించి పెడతాయని, దీనికి ప్రణాళికబద్ధమైన దీర్ఘకాలిక మార్గమేగాని, తక్షణ ప్రయోజనదాయక మార్గాలేవీ లేవని తెలుగు విద్యార్థులు తెలుసుకోవాలి. విద్యార్థుల చదువు సాఫీగా సాగి మంచి మేలు జరగాలంటే విద్యార్థులకు అధ్యయనమొక్కటే మార్గం. దీనికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు అందరూ బాధ్యత తీసుకోవాలి.

కాలానుగుణంగా నిధుల పరిమితి, లక్ష్యాల విస్తృతి దృష్ట్యా ఉద్యోగులు కూడా తమ విద్యుక్త ధర్మ నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలి. కార్యాలయానికి నిర్దిష్ట సమయానికి వచ్చి సాయంత్రం వరకు ఉండి ఎప్పటి పని అప్పుడు పూర్తి చెయ్యాలి. విద్యార్థులు తరగతులకు నూటికి నూరు శాతం హాజరు కావాలి.

ఎస్వీ సత్యనారాయణ

(ఉపాధ్యక్షులు)

# విషయ సూచిక


| | | పేజీ నెం. |
|---|---|---|
| 1. | భాషా విధానాన్ని రూపొందించాలి | 5 |
| 2. | త్యాగరాజ స్వామి సందేశం అనుసరణీయం | 7 |
| 3. | యాభై ఆరు అక్షరాలను కాపాడుకోవాలి | 9 |
| 4. | నాటక కళను నిలబెట్టుకోవాలి | 10 |
| 5. | పాలకులు చరిత్ర తెలుసుకోవడం చాలా అవసరం | 12 |
| 6. | డా.బి.ఆర్. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు ఆన్‌లైన్‌లో | 13 |
| 7. | ఆకట్టుకున్న రంగస్థల కళల శాఖ విద్యార్థుల నాటకాలు | 14 |
| 8. | ఇంకుడు గుంతల ఏర్పాటు | 15 |
| 9. | కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం | 16 |
| 10. | బి. సుధాకర్‌రెడ్డి పదవీ విరమణ | 32 |
| 11. | కవితాత్మక అవతరణోత్సవం | 33 |
| 12. | పనే దైవం | 37 |
| 13. | ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య వి. సత్తిరెడ్డి | 40 |
| 14. | హరితహారం | 41 |
| 15. | ఘనంగా సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం | 42 |
| 16. | ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం | 47 |
| 17. | పరిశోధనలకు ఈ చరిత్ర ఆధారం | 53 |
| 18. | ఉపాధ్యక్షులుగా ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరణ | 54 |
| 19. | కూచిపూడి నృత్యంలో ఇటీవలి పరిశోధనలు | 56 |
| 20 | మలేషియాలో తెలుగు భాషాభివృద్ధికి సహకరిస్తాం | 57 |
| 21. | మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారం ప్రదానం | 59 |
| 22. | ఆచార్య కె. జయశంకర్ తెలంగాణ కాలజ్ఞాని | 60 |
| 23. | మలేషియా తెలుగు సంఘ ప్రతినిధులకు సన్మానం | 61 |
| 24. | సిలికానాంధ్ర 'మనబడి' స్నాతకోత్సవం | 62 |
| 25. | తెలుగుకు ప్రాచీన హోదాపై మద్రాసు హైకోర్టు తీర్పు హర్షదాయకం | 63 |
| 26. | గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహాయం పొందిన రచయితలు | 64 |
| 27. | అంతర్జాతీయ స్థాయికి తెలుగు విశ్వవిద్యాలయం | 65 |
| 28. | అసూయ ద్వేషాలతో పతనమవుతున్న మనిషి | 66 |
| 29. | ప్రపంచ జానపద దినోత్సవం | 67 |
| 30. | ఉమా రామారావు మృతికి సంతాపం | 69 |
| 31. | ఉద్యోగుల అభిమానాన్ని చూరగొనడం ప్రశంసనీయం | 70 |
| 32. | పాల్కురికి సోమనాథ ప్రాంగణం | 75 |
| 33. | నన్నయ ప్రాంగణం | 80 |
| 34. | రాష్ట్రేతరాంధ్రవాణి | 81 |

# భాషా విధానాన్ని రూపొందించాలి




మాతృభాషను గౌరవించి ప్రోత్సహించడానికి వీలుగా ప్రభుత్వం ఒక భాషా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, భాషాభివృద్ధి పీఠం ఆధ్వర్యంలో 2016 మార్చి 3వ తేది గురువారం జరిగిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో ప్రధాన ప్రసంగం చేస్తూ తెలుగు రాష్ట్రాలలో భాష ఓట్ల రాజకీయాల్లో కీలకపాత్ర వహించకపోవటం వల్ల ప్రభుత్వాలు భాషను విస్మరిస్తున్నాయని అన్నారు. విద్యా విధానంలో కూడా మాతృభాషకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, ఆంగ్ల మాధ్యమం పేరిట సాగుతున్న విద్య వల్ల అటు ఆంగ్లము, ఇటు తెలుగులో కూడా విద్యార్థులు ప్రావీణ్యం సముపార్జించలేకపోతున్నారని సిధారెడ్డి తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కూడా తగిన భాషా పరిజ్ఞానం, శిక్షణ లోపిస్తున్నాయని చెప్పారు. 'అన్ని భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా' అన్న కాళోజి మాటల్ని సిధారెడ్డి ప్రస్తావిస్తూ మాతృభాషను విస్మరించడం తీవ్రమైన విషయమని అన్నారు.

ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రపంచంలో అగ్రభాషలే కాకుండా ప్రాదేశిక భాషలకు తగిన గౌరవం, ప్రాధాన్యం లభించినప్పుడే సాంస్కృతిక వైవిధ్యం మనుగడ సాగిస్తుందని

అన్నారు. మాతృభాషలో వ్యక్తీకరించినంత సమర్థంగా మరో భాషలో తెలపడం సాధ్యంకాదని శాస్త్రీయంగా రుజువయిందని తెలిపారు. తెలుగు భాషకు ఉన్న శక్తి అపారమైందని ఏ విషయాన్నైనా తెలుగులో రాయవచ్చునని తెలిపారు. మాతృభాషను తృణీకరించి ప్రతిదానికీ ఆంగ్లంలో మాట్లాడేవారు కూడా వ్యాకరణ విరుద్ధంగా ఎన్నో తప్పులు మాట్లాడతారని శివారెడ్డి వివరించారు. కన్నడిగులు, తమిళులు, మలయాళీలకు ఉన్న మాతృ భాషాభిమానం తెలుగువారికి లేకపోవడం బాధాకరమని, భాషా న్యూనతాభావానికి చికిత్సేలేదని అన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య ప్రారంభోపన్యాసం చేశారు. ఆక్స్‌ఫర్డ్ పరిశోధక బృందం జరిపిన అధ్యయనంలో మాతృభాషలో విద్యాభ్యాసం చేసిన వారికి సామర్థ్యం ఎక్కువ ఉంటుందని తేలిందని చెప్పారు. భాషాభివృద్ధి పీఠం ఇన్‌ఛార్జి పీఠాధిపతి డా.జి.ఎస్.గేబ్రియల్ స్వాగతం పలికారు. డా. ఎం.గీతావాణి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు'వాణి' వినిపించిన డాక్టర్ జె. చెన్నయ్య



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'తెలుగు వాణి' సంపాదకులుగా డాక్టర్ జె. చెన్నయ్య విశ్వ విద్యాలయంలో జరిగిన వివిధ కార్యక్రమాలను, రాష్ట్రేతర ప్రాంతాల్లో నిర్వహించిన వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను తెలుగు వాణి ద్వారా అశేష తెలుగు పాఠకులకు అందించిన సేవలు ప్రశంసనీయం. 20 సంవత్సరాలు పాటు తన సంపాదకత్వంలో వందలాది వార్తలను, విశ్వవిద్యాలయం ద్వారా పురస్కారాలు పొందిన వారి జీవిత విశేషాలను రాసి తెలుగు వాణి ద్వారా ఎంతో ప్రచారం కల్పించడమే గాకుండా, కార్యక్రమాలకు సంబంధించిన వార్తలను, పురస్కారగ్రహీతల జీవిత విశేషాలను అక్షరబద్ధం చేసి వాటికి శాశ్వత స్థానం కల్పించారు.

సమగ్రంగా వార్తలను అందించి 'తెలుగు వాణి' ధ్యేయాన్ని నిలబెట్టారు. చెన్నయ్య చేసిన కృషిని విశ్వవిద్యాలయ సిబ్బంది చేతనే గాకుండా, బయటి సాహిత్య, సాంస్కృతిక సంస్థలచేత కూడా డాక్టర్ జె. చెన్నయ్య ప్రతిభాశాలి అని ప్రశంసింపబడ్డారు.

తెలుగు వాణికి డాక్టర్ జె. చెన్నయ్య చేసిన సేవలకు కృతజ్ఞతలు, అభినందనలు.

# త్యాగరాజ స్వామి సందేశం అనుసరణీయం



'నిధి చాల సుఖమా రాముని సన్నిధి చాల సుఖమా' అన్న సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి సందేశం ఈనాటికీ అనుసరణీయమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి. రమణాచారి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖ ఆధ్వర్యంలో 2016 మార్చి 15 మంగళవారం ఏర్పాటు చేసిన శ్రీ త్యాగరాజ స్వామి 169వ ఆరాధన, వాగ్గేయకార ఉత్సవాలను జ్యోతి ప్రకాశం చేసి ఆయన ప్రారంభించారు. సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్, భీమిలి వారు సౌజన్యం అందించిన ఈ కార్యక్రమంలో కె.వి.రమణ ప్రసంగిస్తూ ఆనాడు త్యాగరాజ స్వామి అనుకుంటే తమ సంగీత సంపద ద్వారా భోగ భాగ్యాలు పొందగలిగేవారని కానీ అలా కాకుండా రాముని సన్నిధి నిధి కన్నా గొప్పదని భావించడం వల్లే ఈనాటికీ ఆరాధ్యులుగా ఉన్నారని అన్నారు. సంగీతం భగవంతుడిచ్చిన సంపదగా భావించి ఈ తరం సంగీతాన్ని దీక్షగా అభ్యసించి, పరిణతిని సాధించి సృజనాత్మకంగా మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆయన సూచించారు.

విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.తోమాసయ్య అధ్యక్షత వహించారు. ప్రతి సంవత్సరమూ సంగీత శాఖ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు, వాగ్గేయకార ఉత్సవాలు, సంగీత కళలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఇతర శాఖలు కూడా సంగీత శాఖను ఆదర్శంగా తీసుకుని సదస్సులు, శిక్షణా శిబిరాలు నిర్వహించాలని యు.జి.సి. నుంచి ఇందుకోసం నిధులు మంజూరు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు.

ప్రముఖ సంగీత విద్వాంసులు కొమాండూరి శేషాద్రి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కర్ణాటక సంగీతాన్ని త్యాగరాజ స్వామి సమున్నత స్థానానికి చేర్చారని, అనంతర వాగ్గేయకారులు కూడా తమ గాన విశిష్టతతో మరింత సుసంపన్నం చేశారని అలాంటి వాగ్గేయకారుల జయంతులు, వర్ధంతులను క్రమం తప్పక నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమానికి ముందు ప్రముఖ సంగీత విద్వాంసులు డా.ఎస్.కె. వెంకటాచార్య శ్రీత్యాగరాజ స్వామి వేశాన్ని ధరించి ఉంఛవృత్తి చేపట్టారు. లలితకళాపీఠం అధ్యక్షులు జయామనోహర్ పాల్గొన్నారు. తొలి ప్రదర్శనగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్యకళాశాల అధ్యాపకుడు ప్రముఖ విద్వాంసుడు కొమాండూరి కృష్ణ గాత్రకచేరి సంగీతాభిమానులను ఆకట్టుకుంది. 'ప్రణమామ్యహం శ్రీ గౌరీసుతం' త్యాగరాజ కీర్తనను గౌడరాగంలో, ఆదితాళంలో ఆలపించారు. తరువాత 'ఎవరిని నిర్ణయించేదిరా' కీర్తనను దేవామృత వర్షిణి రాగంలో, ఆదితాళంలో గానం చేశారు. ఓ. రాజశేఖర్ వయొలిన్ పై, వంకాయల వెంకట రమణమూర్తి మృదంగంపై, శ్రీకాంత్ కంజీరపై వాద్య సహకారం అందించారు.

2016 మార్చి 15, 16, 17 తేదీలలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖ నిర్వహించిన సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 169వ ఆరాధన, వాగ్గేయకార ఉత్సవాలలో భాగంగా 16వ తేదీ రెండవ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మరల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంగీత శాఖ పూర్వ విద్యార్థులు సంగీత కచేరీలు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటలవరకు శ్రీమతి సౌమ్యా శ్రీధర్ గాత్ర సంగీత కచేరీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి సుందరీ జానకీరామన్ విచ్చేసి కళాకారులకు అభినందనలు తెలియజేస్తూ సంగీతశాఖను అభినందిస్తూ ప్రసంగించారు.

మూడవ రోజు ఉదయం 10 గంటలకు సంగీత శాఖ పరిశోధక విద్యార్థులు సంగీత కచేరీలు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీమతి శ్రీ విద్యా జానకి రామన్ ఆధ్వర్యంలో గాయత్రీ సంగీత విద్యాలయం విద్యార్థులచే శ్రీపురందరదాసు కీర్తనల ప్రత్యేక కార్యక్రమం జరిగింది. 3 గంటలకు శ్రీ ఆరభి వయోలిన్ స్కూల్ అధ్యక్షులు అశోక్ గురూజీల ఆధ్వర్యంలో విద్యార్థులచే వయోలిన్ వాద్యబృందం జరిగింది. సాయంత్రం 4 గంటలకు సంగీతశాఖ విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, జంటనగరాలలోని ప్రముఖ విద్వాంసులచే శ్రీ త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠీగానం ఏర్పాటయింది. ఈ కార్యక్రమానికి వి. ఉదయ్‌శంకర్ డైరెక్టర్, ఎఐఆర్ హైదరాబాదు ముఖ్యఅతిథిగా, సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కె. బసవరాజు ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. వీరు ఇరువురు కార్యక్రమాన్ని ఆసాంతం విని తమ స్పందన తెలియజేసి సంగీతశాఖ ఈ విధంగా సంగీతోత్సవాలు నిర్వహించడాన్ని శ్లాఘించారు. ప్రతీ ఏటా ఈ ఉత్సవానికి సౌజన్యాన్ని అందిస్తున్నట్లే ఇకముందు కూడా సంగీతశాఖకి తమ సహకారం ఉంటుందని కందుకూరి బసవరాజు చెప్పారు.

# యాభై ఆరు అక్షరాలను కాపాడుకోవాలి



తెలుగు నేర్చుకోవడానికి వందల గ్రంథాలున్నా... 'పెద్దబాలశిక్ష'కు మించిన గొప్ప గ్రంథం మరేది లేదని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ విశ్రాంత ఐటీ నిపుణులు రాచకొండ మల్లికార్జునరావు రచించిన 'ఆస్ట్రేలియా తెలుగు వాచకాల' (తెలుగు అక్షర పరిచయం పుస్తకాలు)' ఆవిష్కరణ సభ 2016 మార్చి 18 శుక్రవారం విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. ఆవిష్కర్త ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ తెలుగు నేర్చుకోవడానికి అన్నింటికంటే గొప్ప గ్రంథం పెద్ద బాలశిక్ష అని అన్నారు. మనకున్న యాభై ఆరు అక్షరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య, రచయిత రాచకొండ మల్లికార్జునరావు, అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు, సాహితీవేత్తలు, భాషావేత్తలు, విద్యార్థులు, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాటక కళను నిలబెట్టుకోవాలి



నాటక కళ సజీవమైనదని, యువతీ యువకులు నాటక కళ పట్ల అభిరుచితో కృషి చేసి ఆ కళను పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి. రమణాచారి సూచించారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థలకళల శాఖ 2016 మార్చి 26వ తేది శనివారం డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సురభి నటకుటుంబానికి చెందిన నిరుపమ సునేత్రికి ఈ సంవత్సరపు జె.ఎల్. నరసింహారావు యువరంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఐదువేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ కళాకారులు ప్రభుత్వం వద్దకు వచ్చి యాచించడం గాక ప్రభుత్వమే కళాకారుల వద్దకు వెళ్ళి వారిని సముచితంగా గౌరవించే రోజు తెలంగాణ ప్రభుత్వంలో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్స్టిట్యూట్ పిలుపుపైన 1961 నుంచి ఏటా ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుగుతున్నదని అన్నారు. సెల్ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు వదిలి నాటక ప్రదర్శన చూడమనే అంశం ఈసారి ప్రధాన సందేశమని అన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న రంగస్థల ప్రముఖుడు దుగ్గిరాల సోమేశ్వరరావు ప్రసంగిస్తూ ఆధునిక తెలుగు నాటక కళావికాసానికి విశిష్ట సేవలందించిన వారిలో ఎ.ఆర్.కృష్ణ, జె.ఎల్. నరసింహారావు అగ్రగణ్యులని అన్నారు. జె.ఎల్. నరసింహారావు స్మృత్యర్థం యువపురస్కారాన్ని అందజేసేందుకు విశ్వవిద్యాలయంలో నిధిని నెలకొల్పినట్లు ఆయన చెప్పారు. రంగస్థల కళల శాఖ అధ్యక్షులు డా. బిహెచ్. పద్మప్రియ, బిహెచ్. కల్యాణి, డా. కోట్ల హనుమంతరావు పాల్గొన్నారు.

సభా కార్యక్రమానికి ముందు డా. కోట్ల హనుమంతరావు రచించి దర్శకత్వం వహించిన 'ఎవడేసిన బాటరా ఇది' లఘు నాటిక ప్రజాకళాకారుల వెతలకు అద్దం పట్టింది. ఆదరణ లేక జానపద కళాకారులు ముఖ్యంగా సంచార కళాకారులు పడుతున్న కష్టాలను కళ్ళకు కట్టింది.

## విస్తరణ సేవా విభాగం ఇన్‌ఛార్జిగా ఆర్. రామమూర్తి



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఇన్‌ఛార్జిగా ఆర్. రామమూర్తి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ జె. చెన్నయ్య వయసు రీత్యా పదవీ విరమణ చేయడంతో ఆర్. రామమూర్తి ఇన్‌ఛార్జి బాధ్యతలు 2016, ఆగస్టు 31న స్వీకరించారు. విస్తరణ సేవా విభాగంలో ప్రోగ్రాం ఇన్‌ఛార్జిగా ఆర్. రామమూర్తి 1992 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

## రాష్ట్రేతరాంధ్రులకు విజ్ఞప్తి

రాష్ట్రేతరాంధ్రులు, తమ తమ ప్రాంతాలలో నిర్వహించే సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన వార్తలను తెలుగు వాణిలో ప్రచురణ నిమిత్తం కార్యక్రమం జరిగిన 10 రోజుల లోపల రెండు ఫొటోలతో సహా పంపవలసిందిగా కోరుతున్నాం.

## దేశ భాషలందు తెలుగు లెస్స

# పాలకులు చరిత్ర తెలుసుకోవడం చాలా అవసరం



పాలకులు చరిత్రను సమగ్రంగా, క్షుణ్ణంగా చదివి... శాసనాలు చేస్తే సమాజానికి ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సంయుక్తంగా ప్రచురించిన 'ఆధునిక ఆంధ్ర, హైదరాబాద్ (క్రీ.శ. 1858–1956) తెలుగు, ఆంగ్ల చరిత్ర సంపుటాల'తో పాటు తెలంగాణ చరిత్ర గ్రంథావిష్కరణ కార్యక్రమం 2016 ఏప్రిల్ 3 శనివారం సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతికి ఖ్యాతిని తెచ్చిన మహానుభావుల చరిత్రను తెలుసుకోవడం చాలా అవసరమని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ చరిత్రను రక్షించాలనుకునే వారికి ఎల్లలు ఉండవన్నారు. అసహనం అనే పదం దేశమంతా నేడు వినిపిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్. రమేష్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతికపరంగా వచ్చే మార్పులను శాసించే విధంగా ఈ గ్రంథాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంపుటి సంపాదకులు ఆచార్య బి. కేశవనారాయణ, ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్కృతి ప్రాజెక్టు ప్రధాన సంపాదకులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, ఏబీకే ప్రసాద్, డాక్టర్ జె. బాపురెడ్డి, డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు, వాడ్రేవు చినవీరభద్రుడు, సీపీఎం జాతీయ కార్యదర్శి బీవీ. రాఘవులు, ఆచార్య సి. మృణాళిని, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆచార్య జి. వెంకటరామయ్య, రిజిస్ట్రార్ ఆచార్య తోమాసయ్య పలువురు చరిత్రకారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# డా.బి.ఆర్. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు ఆన్‌లైన్‌లో



భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని ఆయన రచనలు, ప్రసంగాల తెలుగు సంపుటాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. మొత్తం 12 సంపుటాలను పి.డి.ఎఫ్. రూపంలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లో ఉంచారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి 2016 ఏప్రిల్ 7 గురువారం దీన్ని ప్రారంభించారు. ప్రపంచంలో ఏ మూలనున్న వారైనా అంతర్జాలంలో డా. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలను సంపుటాల వారీగా చూడవచ్చు. ఆంగ్లంలో వున్న డా. అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలను భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురించే కార్యక్రమం 1991లో ప్రారంభమైంది. తెలుగు అనువాద కార్యక్రమాన్ని తెలుగు విశ్వవిద్యాలయానికి అప్పగించారు. తెలుగు విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల సహకారంతో అనువాదాన్ని పూర్తి చేసి సంపుటాలవారీగా ప్రచురిస్తూ వచ్చింది. ఇటీవలి కాలంలో కొన్ని సంపుటాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఈనెల 14న డా.బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతి నాటికి భారతీయ భాషలన్నిటిలోకి అనువాదమైన సంపుటాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. విధించిన గడువుకు వారం రోజులముందే తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణల విభాగం ఈ పని పూర్తిచేసింది. తెలుగు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో హోమ్ పేజీలోకి వెళ్ళి డా.బి.ఆర్. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలపై క్లిక్ చేస్తే వరుసగా సంపుటాలు వస్తాయి. తెలుగు పాఠకులకు ఈ సౌకర్యం గొప్ప అవకాశమని విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. రిజిస్ట్రారు ఆచార్య కె.తోమాసయ్య, ప్రచురణల విభాగం సంచాలకుడు ఆచార్య వి. నిరీక్షణ బాబు, కంప్యూటర్ సెల్ ఇన్‌ఛార్జి, డా.కె. సుధీర్ కుమార్, భాషాభివృద్ధి పీఠం అధిపతి డా.జి.ఎస్. గేబ్రియల్ బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న రంగస్థల కళల శాఖ విద్యార్థుల నాటకాలు



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ విద్యార్థులు 2016 ఏప్రిల్ 18 సోమవారం ప్రదర్శించిన రెండు నాటికలు సమకాలీన సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించాయి. ఎన్. నాగభూషణం రచించిన 'కాలజ్ఞానం' నాటిక కె. శాంతాదేవి దర్శకత్వంలో విద్యార్థులు ప్రదర్శించారు. భార్య కడుపులో ఉన్నది ఆడ శిశువని తెలిసి గర్భస్రావం చేయించుకోమని భర్త వత్తిడి చేస్తాడు. ఆడపిల్ల వద్దంటే భార్య, తల్లి, చెల్లి కూడా వద్దన్నట్టేనని, కడుపులో ఉన్న శిశువును వదులుకోవాలంటే భర్తగా నిన్నైనా వదులుకుంటానుగానీ శిశువును వదులుకోనని భార్య ప్రతిఘటించడం ఈ నాటిక ఇతివృత్తం. రేఖ, సాంబశివమూర్తి, ప్రభాకర్, చంద్రశేఖర్, పవన్‌కుమార్ తమ తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు.

కె.ఎస్.టి. శాయి రచించిన 'అసమర్థుని డైరీ' నాటిక రచయితల జీవితాల్లోని చీకటి కోణాన్ని ఆవిష్కరించింది. రచయితకు ఎటువంటి సంపాదన లేకపోవడంతో ఇంట్లో విలువ ఇవ్వరు. తాను ఒక నాటిక రాయాలని కూర్చుంటే చివరికి అందులోని పాత్రలే అతన్ని వెక్కిరించాయి. రచయితల జీవితాలు అంత సుభిక్షంగా ఉండవనే సందేశంతో ఈ నాటిక ముగుస్తుంది. డి. లింగస్వామి దర్శకత్వం వహించిన ఈ నాటికలో పవిత్రం, రేఖ, సంతోష్, పవన్‌కుమార్, భానుప్రకాష్, లింగస్వామి వివిధ పాత్రలు ధరించారు. రంగస్థల కళల శాఖ అధ్యక్షురాలు డా.బి.హెచ్. పద్మప్రియ పర్యవేక్షించారు. విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఈ ప్రదర్శనలను తిలకించి కళాకారులను ప్రశంసించారు.

# ఇంకుడు గుంతల ఏర్పాటు



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి 2016 ఏప్రిల్ 30 ప్రారంభించారు. నీటి వృథాను మానుకొని ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి జల సంపదను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఇళ్ళలో, కార్యాలయాల్లో అంతటా ఒక ఉద్యమంలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఎక్కడికక్కడ ఇంకే ఆ నీరు దాచుకున్న నిధిలా ఉపయోగపడుతుందని శివారెడ్డి వివరించారు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా స్వీకరించవలసిన తక్షణావశ్యకత ఈనాడుందని అన్నారు.

రిజిస్ట్రారు ఆచార్య కె. తోమాసయ్యతో కలిసి ఆచార్య శివారెడ్డి విశ్వవిద్యాలయం ఆవరణలో ఇంకుడు గుంత తవ్వారు. విశ్వవిద్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం




కవులు, కళాకారులు జాతి రత్నాలని, వారిని గుర్తించి గౌరవించడం బాధ్యతగా భావించాలని ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి అన్నారు. తెలుగు భాషా, సాహిత్యం, కళలు, సంస్కృతి, హేతువాదం, మహిళాభ్యుదయం, అవధానం, ఇంద్రజాలం, సంఘసేవ, తదితర రంగాల్లో విశిష్ఠ సేవలందించిన 36 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2014 కీర్తి పురస్కారాలను 2016 మే 12వ తేది గురువారం ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణాచారి, విశిష్ఠ అతిథిగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక విధి నిర్వహణాధికారి దేశపతి శ్రీనివాస్ హాజరయ్యారు. సభకు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు.

రమణాచారి మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి గౌరవించడం ప్రభుత్వం బాధ్యతన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులకు కీర్తి పురస్కారాలు అందజేయడం ఆనందదాయకమన్నారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకుంటేనే మనుగడ ఉంటుందన్నారు. ఆంగ్లం అనేది భావాలను పంచుకునే మాధ్యమం మాత్రమేనన్నారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజం ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిందనేది సమాజంలోని

కళలే చెబుతాయన్నారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులను గుర్తించి కీర్తి పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి పురస్కారాలను అందుకున్న వారందరికి ఉపాధ్యక్షులు అభినందనలు తెలిపారు.

## కీర్తి పురస్కార గ్రహీతలు

వనపట్ల సుబ్బయ్య (సృజనాత్మక సాహిత్యం), ద్యావనపల్లి సత్యనారాయణ (పరిశోధన), శ్రీరమణ (హాస్యరచన), కొండపల్లి నిహారిణి (జీవిత చరిత్ర) ఆమె తరఫున పద్మజ అందుకున్నారు, ఎం. హేమలత (ఉత్తమ రచయిత), రమాదేవి (ఉత్తమ నటి), నిట్టల శ్రీరామమూర్తి (ఉత్తమ నటుడు), డి.వి. రమణమూర్తి (ఉత్తమ నాటక రచయిత), కుర్రాహన్మంతరావు (హేతువాదం), షాజహానా (ఉత్తమ రచయిత్రి), జక్కని వెంకటరాజం (కవిత్వం), కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి (వివిధ ప్రక్రియలు), భండారు శ్రీనివాసరావు (పత్రికారచన), మలుగు అంజయ్య (అవధానం), మాంటిస్సోరి కోటేశ్వరమ్మ (మహిళాభ్యుదయం) తరఫున నందిని అందుకున్నారు, ఎం. రాంచందర్ (గ్రంథాలయకర్త), కె. రమణయ్య (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), సత్యవాడ సోదరీమణులు (కథ), శ్రీపాద కుమారశర్మ (నాటకరంగంలో కృషి), బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి (సంఘసేవ), దెందులూరి పద్మామోహన్ (ఆంధ్రనాట్యం), గూటంస్వామి (నవల), పి. నర్సింహారెడ్డి (భాషాఛ్ఛంద సాహిత్య విమర్శ), మోతె ఉప్పలయ్య (జానపద కళలు), పేట శ్రీనివాసులరెడ్డి (ఆధ్యాత్మిక సాహిత్యం), టి. శ్రీరంగస్వామి (సాహిత్య విమర్శ), రుక్మాంగదరెడ్డి (పద్యరచన), మద్దాళి రఘురాం (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), కొప్పుల హేమాద్రి (జనరంజక విజ్ఞానం) తరఫున వి.వి.ఎస్.రామశాస్త్రి అందుకున్నారు, ప్రభాకర్ (జానపద గాయకుడు), డి. సుజాతాదేవి (బాలసాహిత్యం), కె.బి.కె. మోహన్‌రాజు (లలిత సంగీతం), మర్రి రమేశ్ (ఇంద్రజాలం), అక్కిరాజు సుందరరామకృష్ణ (పద్యరచన), శంకర్ (కార్టూనిస్ట్), నీతాచంద్రశేఖర్ (శాస్త్రీయ సంగీతం) కీర్తి పురస్కారాలు అందుకున్నారు. రూ. 5116 నగదు, శాలువాతో పురస్కార గ్రహీతలను సత్కరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య స్వాగతం పలికారు. డాక్టర్ చెన్నయ్య పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. ప్రోగ్రాం ఇన్‌ఛార్జి రింగు రామ్మూర్తి వందన సమర్పణ చేశారు.

## సృజనాత్మక సాహిత్యం - వనపట్ల సుబ్బయ్య

డా. బెజవాడ గోపాలరెడ్డిగారు వారి తండ్రి బెజవాడ పట్టాభిరామిరెడ్డి స్మృత్యర్థం నెలకొల్పిన సృజనాత్మక సాహిత్య పురస్కారాన్ని వనపట్ల సుబ్బయ్యకు ప్రదానం చేయడం జరిగింది. 1972 జూలై 6న మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ మండలం, వనపట్లలో జన్మించారు. రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర పట్టభద్రులు. పేదరికం నుంచి, జీవన సమరం నుంచి కవిత్వం పుటం పెట్టిన బంగారంలా పుట్టింది ఇతనిలో. జీవితానుభవం,

సామాజిక అవగాహన రెండూ ఇతనిలోని కవిని దిన దిన ప్రవర్ధమానుడ్ని చేశాయి. నాగర్ కర్నూల్‌లో శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదనే సిద్ధాంతాన్ని నిజం చేస్తూ – క్షురక వృత్తిని సగర్వంగా నిర్వహిస్తూ – పేదరికాన్ని జయిస్తూ – కవితా సృజనలో సాహిత్య రంగంలో విజేతగా నిలుస్తూ సాగిపోతున్నారు సుబ్బయ్య 'వొల్లెడ' పేరుతో సకల జనుల సమ్మె పైన దీర్ఘకవిత రాశారు. 'మశాల్' పేరుతో తెలంగాణ మహోద్యమ కావ్యం రాశారు. ఊర చెరువు పేరుతో మరొక దీర్ఘ కవితను, 'కుర్చీ' అనే తాజా కవితా సంపుటినీ ప్రచురించారు. తెలంగాణ కవితాత్మను వనపట్ల సుబ్బయ్య రచనలో గుర్తించి పలవరించవచ్చు.

## పరిశోధన – డా. ద్యావనపల్లి సత్యనారాయణ

డా. బెజవాడ గోపాల్‌రెడ్డి నెలకొల్పిన తిక్కవరపు రామిరెడ్డి స్మారక పరిశోధన పురస్కారాన్ని ఈ సంవత్సరం యువ పరిశోధకుడు డా. ద్యావనపల్లి సత్యనారాయణ అందుకున్నారు. కరీంనగర్ జిల్లాలో 1975లో జన్మించిన సత్యనారాయణ చిన్నప్పటి నుంచి అన్ని తరగతుల్లోనూ ప్రతిభావంతునిగా పేరు పొందారు. చరిత్ర, తెలుగు, ఆంగ్ల భాషా సాహిత్యాల్లో స్నాతకోత్తర స్థాయి పట్టభద్రుడై 'ఎన్విరాన్‌మెంటల్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఉద్యోగరీత్యా క్లాస్‌వన్ గెజిటెడ్ అధికారిగా పనిచేస్తూనే, చరిత్ర పరిశోధన కొనసాగిస్తున్నారు. ప్రముఖ దినపత్రికల్లో పరిశోధన వ్యాసాలను ప్రచురిస్తున్నారు. 'రామప్ప', 'రాచకొండ' వంటి తెలంగాణ చారిత్రక ప్రదేశాలపైన, కొమురం భీమ్‌పైన మోనోగ్రాఫ్‌లు రచించారు. 16 చరిత్ర పూర్వ యుగపు చారిత్రక విశేషాలను తన పరిశోధన ద్వారా వెలికి తీసారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు తెలంగాణ చరిత్రపై ప్రామాణిక గ్రంథాలు రచించారు.

## హాస్య రచన – శ్రీరమణ

కపిలేశ్వరం జమీందారు ఎస్.పి.పి.బి.కె. సత్యనారాయణరావు వారి తండ్రిగారైన శ్రీ బలుసు బుచ్చి సర్వారాయుడు స్మృత్యర్థం నెలకొల్పిన హాస్య రచనా పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ కథా రచయిత, పాత్రికేయులు శ్రీరమణ గారికి అందించడం జరిగింది. శ్రీకాలం, హాస్యజ్యోతి, శ్రీరమణ పేరడీలు, గుత్తొంకాయ కూర మానవ సంబంధాలు ఇలా అనేక పత్రికల్లో శీర్షికలు రాస్తూ సున్నితమైన హాస్యాన్ని పాఠకలోకానికి అందిస్తున్నారు. చిన్న వయసులోనే కలం పట్టి సమ్మోహనాస్త్రాలవంటి రచనల్ని సంధించిన సాహితీమూర్తి. బంగారు మురుగు, ధనలక్ష్మి, మిథునం వంటి శ్రీరమణ కథలు ఒక్కో కథే ఒక్కో కావ్య గౌరవాన్ని పొందాయి. భక్తి పత్రికకు ప్రస్తుతం సంపాదకలుగా ఉన్నారు. బాపూ, రమణలతో కలసి పని చేసి బాపూ, రమణ శ్రీరమణత్రయంగా కొత్త పేరును తోడు చేశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం నిండిన విలక్షణమైన శ్రీరమణ శైలి తెలుగు పాఠకులకు లభించిన వరం. ఆపకుండా చదివించే గుణం ప్రత్యేక ఆకర్షణ. త్వరలో శ్రీరమణ రచించిన 20 పుస్తకాలు వెలువడబోతున్నాయనే వార్త శుభవార్త.

## జీవిత చరిత్ర – కొండపల్లి నీహారిణి

గడచిన తరం తెలంగాణ తెలుగు ప్రముఖులు ఇల్లిందల సీతారామచంద్రరావు, సరస్వతీదేవి స్మారక జీవిత చరిత్ర పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కొండపల్లి నీహారిణికి ప్రదానం చేయడం జరిగింది. 'అర్ర తలుపులు' అనే కవితా సంపుటిని, వ్యాస హారిక అనే వ్యాస సంపుటిని వెలువరించారు. ఒద్దిరాజు సోదరుల జీవితం, సాహిత్యాలపై విశేషమైన పరిశోధన చేసి డాక్టరేట్‌కు అర్హులయ్యారు. తెలంగాణలో ప్రముఖ చిత్రకారులు, చిత్రకళా తపస్వి డా॥ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర నీహారిణికి ఎంతగానో పేరు తెచ్చిపెట్టింది. జ్వలిత చేతనం – ఒక యోధుని గాథ పేరుతో మరొక జీవిత చరిత్రను, అమెరికాలో ఆరు నెలలు అనే యాత్ర చరిత్రను రచించారు.

## ఉత్తమ రచయిత్రి – శ్రీమతి ఎం. హేమలత

విశిష్ట రచయిత్రి శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ నాళం కృష్ణారావుగారి స్మృత్యర్థం నెలకొల్పిన ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఎం. హేమలత గారికి అందచేయడం జరిగింది. ప్రముఖ పారిశ్రామిక వేత్తల ఇంట నాటి మద్రాసులో జన్మించి అక్కడ విద్యాభ్యాసం చేసిన హేమలత తెలుగు భాషా సాహిత్యాల్లో ప్రెసిడెన్సి కళాశాలలో స్నాతకోత్తర పట్టభద్రులు. 50 ఏళ్ళుగా కథలు, నవలలు, నాటికలు రాస్తూ నిశ్శబ్ద సాహితీ సృజన చేస్తున్నారు. సంప్రదాయం పట్ల అనురక్తి, ఆధునికతను ఆహ్వానించే దృష్టి వీరి రచనల్లో ముఖ్యంగా ప్రతిబింబిస్తాయి. రీసస్ శిశువులు, సరగేట్స్ మదర్స్, మెర్సీకిల్లింగ్, ఆటిజం... వంటి వైద్య శాస్త్ర సంబంధమైన అంశాల్లో కూడా ఆద్యంతం ఆసక్తిని గొల్పే రచనలు చేశారు. ఇలాంటి కథలు రాయడం కోసం ప్రపంచాన్ని అధ్యయనం చేశారు. కాలం ఎన్ని రకాలైన మార్పులు తెస్తున్నా మానవ సంబంధాల్ని విస్మరించరాదని చెప్పే ఆదర్శ రచయిత్రి శ్రీమతి ఎం. హేమలత.

## ఉత్తమ నటి – దాసరి రమాదేవి

కళాప్రపూర్ణ పైడి లక్ష్మయ్య స్మారక ఉత్తమ నటి పురస్కారాన్ని డా.పి.ఎల్. సంజీవరెడ్డి గారు నెలకొల్పారు. ఈ సంవత్సరం ప్రముఖ రంగస్థల నటి శ్రీమతి దాసరి రమాదేవిగారికి బహూకరించడం జరిగింది. 1955లో కృష్ణాజిల్లా గుడివాడలో జన్మించినారు. 1973లో 'గాజు పెంకులు' నాటకం ద్వారా పరిషత్తు నాటక రంగంలో ప్రవేశించిన రమాదేవి భర్త దాసరి రామమోహన్‌రావు ప్రోత్సాహంతో ఉత్తమ శ్రేణి రంగ స్థల నటిగా ఎదిగారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న దశలో కూడా కళామతల్లి ఒడిలో నటిగా సంపాదించిన చిన్న మొత్తం ఆదుకునేది. మరోవైపు కళాకారిణిగా తన ఆర్తిని తీర్చింది. రమాదేవి సాంఘిక, చారిత్రక, పౌరాణిక, జానపద నాటకాల్లో లెక్కకు మించి ప్రదర్శనలిచ్చారు. ఇప్పటి వరకు సుమారు 200ల సార్లు ఉత్తమ నటిగా బహుమతులు పొందడం విశేషం. రెండు సార్లు నంది అవార్డు, రెండు సార్లు గరుడ అవార్డులు అందుకున్నారు. ఆత్మీయులు,

చక్రవాకం, సంసారం సాగరం తదితర టెలివిజన్ ధారావాహికల్లోనూ రమాదేవి ముఖ్యపాత్రలు ధరించారు.

## ఉత్తమ నటుడు – నిట్టల శ్రీరామ్మూర్తి

కళాప్రపూర్ణ పైడి లక్ష్మయ్య స్మృత్యర్థం వారి కుమారుడు డా.పి.ఎల్.సంజీవరెడ్డి గారు నెలకొల్పిన ఉత్తమ నటుని పురస్కారం అందుకున్న నిట్టల శ్రీరామ్మూర్తి 1946 నవంబర్ 10న మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌లో జన్మించారు. 1970లో నాటక రంగంలో పాదం మోపి నేటికీ ప్రముఖ నటులుగా కొనసాగుతున్నారు. ఉత్తమ నటునిగా, ప్రతినాయకునిగా, హాస్యనటునిగా అనేక మార్లు అవార్డులందుకున్నారు. శివరంజని, కొడుకుపుట్టాల, కనక పుష్యరాగం, కెరటాలు, గోగ్రహణం, అతిథి దేవుళ్ళు, కళ్ళు, కుక్క, సంధ్యాఛాయ... ఇలా నాటకరంగ చరిత్రలో కలకాలం చెప్పుకోదగ్గ నాటకాల్లో గుర్తుంచుకోదగ్గ నటన ప్రదర్శించి ప్రత్యేకతను నిట్టల దక్కించుకున్నారు. నంది నాటకోత్సవాల్లో బహుమతులందుకోవడమే గాక న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించారు. ఒక్క 'అందమే ఆనందం' నాటకంలో నటనకే 14 సార్లు ఉత్తమ హాస్యనటుని అవార్డునందుకున్నారు. టీవీ సీరియళ్ళలో ప్రముఖ నటులుగా ప్రేక్షకాదరణ పొందడమే కాకుండా అవార్డులు కూడా అందుకున్నారు.

## ఉత్తమ నాటక రచయిత – డి.వి. రమణమూర్తి

కళాప్రపూర్ణ పైడి లక్ష్మయ్య స్మృత్యర్థం ఆయన కుమారుడు పి.ఎల్. సంజీవరెడ్డి నెలకొల్పిన ఉత్తమ నాటక రచయిత పురస్కారాన్ని ఈసారి డి.వి. రమణమూర్తిగారికి బహూకరించడం జరిగింది. నటునిగా, నాటక రచయితగా, పరిషత్తుల్లో న్యాయనిర్ణేతగా రమణమూర్తి విశేషమైన అనుభవాన్ని సముపార్జించారు. రంగస్థల ప్రదర్శన కోసం అనేక నాటకాలు రాశారు. ఆకాశవాణిలో శతాధిక నాటకాలు ప్రసారమై శ్రోతలకు డి.వి. రమణమూర్తి పేరును చిరపరిచితం చేశాయి. 1970లో వీరి 'వాగ్దానం' నాటకం అఖిల భారత రేడియో నాటక ప్రసారాల్లో ఉత్తమమైందిగా ఎంపికై బహుమతిని అందుకున్నది. దూరదర్శన్‌లో కూడా వీరి నాటకాలు ప్రసారమయ్యాయి. వీరు రచించిన 'సంసారం, సంసారం' టెలిఫిల్మ్‌కు ఐదు నంది అవార్డులు లభించాయి.

## హేతువాద ప్రచారం – కుర్రా హనుమంతరావు

హేతువాద ప్రచారంలో కృషి చేసినవారికి బహూకరించడానికి సంఘ సేవకులు కోటపాటి మురహరిరావు స్థాపించిన ఈ పురస్కారాన్ని ఈ సంవత్సరం కుర్రా హనుమంతరావు గారికి ప్రదానం చేయడం జరిగింది. 1960 ఆగస్టు 14న జన్మించిన హనుమంతరావు రాజనీతిశాస్త్ర అధ్యాపకులుగా 30 సంవత్సరాలు సేవలందించారు. హేతువాద ఉద్యమంలో గత 25 సంవత్సరాలుగా పనిచేస్తూ హేతువాద సభలు, సమావేశాల్లో

వక్తగా, వ్యాస రచయితగా, గ్రంథ రచయితగా సేవలందించారు. 'హేతువాద' పత్రికలో శాస్త్రీయ దృక్పథం, మానవవాదం, మంత్రతంత్రాలు, మూఢనమ్మకాలు మొదలైన అనేక అంశాలపై సాధికారకమైన వ్యాసాలు ప్రచురించారు. భారత హేతువాద సంఘం అధ్యక్షులుగా సేవలందించారు. రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో కీలక పాత్ర నిర్వహిస్తున్న హనుమంతరావు మంచి నటులు కూడా. 25 నాటకాల్లో నటించారు. నాటక రచనలో కూడా అనుభవం ఉంది.

## ఉత్తమ రచయిత్రి - షాజహానా

ప్రముఖ రచయిత్రి డా. వాసిరెడ్డి సీతాదేవిగారు తమ మాతృమూర్తి వాసిరెడ్డి రంగనాయకమ్మగారి స్మృత్యర్థం నెలకొల్పిన ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ కవయిత్రి, కథకురాలు డా. షాజహానా గారికి బహూకరించడం జరిగింది. తండ్రి డా. దిలావర్ సాహిత్య వారసత్వ స్ఫూర్తితో రచనలు చేయడం ప్రారంభించి జీవన సహచరుడు స్కైబాబ ప్రేరణ, సహకారాలతో సొంత గొంతును పలికిస్తూ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ముస్లిం స్త్రీల సంవేదనలు, మనోభావాలు ప్రతిఫలించే 'నఖాబ్' వచనా కవితా సంపుటి, 'దర్దీ' కవితా సంపుటి వెలువరించారు. స్కైబాబతో కలిసి 'చాంద్‌తార' మినీ కవితా సంపుటి ప్రచురించారు. అలాగే ముస్లిం సంస్కృతి కవిత్వానికి సంపాదకత్వం వహించారు. తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగులో ముస్లింవాద సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. భారత ప్రభుత్వ ప్రతినిధిగా జర్మనీలో జరిగిన ఫ్రాంక్‌ఫర్ట్ బుక్‌ఫేర్‌లో పాల్గొన్నారు. మాస్కో బుక్‌ఫేర్‌లో కవితా పఠనం చేశారు.

## వచన కవిత - జక్కని వెంకటరాజం

వచన కవిత్వంలో అమిలినేని లక్ష్మీ రమణ స్మారక కీర్తిపురస్కారాన్ని అందుకున్న శ్రీ జక్కని వెంకటరాజం 1947 మే 10న కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా నర్మాల గ్రామంలో జన్మించారు. స్వస్థలం గూడెం. 1960-80ల మధ్య ఆధునిక తెలుగు కవిత్వంలో యువతరం కొత్తదారుల్లో నడిచినారు. వచన కవితలెంత బలంగా వెలువడ్డాయో, వాటిపై చర్చ కూడా విస్తృతంగానే జరిగింది. ఆ కోవలో వెంకటరాజం 1973లో వెలువరించిన 'యువస్వరాలు', 1977లో వెలువరించిన 'అర్ధరాత్రి సూర్యుడు' గ్రంథాలను కవితా విమర్శక లోకం ప్రత్యేకంగా పరిగణించి ప్రశంసించింది. చాలాకాలం విరామం తీసుకున్న వెంకటరాజం పద్య రచన చేపట్టి తొలుత ఆటవెలదులు, తేటగీతులు శతకాన్ని, 'వేంకటరాజ శతకం' కందాలను, ఇటీవలే జక్కని రుబాయిలను రచించారు. ఆకాశవాణిలో కవితలు ప్రసారమయ్యాయి. కథకునిగా, రంగస్థల నటులుగా కూడా కృషి చేశారు. సిద్ధ సమాధి యోగ ఆచార్యులుగా సేవలందిస్తున్నారు.

## కోట్ల వెంకటేశ్వరరెడ్డి - వివిధ ప్రక్రియలు

కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య స్మృత్యర్థం డా.ఎస్.ఎన్. కృష్ణమూర్తిగారు నెలకొల్పిన వివిధ ప్రక్రియల పురస్కారాన్ని ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి అందుకున్నారు. 55 ఏళ్ళ కిందట మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. వెంకటేశ్వరరెడ్డి వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి రీత్యా పేరున్న కవి. కవిత్వా భావం విషయానికివస్తే తెలంగాణ ఉద్యమానికి ముందూ, ఉద్యమకాలంలోనూ మౌలికంగా కనిపించేది తెలంగాణ వాదం. ఆర్తి, ఆవేదనల దృష్ట్యా చూస్తే తొలినాళ్ళ కవిత్వం అనిబద్ధంగా సాగితే ఉద్యమకాలంలో సకల జనుల సమ్మె నుంచి సాగరహారం వరకు ప్రతి సంఘటననూ బలంగా చిత్రించడం కనిపిస్తుంది. 'గుండె కింద కవి', 'రహస్యాలు లేని వాళ్ళు', 'నూరు తెలంగాణ నానీలు', 'మనిషెల్లి పోతాండు', 'రంగు వెలసిన జెండా', 'బ్రేకింగ్ న్యూస్', 'నాన్నా నాలా ఎదుగు' వంటి కవితా సంపుటాల్ని ప్రచురించారు. మూడు దశాబ్దాల కవితా కృషికి అనేక పురస్కారాలు లభించాయి.

## పత్రికా రచన - భండారు శ్రీనివాసరావు

సంఘ సేవకులు కోటపాటి మురహరిరావు తాపీ ధర్మారావు స్మృత్యర్థం నెలకొల్పిన పత్రికా రచన పురస్కారాన్ని ఈ సంవత్సరం భండారు శ్రీనివాసరావుకు బహూకరించడం జరిగింది. ఖమ్మం జిల్లాలో జన్మించిన భండారు 1975లో ఆంధ్రజ్యోతిలో ఉపసంపాదకునిగా చేరారు. అనంతరం ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసులో చేరి ఆకాశవాణి విలేఖరిగా దశాబ్దాల కాలం రేడియో రిపోర్టింగ్ ప్రక్రియలో తనదైన చెరగని ముద్ర వేశారు. ఆకాశవాణి ఏకైక సమాచార, వినోద, విజ్ఞానదాయినిగా ఉన్న కాలంలో ఎప్పటికప్పుడు వార్తలందించడమే గాక వారంలో రెండు రోజులు 'వార్తావాహిని'ని ప్రత్యేక సమర్పణగా అందించడం ద్వారా భండారు ఎంతో పేరు పొందారు. 'జీవన స్రవంతి' ప్రత్యేక వార్తా ప్రసారంలో రచనా విధానంలోనూ, చదివే శైలిలోనూ ఆయనకాయనే సాటి. మాస్కో వెళ్ళి కొన్నాళ్ళు రేడియో మాస్కోలో తెలుగు వార్తలు చదివారు. ఆ అనుభవాలను 'మార్పు చేసిన కళ్ళు' పుస్తకం రాశారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో విలేఖరిగా, వార్తా సంపాదకులుగా ఉన్నత స్థాయి సేవలందించి ఉత్తమ రేడియో జర్నలిస్టుగా పేరు పొందారు. న్యూస్ ఛానళ్ళలో విశ్లేషకులుగా నేటికీ కొనసాగుతున్నారు.

## అవధానం - డాక్టర్ మలుగ అంజయ్య

కార్యంపూడి రామకృష్ణారావు, వింజమూరి భాస్కరరావు నెలకొల్పిన శతావధాని కార్యంపూడి రాజమన్నారు స్మారక పురస్కారం స్వీకరించిన డా. మలుగ అంజయ్య రంగారెడ్డి జిల్లా అంగడి చిట్టంపల్లిలో జన్మించారు. పద్యసాహిత్యం, అవధాన కళా నేపథ్యం ఏమాత్రం లేని కుటుంబం నుంచి వచ్చినా చిన్ననాటి నుంచి, ఆ దిశగా విశేష కృషి చేశారు. ఎం.ఎ, ఎం.ఓ.ఎల్. ఉత్తీర్ణులై ప్రాచీనాధునిక సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం

చేశారు. పద్య విద్యలో ప్రత్యేకతను నిలబెట్టుకొంటూ అనేక పద్యకృతులను వెలువరించారు. అవధాన విద్యలో ప్రావీణ్యాన్ని సముపార్జించుకొని ఊరూరా అష్టావధానాలు, శతావధానాలు చేస్తూ ఆశుకవితా సృజనను, ధారణాశక్తిని పెంపొందించుకుంటూ వచ్చారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల వారికి అవధాన కళా మాధుర్యాన్ని పరిచయం చేస్తూ సరళతరమైన భాషను, భావాన్ని అందులో పద్ధతిని ప్రవేశపెట్టారు. అవధాన రంగంలో దశాబ్ది అనుభవం గడించారు. తెలుగు అధ్యాపకులుగా సేవలందిస్తున్నారు.

## మహిళాభ్యుదయం - శ్రీమతి కోటేశ్వరమ్మ

మాంటిస్సోరీ కోటేశ్వరమ్మగా సుప్రసిద్ధులైన వీరు మహిళా విద్య కోసం అనితర సాధ్యమైన కృషి చేశారు. మల్లాది సుబ్బమ్మగారు నెలకొల్పిన మహిళాభ్యుదయ పురస్కారానికి ఈ సంవత్సరం కోటేశ్వరమ్మగారిని ఎంపిక చేయడం జరిగింది. 1925 మార్చి 5న జన్మించిన వీరు విజయవాడలో చిన్న మొక్కగా నాటిన మాంటిస్సోరీ విద్యా సంస్థలు శాఖోపశాఖలుగా విస్తరించాయి. 60 ఏళ్ళ కిందట ఒక్క చేతిమీద ప్రారంభమైన ఈ విద్యా సంస్థలు ఈనాడు ప్రపంచానికే ఆదర్శప్రాయంగా ఎదిగి మహిళాభ్యుదయానికి మహోన్నత ప్రతీకగా నిలిచాయి. పేదలు, మధ్యతరగతి బాలికలకు నీడనిచ్చి వారు విద్యాత్మకంగా ఎదిగి నైపుణ్యాన్ని సాధించి సొంత కాళ్ళ మీద నిలిచేలా చేసిన ఘనత డా.వి. కోటేశ్వరమ్మకు దక్కుతుంది. విద్యావేత్తగా, విద్యాదాతగా, వేలమంది మహిళలకు జీవితాన్నిచ్చిన మాతృమూర్తిగా ఆరాధింపబడుతున్నారు.

## గ్రంథాలయకర్త - డాక్టర్ ఎం. రామచందర్

గ్రంథాలయకర్తకు బహూకరించడానికి అయ్యంకి వెంకట రమణయ్య పేరు మీద డాక్టర్ వెలగా వెంకటప్పయ్య నెలకొల్పిన పురస్కారాన్ని ఈ సంవత్సరం డాక్టర్ ఎం. రామచందర్ అందుకున్నారు. మెదక్ జిల్లా సిద్ధిపేట మండలం పుల్లూరులో జన్మించిన రామచందర్ గత నాలుగు దశాబ్దాలుగా గ్రంథాలయ రంగంలో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. మానవ వనరుల అభివృద్ధి అనే అంశంపై గ్రంథాలయ శాస్త్రంలో పిహెచ్.డి పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. 1971లో గ్రంథాలయాధికారిగా చేరి నిసీయట్, సర్దార్ వల్లభభాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమీ వంటి ప్రతిష్టాత్మక జాతీయ సంస్థల్లో 25 సంవత్సరాల పాటు సేవలందించారు. ఆధునిక గ్రంథాలయ వ్యవస్థ నిర్మాణ నిర్వహణలో తనకున్న అనుభవంతో విధులు నిర్వహించి ప్రశంసలందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూడా డిప్యూటీ లైబ్రేరియన్‌గా సేవలందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ కో-డైరెక్టర్‌గా ఉన్నారు.

## గ్రంథాలయ సమాచార విజ్ఞానం - ఆచార్య కె. రమణయ్య

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గ్రంథాలయ సమాచార విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసిన వారికి

బహూకరించడానికి ఏర్పాటు చేసిన పర్వతనేని గంగాధరరావు కీర్తి పురస్కారాన్ని ఈసారి ఆచార్య కె. రమణయ్యగారికి అందచేయడం జరిగింది. గ్రంథాలయ సమాచార విజ్ఞాన రంగంలో, పరిపాలనలో, పరిశోధనలో, అధ్యాపనంలో 37 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన రమణయ్య కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందినవారు. ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌పై అమెరికాలో పర్యటించి గ్రంథాలయ సమాచార విజ్ఞాన రంగాన్ని అధ్యయనం చేశారు. 17 పరిశోధన పత్రాలు, ఒక గ్రంథాన్ని ప్రచురించారు. ఐదు గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. రెండు కోర్సులకు పాఠ్య గ్రంథాలను రచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 47వ ఆలిండియా లైబ్రరీ కాన్ఫరెన్స్ నిర్వహించడంలో కీలకపాత్ర నిర్వహించారు. సుమారు 50 వరకు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ప్రసంగించారు. అనేక నిపుణుల సంఘాల్లో సభ్యులుగా సేవలందిస్తున్నారు.

## కథ – సత్యవాద సోదరీమణులు

శ్రీమతి బుర్రా అలిమేలు స్థాపించిన బుర్రా వెంకటసుబ్రహ్మణం కథా పురస్కారం స్వీకరించిన సత్యవాద సోదరీమణులు రచయిత్రులే కాకుండా గాయనీమణులు కూడా. వీరిలో ఒకరు రఘునాథమ్మ, మరొకరు సూర్యకుమారి. రఘునాథమ్మ విజయనగరంలో సూర్యకుమారి బొబ్బిలిలో జన్మించారు. భౌతికంగా తామీ లోకాన్ని చూడలేకపోయినా విశాలమైన మనోనేత్ర దృష్టితో భావనామయ ప్రపంచంలో విహరిస్తూ చక్కని కథలు రాస్తున్నారు. ఆకాశవాణి మధురమైన లలితగీతాలను ఆలపించి ఆనందింపజేస్తున్నారు. సూర్యకుమారి వీణా విద్య నిపుణురాలు కూడా. 1976లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో తొలికథ 'ఆదర్శం కోసం' ప్రసారమైంది. ఇప్పటివరకు రాసిన 100కు పైగా కథలను ఆరు సంపుటాలుగా తీసుకొచ్చారు. ఈ సంపుటాలన్నిటికీ తెలుగు విశ్వవిద్యాలయం ముద్రణకు సహాయమందించిందని కృతజ్ఞతాపూర్వకంగా గుర్తు చేసుకుంటారు. కథలే కాకుండా సత్యవాద సోదరీమణులు 'రసమయి', 'పాటల తోట' పేరుతో గేయకవితా సంపుటాలు కూడా ప్రచురించారు.

## నాటకరంగంలో కృషి – శ్రీపాద కుమార శర్మ

నాటక రంగంలో కృషి చేసిన వారికి బహూకరించే నిమిత్తం బుర్రా అలమేలు స్థాపించిన బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం స్మారక పురస్కారాన్ని ఈ సంవత్సరం శ్రీపాద కుమారశర్మ అందించడం జరిగింది. శ్రీ శర్మ జన్మించింది రాజమహేంద్రవరంలో స్థిరపడింది తెలంగాణలో. 45 సంవత్సరాలుగా నిజామాబాద్‌ను తమ నాటక రంగ సేవలకు కేంద్రస్థానంగా తీసుకొని తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థి దశలోనే నటునిగా పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్న శ్రీపాద కుమారశర్మ తెలంగాణలో నాటక కళా వికాసానికి పట్టుకొమ్మగా నిలిచారు. నటునిగా, దర్శకునిగా, నాటక సంస్థా నిర్వాహకునిగా నిరుపమానమైన

కృషి చేశారు. సుమారు 30 నాటకాలు, 60 నాటికల్లో నటించి ఎన్నో బహుమతులు అందుకున్నారు. 1986లో నిజామాబాద్‌లో స్థాపించిన శ్రీ నటరాజ కళానిలయం ద్వారా ఎంతో మంది నటులను, దర్శకులను తీర్చిదిద్దారు. 'విజయాదిత్య ఆర్ట్స్' సంస్థ ద్వారా అనేక నాటకాలను రూపొందించి ప్రదర్శించారు. నంద్యాల, గుంటూరు, రాజమండ్రి తదితర పట్టణాల్లో జరిగిన నంది నాటకోత్సవాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాల పంట పండించుకున్నారు. శ్రీపాద నాటక పరిషత్తు పక్షాన జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహించారు. టీవీ సీరియల్స్‌లో నటించారు. సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## సంఘసేవ - *బబ్బేళ్ళపాటి గోపాలకృష్ణ సాయి*

బి.వి.శర్మ సన్మాన సంఘం ఏర్పాటు చేసిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంఘ సేవా పురస్కారాన్ని ఈ సంవత్సరం బబ్బేళ్ళపాటి గోపాలకృష్ణ సాయికి అందించడం జరిగింది. 1945 అక్టోబర్ 3న కృష్ణా జిల్లా బబ్బేళ్ళపాడులో జన్మించిన సాయి చిన్ననాడే దేశనాయకుల జీవితాల నుంచి స్ఫూర్తి పొంది తన జీవితాన్ని సంఘసేవ కోసం అంకితం చేశారు. సంఘసేవ సాంస్కృతిక సేవ, గ్రామాభివృద్ధి రెండుదారుల్లో కొనసాగిస్తున్నారు. తనకు సంక్రమించిన ఆస్తిని పేదలకు ధారాదత్తం చేసి సర్పంచుగా లభించే 600 రూపాయల గౌరవ వేతనంతో జీవితాన్ని గడుపుతున్నారు. 25వ ఏట గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై 25 ఏళ్ళు కొనసాగారు. మధ్యలో పంచాయితి బి.సి మహిళకు రిజర్వు అయినందుకు తప్పుకొని మళ్ళీ గత 16 ఏళ్ళుగా సర్పంచుగా కొనసాగుతున్నారు. 18 సార్లు ఉత్తమ పంచాయితీగా బహుమతి అందుకున్నారు. 19వ ఏట గ్రామంలో బళ్ళారి రాఘవ కళా సమితిని నెలకొల్పి గత 52 ఏళ్ళుగా కళా సాహిత్య కార్యక్రమాలు, మహనీయుల జయంతులు నిర్వహిస్తూ కళాకారులకు ప్రోత్సాహం, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పద్య నాటకాలు, హరికథలు, బుర్రకథలు, తోలు బొమ్మలాటలు, వీధి భాగవతాలు, కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

## ఆంధ్రనాట్యం - *శ్రీమతి దెందులూరి పద్మామోహన్*

పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ నెలకొల్పిన ఆంధ్ర నాట్య పురస్కారాన్ని ఈసారి శ్రీమతి పద్మామోహన్‌కు అందజేయడం జరిగింది. వీరు డా. నటరాజ రామకృష్ణ వద్ద, కళాకృష్ణ వద్ద నాట్య శిక్షణ పొందారు. అతి తక్కువ కాలంలో తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా దేశ విదేశాల్లో ప్రముఖ వేదికల పైన నాట్య ప్రదర్శనలిచ్చారు. 'నవ జనార్ధన పారిజాతం' నృత్యాంశంలో ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. దూరదర్శన్ ఏ గ్రేడ్ నర్తకిగా అనేక మార్లు వీరి నృత్య ప్రదర్శనలు ప్రసారమయ్యాయి. నాట్య విద్యాలయాన్ని నెలకొల్పి ఎంతో మందిని కళాకారిణులనీ తీర్చిదిద్దుతున్నారు. ఆంధ్రనాట్యంపై ప్రత్యేక శ్రద్ధతో రూపొందించిన డాక్యుమెంటరీ నాట్యకళా ప్రాచుర్యానికి ఎంతో దోహదం చేసేదిగా ఉంది.

## నవల – డా. గూటంస్వామి

ఆచార్య బి. అరుణకుమారి నెలకొల్పిన నవలా పురస్కారాన్ని ఈ సంవత్సరం డా. గూటంస్వామికి అందజేయడం జరిగింది. నవలాకారునిగానే గాక వచన, పద్య కవిగా స్వామి లబ్ద ప్రతిష్టులు. ప్రధానంగా వీరు రాసిన 'యశోధర' చారిత్రాత్మక నవల విశేషమైన ప్రాచుర్యం పొందింది. చరిత్రలో బుద్ధుని ఎంతగా స్మరిస్తామో గౌతముడు బుద్ధునిగా మారే క్రమంలో యశోధర త్యాగమయ జీవన గాథను కూడా అంతగా స్మరించాలన్న సందేశం కలిగిన స్వామి గారి యశోధర నవల రెండు ముద్రణలు పొందింది. ఇంకా ఏకీకరణం అనే దీర్ఘ కావ్యం, నీలి పతాక పేరుతో ఒక దళితుని స్వగతం, నల్లతుమ్మ వచన కవితా సంపుటాలు, 'స్వామి శతకం' అనే నీతి పద్యాలు ముద్రితమయ్యాయి. 1969 జూన్ 1న వీరు జన్మించారు.

## భాషాచ్ఛందస్సాహిత్య విమర్శ – ఆచార్య పి. నరసింహారెడ్డి

అబ్బూరి ట్రస్టువారు నెలకొల్పిన అబ్బూరి రామకృష్ణారావు, అబ్బూరి వరద రాజేశ్వరరావు స్మారక భాషాచ్ఛంద సాహిత్యం విమర్శ పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ భాషావేత్త ఛందోవ్యాకరణ శాస్త్రాల్లో సముచిత కృషిని పండించిన ఆచార్య నరసింహారెడ్డి గారికి అందించడం జరిగింది. 1947 జూలై 1న కడప జిల్లా రాయచోటి పెద కాల్వపల్లిలో జన్మించారు. వీరు రచించిన 'తెలుగు సామెతలు', 'ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు' రెండు గ్రంథాలకూ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 1979 నుండి 2007 సంవత్సరం వరకు 28 సంవత్సరాల కాలం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రంలో లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా, పాఠ్య ప్రణాళిక మండలి అధ్యక్షునిగా, డీన్‌గా అనేక హోదాల్లో సేవలందించారు. 25 గ్రంథాలను ప్రచురించారు. "ఆముక్త మాల్యద–భాష' అనేది వీరి పిహెచ్.డి పరిశోధన గ్రంథం. బాల వ్యాకరణం సూత్ర వ్యాఖ్య, వ్యాస వ్యాఖ్య, ఆముక్త మాల్యద పద ప్రయోగ సూచి తదితర గ్రంథాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. 24 పిహెచ్.డిలు, 19 ఎం.ఫిల్‌లకు పర్యవేక్షకులుగా ఉన్నారు.

## చెక్క బొమ్మలాట – జానపదకళలు – మోతే ఉప్పలయ్య

ప్రముఖ సినీ కళాకారులు, కళా పరిశోధకులు డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి తమ సతీమణి కళాకారిణి సీతారత్నంగారి స్మృత్యర్థం ఏర్పాటు చేసిన జానపద కళా పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ చెక్కబొమ్మలాట కళాకారుడైన మోతే ఉప్పలయ్యకి ప్రదానం చేయడం జరిగింది. వరంగల్ జిల్లా అమ్మాపురం జానపద కళలకు పుట్టినిల్లు. చెక్క బొమ్మల కళారూపానికి, ఆ కళలో పండిపోయిన మోతే ఉప్పలయ్యకు అమ్మాపురమే అమ్మ. నాలుగు తరాలుగా మోతే వారు చెక్క బొమ్మల కళను నమ్ముకొని పల్లె ప్రజలకు తమ కళను పంచి పెడుతూ సార్థక జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఉప్పలయ్య తమ పారంపర్యంగా లభించిన చెక్కబొమ్మల కళారూపంలో సుమారు 20 కథలు కాగితం చూడకుండా గానం చెయ్యగలరు. చెక్కబొమ్మలతో వివిధ

పాత్రలను సృష్టిస్తూ ఆ పాత్రలకు తానే సంభాషణలు చెప్తూ, పాటలు పాడుతూ కథ నడుపుతారు. ఎంతో మందిని కళాకారులుగా తయారు చేశారు.

## ఆధ్యాత్మిక సాహిత్యం - డాక్టర్ పేట శ్రీనివాసులరెడ్డి

వదాన్యులు బాదం రామస్వామి నెలకొల్పిన బాదం సరోజాదేవి స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది డాక్టర్ పేట శ్రీనివాసుల రెడ్డికి ప్రదానం చేయడం జరిగింది. పేటశ్రీగా సుప్రసిద్ధులైన శ్రీనివాసులరెడ్డి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా ఉన్నారు. శ్రీ వేంకటేశ్వరుడు, కొండ కతలు, తిరువీధులు, తిరుపతి కథలు మొదలైన ఆధ్యాత్మిక భావ నిర్భరమైన రచనల ద్వారా తిరుమల శ్రీవేంకటేశ్వరుని గురించీ, తిరుమల-తిరుపతి పుణ్యక్షేత్రంలోనూ, ఆ పరిసర ప్రాంతాల్లోనూ ఉన్న అనేక క్షేత్రాల మహాత్మ్యాన్ని గురించి విపులంగా రాశారు. ప్రముఖ పత్రికల్లో తిరుపతి కథలను ధారావాహికంగా ప్రచురించి భక్తకోటికి తెలియని ఎన్నో విషయాలు అందించారు. చిత్తూరు జిల్లా జానపద గీతాలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన శ్రీనివాసులరెడ్డి జానపద విజ్ఞాన రంగంలో కూడా విశేష సేవలందించారు.

## సాహిత్య విమర్శ - డాక్టర్ టి. శ్రీరంగస్వామి

పిల్లలమర్రి జగన్నాథం, వేదవతి గార్ల స్మృత్యర్థం వారి కుమార్తె ఆచార్య పి. లీల నెలకొల్పిన సాహిత్య విమర్శ కీర్తి పురస్కారాన్ని ఈ సంవత్సరం డాక్టర్ టి. శ్రీరంగస్వామికి అందజేయడం జరిగింది. 1949 జూలై 27న కరీంనగర్ జిల్లా పల్లెపల్లిలో జన్మించిన శ్రీరంగస్వామి విశ్వనాథవారి కృష్ణ కావ్యాలపై పిహెచ్.డి పరిశోధన చేశారు. వచన కవితలు, పరిశోధనలు, వ్యాసాలు, కథా సంపుటాలు, అనువాదాలు ఇలా అన్ని ప్రక్రియల్లో రచనలు వెలువరించారు. కోవెల సుప్రసన్న, దేవులపల్లి రామానుజరావు, సాహితీ గవాక్షం, శ్రీవ్యాసం, సమూహ మొదలైన సాహిత్య విమర్శా రచనలు వెలువరించారు. వరంగల్లు సాహితీమూర్తులపై, తెలంగాణ సాహిత్య స్వరూపాలపై ప్రత్యేక సంపుటాలు ప్రచురించారు. సుమారు 200 సదస్సులను నిర్వహించి సదస్సు పత్రాలతో ప్రత్యేక సంచికలను ముద్రించారు.

## పద్య కవిత్వం - వై. రుక్మాంగదరెడ్డి

డా. నందూరి రామకృష్ణమాచార్య స్మారక కీర్తి పురస్కారాన్ని ప్రముఖ పద్య కవి వై. రుక్మాంగద రెడ్డి గారికి ప్రదానం చేయడం జరిగింది. డాక్టర్ నందూరి విద్యారణ్యస్వామి, వారి ఇతర కుటుంబ సభ్యులు ఈ పురస్కారాన్ని నెలకొల్పారు. పురస్కార గ్రహీత రుక్మాంగదరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ వాస్తవ్యులు. 1942 మే 1న జన్మించారు. ప్రాథమిక పాఠశాల నుండి కళాశాల వరకు 51 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు అధ్యాపక వృత్తి నిర్వహించారు. 50 ఏళ్ళ క్రిందట ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో దీపావళి కథల

పోటీల్లో రుక్మాంగదరెడ్డి గారి కథకు బహుమతి వచ్చింది. ఆనాటి నుండి సాహితీ సృజన యాత్ర కొనసాగుతున్నది. పద్యంపైన ప్రత్యేకమైన అభిరుచితో రచనలో ప్రావీణ్యాన్ని సాధించారు. పద్య కవిత్వమే గాకుండా, 'ఒకే ఒక్కడు' శ్రీశ్రీ పేరుతో దీర్ఘకవిత, 'ఉరుములు, మెరుపులు' పొట్టి కవితలు, 'ఉన్నోళ్ళు పోయినోళ్ళు' స్మృతి గీతాలు... ఇలా అనేక రకాలైన రచనలు చేశారు. సరళ సుందరమైన వస్తురూప సమన్వయంతో కూడిన అలంకారయుతమైన పద్య రచన చేయడంలో రుక్మాంగదరెడ్డి సిద్ధహస్తులు.

## సాంస్కృతిక సంస్థా నిర్వహణ - మద్దాళి రఘురామ్

వంగా లక్ష్మణరెడ్డి స్మృత్యర్థం వి.వి. రాఘవరెడ్డి నెలకొల్పిన సాంస్కృతిక సంస్థా నిర్వహణ పురస్కారాన్ని ఈ సంవత్సరం మద్దాళి రఘురామ్‌కు ప్రదానం చేయడం జరిగింది. 1951 ఏప్రిల్ 4న నెల్లూరులో జన్మించిన రఘురామ్ ఆ తర్వాత ఖమ్మం, విజయనగరాల్లో విద్యాభ్యాసం చేశారు. హైదరాబాదులో స్థిరపడి ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1977 సంవత్సరంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థను నెలకొల్పి గత 40 ఏళ్ళుగా ఉత్తమ శ్రేణికి చెందిన భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2002లో రజతోత్సవం జరుపుకున్న తర్వాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా సంగీత, నృత్య, నాటక, హరికథ, బుర్రకథ తదితర కళారూపాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఇతోధిక సేవలందించిన తెలుగు ప్రముఖుల శతజయంతులు నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా మహోత్సవాలు, 32 రోజుల పాటు బాలల సాంస్కృతికోత్సవాలు ఘనంగా ఏర్పాటు చేశారు. ఏ కార్యక్రమం చేసినా ప్రమాణాల విషయంలో రాజీపడని ఉత్తమ సంస్థా నిర్వాహకులు మద్దాళి రఘురామ్‌గారు.

## జనరంజక విజ్ఞానం - కొప్పుల హేమాద్రి

నాగసూరి సంజీవయ్య స్మృత్యర్థం ఆయన కుమారుడు డా. నాగసూరి వేణుగోపాల్ నెలకొల్పిన జనరంజక విజ్ఞాన కీర్తి పురస్కారాన్ని ఈసారి కొప్పుల హేమాద్రి గారికి అందచేయడం జరిగింది. 1938 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలులో జన్మించారు. బిఎస్సీలో రసాయనిక శాస్త్రం, వృక్షశాస్త్రాలు ప్రత్యేక అంశాలుగా ఎం.ఎస్సీ. పిహెచ్.డి పూర్తి చేశారు. పిల్లల కోసం సరళంగా ఎన్నో రచనలు చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా కథలు రాయడం మొదలుపెట్టారు. 8వ తరగతిలో 'రబ్బరు కట్ల పాము' శీర్షికతో రచించిన కథలు పత్రికలో ప్రచురితమైంది. 'గిరిజన వైద్య సర్వస్వం', వనమూలికా సర్వస్వం వంటి గ్రంథాలను వెలువరించారు. వృక్షశాస్త్రవేత్తగా 25 మొక్కలపై హేమాద్రిగారు పరిశోధించి వాటికి పేర్లు పెట్టారు. తెలుగు ఆంగ్ల భాషల్లో 20 పుస్తకాల్ని వెలువరించారు.

## జానపద గాయకులు - ఎస్. ప్రభాకర్

బుర్రా రాజసోమిదేవి స్మృత్యర్థం శ్రీమతి పి. రాజ్యలక్ష్మిగారు నెలకొల్పిన కీర్తి పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ జానపద గాయకులు ఎస్. ప్రభాకర్ అందుకున్నారు. మెదక్ జిల్లావాసి అయిన ప్రభాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ., ఎం.ఫిల్ పట్టభద్రులయ్యారు. 1979లో ఆకాశవాణిలో జానపద గాయకులుగా పరిచయమైన ప్రభాకర్ ఆనాటి నుంచి గత 36 సంవత్సరాలుగా అటు ఆకాశవాణి, దూరదర్శన్‌లలోనూ, ఇటూ దేశ విదేశాల్లోని ప్రముఖ వేదికలపైనా తమ పాటలతో కళాభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెలంగాణ జానపద గేయ స్వరూపంపై ఎంతో అవగాహనతో ప్రభాకర్ పాడే పాటలు ప్రత్యేకమైన ముద్రవేశాయి. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు చేతులమీదుగా ఉగాది పురస్కారాన్ని, మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా కళారత్నం అవార్డు, డా. కె. రోశయ్య చేతుల మీదుగా ప్రతిష్ఠాతరమైన ప్రతిభా రాజీవ్ పురస్కారాన్ని అందుకున్నారు. నంది అవార్డుల కమిటీ సభ్యునిగా, దూరదర్శన్ ఫిల్మ్ ప్రివ్యూ కమిటీ సభ్యునిగా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ కార్యక్రమ సంఘ సభ్యునిగా విశేషమైన సేవలందించారు.

## బాల సాహిత్యం - శ్రీమతి డి. సుజాతాదేవి

బాలసాహిత్యంలో కృషి చేసినందుకు గుర్తింపుగా శ్రీమతి డి. సుజాతాదేవి ఈ సంవత్సరం నడకుదిటి సుందరాచారి స్మారక కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. కరీంనగర్‌కు చెందిన రచయిత్రి కందేపి రాణిప్రసాద్, వారి భర్త వైద్యనిపుణులు ప్రసాద్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. పురస్కార గ్రహీత సుజాతాదేవి బాలసాహిత్యంలో విశేష కృషి చేశారు. మూడు పాటల పుస్తకాలు, మూడు నవలలు, కొన్ని వ్యాసాలు ప్రచురించారు. 'అందరం ఒకటే', 'సుజలాం సుఫలాం' గ్రంథాలకు జాతీయ బహుమతులందుకున్నారు. 'డా. కొక్కొరొకో' అనే బాలల లఘు చిత్రానికి వీరికి నంది అవార్డు లభించింది. 1946 ఏప్రిల్ 26న ఏలూరులో జన్మించిన సుజాతాదేవి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తెలుగు భాషాసాహిత్యాల్లో స్నాతకోత్తర పట్టభద్రులయ్యారు.

## ఇంద్రజాలం - మర్రి రమేశ్

ప్రముఖ ఐంద్రజాలికులు, అగ్రశ్రేణికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు బి.వి. పట్టాభిరామ్ నెలకొల్పిన ఉత్తమ ఇంద్రజాలికుల పురస్కారాన్ని ఈ సంవత్సరం మర్రి రమేశ్ స్వీకరించారు. 1964 ఆగస్టు 15న మెదక్ జిల్లా కౌడిపల్లిలో జన్మించిన రమేశ్ ఒకవైపు ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూనే మరోవైపు శ్రద్ధగా ఇంద్రజాలకళను నేర్చుకొని ఉన్నతోద్యోగిగా, ఉత్తమశ్రేణి కళాకారునిగా పేరు తెచ్చుకున్నారు. ఇరవై ఐదేళ్ళపాటు సుమారు 6 వేల ప్రదర్శనలతో లక్షలాది మంది ప్రేక్షకులకు తన ఇంద్రజాల కళను అందించి కళా రజతోత్సవాన్ని జరుపుకున్నారు. అసాధారణమైన అంశాలను సృష్టించి గొప్ప గొప్ప వేదికలపై ప్రదర్శించారు. 'మ్యాజిక్

బస్'ను రూపొందించుకొని తమ సహాయకులతో కలిసి బస్సులో రాష్ట్రమంతా పర్యటించి పూర్తిస్థాయి ప్రదర్శనలిచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితుల సహాయార్థం ప్రదర్శనలిచ్చి నిధులు సేకరించి అందించారు. ఎన్నో అవార్డులు రమేశ్‌ను వరించాయి.

## పద్యకవిత్వం - డా. అక్కిరాజు సుందరరామకృష్ణ

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, పద్యకవితా పరిశోధకులు డా.కె.వి. రమణగారు నెలకొల్పిన పద్యకవితా పురస్కారాన్ని ఈసారి ప్రముఖ పద్యకవి, మధుర గాయకులు, నటులు డా. అక్కిరాజు సుందరరామకృష్ణ స్వీకరించారు. గుంటూరుజిల్లా నర్సరావుపేటలో 1949 ఏప్రిల్ 23న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'వెంకట పార్వతీశ్వర కవులు - రామాయణ పద్యకృతులు' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఛందో అలంకార సమన్వితమైన అద్భుత పద్యకృతులను వెలయించి పద్యకవిగా పేరుగాంచిన సుందర రామకృష్ణ ఆ పద్యాలను సుమధురంగా గానం చేయడం ద్వారా బంగారానికి తావిని సంతరించారు. శంకరనారాయణీయము, శ్రీ శనీశ్వర శతకము, కవితాశారథి దాశరథి, ఆంజనేయ శతకం, భీమలింగ శతకం మొదలైన అనేక పద్యకృతులు వెలయించారు. సినీ, టీవీ నటులుగా కళారంగం పై చెరగని ముద్రవేశారు. ముతామేస్త్రి, ఠాగూర్, శివ, ఎగిరేపావురమా వంటి సుమారు 100కు పైగా చిత్రాల్లో నటించారు. టీవీ సీరియల్స్‌లో ఆదికవి నన్నయ్య, శ్రీనాథ, పెద్దన వంటి పాత్రల్ని ధరించారు. తెలుగు అధ్యాపకులుగా సేవలందించారు.

## కార్టూనిస్ట్ - శంకర్

ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, నిజామాబాద్‌కు చెందిన శ్రీమతి జి. అమృతలత నెలకొల్పిన ఉత్తమ కార్టూనిస్టు పురస్కారాన్ని ఈ సంవత్సరం సాక్షి కార్టూనిస్టు శంకర్‌కు అందజేయడం జరిగింది. నల్గొండ జిల్లాలో మారుమూల గ్రామం నాగిరెడ్డిపల్లిలో 1963 మార్చి 3న పామర్తి శంకర్ జన్మించారు. చిన్నప్పటి నుంచే చిత్రకళపై అభిరుచి ఏర్పడింది. డ్రాయింగ్ అధ్యాపకునిగా కొంత కాలం పనిచేసిన తర్వాత 28వ ఏట హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. జర్నలిజంలో కార్టూనిస్టుగా నిత్యం సవాలుతో కూడుకున్న వృత్తిని చేపట్టారు. వార్త, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో శంకర్ వేసిన రాజకీయ వ్యంగ్య చిత్రాలు ఆయనను కార్టూనిస్టుల్లో అగ్రస్థానంలో నిలబెట్టాయి. మరీ ముఖ్యంగా గత 8 ఏళ్ళ కాలంలో మన దేశంలోనూ విదేశాల్లోనూ అనేక అవార్డులు లభించాయి. రెండుసార్లు హిందుస్తాన్ టైమ్స్ అవార్డు వచ్చింది. మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ అవార్డు పొందిన భారతీయుడు శంకర్. ఏ బొమ్మ తీసుకున్న ఆ వ్యక్తి ఆత్మను పట్టి చూపే విధంగా కార్టూన్ వెయ్యడంలో శంకర్ సాధించిన ప్రత్యేకత చెప్పుకోదగింది. బాపు, మోహన్ వంటి ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టుల ప్రశంసలందుకున్నారు.

## లలిత సంగీతం - కె.బి.కె. మోహన్‌రాజు

లలితసంగీత రంగంలో విశిష్ట సేవలందించిన వారికి బహూకరించడానికి నిజామాబాద్‌కు చెందిన జి. రాజారెడ్డిగారు నెలకొల్పిన పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ గాయకులు కె.బి.కె. మోహన్‌రాజు గారికి ప్రదానం చేయడం జరిగింది. 1933 అక్టోబర్ 15న విజయవాడలో జన్మించిన మోహన్‌రాజు తండ్రి రంగస్థల నటులు కావడంతో బాల్యదశలోనే పద్యాలు నేర్చుకుని పాడడం మొదలుపెట్టారు. అమ్మ దగ్గర పాటలు పాడడం నేర్చుకున్నారు. 1949లో అంటే16 ఏళ్ళ ప్రాయం నుండే వేదికలపై లలిత గీతాలు, సినిమా పాటలు పాడుతూ శ్రోతల ప్రశంసలందుకుంటున్నారు. 47 ఏళ్ళగా ఆకాశవాణిలో లలిత సంగీతంలో ఆడిషన్స్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతూ టాప్‌గ్రేడ్ గాయకునిగా ఉన్నారు. 40 ఏళ్ళుగా దూరదర్శన్‌లోనూ పాడుతున్నారు. సినీ నేపథ్య గాయకులుగా పూలరంగడు, తాసిల్దారుగారి అమ్మాయి, సాక్షి, పెద్దన్నయ్య, ఇన్‌స్పెక్టర్ భార్య, మా భూమి తదితర చిత్రాల్లో పాటలు పాడారు. తెలుగు లలిత సంగీత చరిత్రలో 8000లకు పైగా ప్రదర్శనల్లో పాల్గొని, 65 ఏళ్ళుగా తరగని గాన సంపదను కలిగి ఉన్న కె.బి.కె. మోహన్‌రాజు అత్యంత అరుదైన కళాకారులు.

## శాస్త్రీయ గాయని - డాక్టర్ నీతా చంద్రశేఖర్

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. రావూరి భరద్వాజ తమ సతీమణి కాంతమ్మ స్మృత్యర్థం నెలకొల్పిన శాస్త్రీయ గాయని పురస్కారాన్ని విదుషీమణిగా వినుతికెక్కిన డాక్టర్ ఎన్. నీతా చంద్రశేఖర్‌కు ప్రదానం చేయడం జరిగింది. పదవ తరగతిలో కృష్ణాజిల్లా కంతటికీ ప్రథమ స్థానం పొందింది మొదలు ప్రతి మెట్టులోనూ ప్రతిభావంతురాలిగా రాణించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. సంగీతం ఉత్తీర్ణులయ్యారు. “కర్ణాటక సంగీతంలో శాస్త్రీయత” అనే అంశంపై పిహెచ్.డి పరిశోధన చేసి పర్యవేక్షకులుగా ఉన్న డా. శ్రీపాద పినాకపాణి ఆశీస్సులను మెండుగా పొందారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, పద్మశ్రీ ఓలేటి వెంకటేశ్వర్లు, ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ, ప్రొ. ఎస్.ఆర్. జానకిరామన్ వంటి మహా విద్వాంసుల వద్ద సంగీత శాస్త్ర రహస్యాలను అభ్యసించారు. గాత్ర సంగీతంలోనే కాకుండా వీణావాద్యంలో కూడా అపారమైన ప్రావీణ్యాన్ని సముపార్జించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫెలోషిప్, విశ్వవిద్యాలయ బంగారు పతకం, ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ ప్రసారంలో పాడిన అరుదైన అనుభవం అత్యున్నత శ్రేణీ గౌరవం, సంగీత శాస్త్రంపై ఎన్నో సదస్సుల్లో ప్రసంగాలు. ఇవన్నీ నీతగారి ప్రతిభకు నిదర్శనాలు. తెలుగు విశ్వవిద్యాలయంలో 1988 నుంచి సంగీత శాఖ అధ్యాపకులుగా సేవలందిస్తున్నారు.

# బి. సుధాకర్‌రెడ్డి పదవీ విరమణ




పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి. సుధాకర్‌రెడ్డి వయసురీత్యా 2016, మే 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరం వీడ్కోలు సభను ఏర్పాటు చేయడం జరిగింది.

సభకు అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య బి. సుధాకర్ రెడ్డి దంపతులను విశ్వవిద్యాలయం పక్షాన ఘనంగా సత్కరించి వారికి విశ్వవిద్యాలయం పక్షాన అందవలసిన ఆర్థిక ప్రయోజనాలను అందజేయడం జరిగింది. అనంతరం రిజిస్ట్రార్ తన ప్రసంగంలో విశ్వవిద్యాలయానికి సుధాకర్ రెడ్డి చేసిన సేవలను కొనియాడుతూ పదవీ విరమణ తర్వాత సుధాకర్ రెడ్డి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అనంతరం వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు సుధాకర్‌రెడ్డిని సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సత్కారాల తర్వాత అశ్వాఖ్ అహ్మద్, దశరథరెడ్డి, డాక్టర్ బి. నమశ్శివాయ, డాక్టర్ ఎ. పార్వతి అభినందిస్తూ ప్రసంగాలు చేశారు.

బి. సుధాకర్‌రెడ్డి పరిపాలనా విభాగం, ప్రచురణల విభాగం, లలిత కళా పీఠంలో సేవలందించారు.

# కవితాత్మక అవతరణోత్సవం




తెలంగాణ రాష్ట్రావతరణ ఉత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో 2016 జూన్ 2 గురువారం జరిగిన సదస్సు, బృహత్కవి సమ్మేళనం, తెలంగాణ గీతాలాపన, జాతీయ పతాకావిష్కరణ తదితర కార్యక్రమాలు తెలంగాణ గొప్పదనాన్ని ప్రతిబింబించాయి. 10 జిల్లాల నుంచి విచ్చేసిన సుమారు 45 మంది కవులు, కవయిత్రులు వస్తువులో, శిల్పంలో, భాషలో, భావంలో తెలంగాణ సాధన అనుభూతిని, సాంస్కృతిక విశిష్టతను, కె. చంద్రశేఖర రావు నేతృత్వంలోని ప్రభుత్వ ప్రస్థానం పట్ల ప్రశంసను, బంగారు తెలంగాణ ఆకాంక్షను వేనోళ్ళ వ్యక్తీకరిస్తూ వైవిధ్యంతో కూడిన కవితలను చదివారు.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో నాళేశ్వరం శంకరం 'పాల్కురికి సోమనాథుని తొలి తెలుగు కవన జీవనది' అని కీర్తించారు. కోడూరి విజయకుమార్ ఈనాడు బడుల్లో తెలంగాణ మహనీయుల గురించి పాఠాలుగా బోధిస్తున్న తీరును వివరించారు. కందుకూరి శ్రీరాములు హైదరాబాదు భిన్న సంస్కృతులను ప్రతీకాత్మకంగా వర్ణించారు. దర్భశయనం శ్రీనివాసాచార్య 'ఏవి' వేయి స్తంభాలు అని ప్రశ్నిస్తూ తెలంగాణ

సాంస్కృతిక పునర్నిర్మాణ ఆకాంక్షను వ్యక్తీకరించారు. ఐనంపూడి శ్రీలక్ష్మి కొత్తతరం తెలంగాణను సామాజిక మాధ్యమాల్లో ఏ విధంగా ఆవిష్కరిస్తున్నదో తన కవితలో వివరించారు. తిరుమల శ్రీనివాసాచార్య "కెసిఆర్ ప్రజల యెదలు పలుకుతున్న భ్రాత" అని అన్నారు. అమ్మంగి వేణుగోపాల్ భాగ్యరెడ్డి వర్మ, సురవరం ప్రతాపరెడ్డి, కొమురం భీం, వట్టికోట ఆళ్వారుస్వామి, ఐలమ్మ, దాశరథి, కాళోజీ, జయశంకర్, తదితర తెలంగాణ వైతాళికులను తన కవితలో స్మరించారు. అనిశెట్టి రజిత తెలంగాణ దేశానికి దిక్సూచి అని, నిన్నటి తెగిన తీగల శిథిల వీణ అని గుర్తు చేశారు. వి.ఆర్. విద్యార్థి తెలంగాణ ఉద్యమ ఘట్టాలను తమ కవితలో వివరిస్తూ తెలంగాణ భరత ఖండపు నాడీమండలం అని అన్నారు.

ఈ కవి సమ్మేళనంలో వనపట్ల సుబ్బయ్య, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఆచార్య వసునందన్, విపి చందనరావు, మాధవీలత, కందాళై రాఘవాచార్య, కారం శంకర్, తిరునగరి దేవకీ దేవి, గుడిపల్లి నిరంజన్, ఉదారి నారాయణ, సిహెచ్. ఆంజనేయులు, అన్నవరం దేవేందర్, తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, కోటం చంద్రశేఖర్, దోరవేటి, డా.జె. బాపురెడ్డి, షాజహానా, యాకూబ్, జాజుల గౌరి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, కాసుల ప్రతాపరెడ్డి, పి. లక్ష్మీనారాయణ, రాపోలు సుదర్శన్, డా. కాంచనపల్లి రాజేందర్ రాజులు వైవిధ్యంతో కూడిన తమ కవితలతో తెలంగాణ ఆత్మను ఆవిష్కరించారు.

## మరుగున పడిన తెలంగాణ సాహిత్యాన్ని వెలికితీయాలి : కె. జితేంద్రబాబు

రెండు వేల సంవత్సరాల ప్రాచీన కాలం నుండీ యావత్ భారతీయ సాహిత్యంలోనే తెలంగాణ సాహిత్యం అగ్రగామిగా ఉన్నదని అయితే మరుగుపడి ఉన్నదని, దీన్ని వెలుగులోకి తేవడం తక్షణ కర్తవ్యమని ప్రముఖ చరిత్ర పరిశోధకులు జితేంద్రబాబు అన్నారు. శాతవాహనుల కాలం నాటి హాలుని గాథాసప్తశతి తెలంగాణ నుంచే వచ్చిందని, గుణాఢ్యుని 'బృహత్కథ' అలభ్యమైనా దాని సంస్కృతానువాదమైన 'కథా సరిత్సాగరం' యావత్ భారతీయ కథా సాహిత్యానికి మూలస్తంభంగా నిలిచిందని ఆయన తెలిపారు. నన్నయ్యకు వంద సంవత్సరాల ముందే తెలంగాణలో ఛందోగ్రంథం ఉన్నదని, తెలంగాణ భాష సంగీతానికి అనువైనదిగా గుర్తింపు పొందిందని అన్నారు. తంజావూరును పాలించిన షహాజి సమకాలికుడైన సోమనార్యుడు వరంగల్ ప్రాంతం నుండి వలస వెళ్ళాడని, ఆ సోమనార్యుని మనుమడే త్యాగరాజ స్వామి అని తెలిపారు. తెలంగాణ కవులు ఆనాడే విస్తృత పర్యటనలు చేస్తూ, పండిత చర్చలు చేస్తూ రచనలు వెలువరించారని అయినప్పటికీ సాహిత్య చరిత్రలో ఇవేవీ చోటు చేసుకోలేదని అన్నారు. జయదేవుడు తెలంగాణలోని పేరూరుకు చెందిన పద్మావతిని వివాహం చేసుకున్నాడని తెలిపారు. ముఖ్యంగా 12, 13, 14 శతాబ్దాల్లో వచ్చిన అపూర్వమైన తెలంగాణ గ్రంథాలను మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం నుంచి తంజావూరు సరస్వతీ మహల్ నుంచి, కేరళ నుంచీ సంపాదించి పునర్ముద్రిస్తే భారతీయ సాహిత్యంలో తెలంగాణ సాహిత్య విశిష్టత ఇనుమడిస్తుందని జితేంద్రబాబు వివరించారు.




విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలంగాణలో తొలి అచ్చు తెలుగు కావ్యం పుట్టిందని, సంస్థానాలు చేసిన సాహిత్య సేవ అపారమైందని అన్నారు. ప్రపంచంలో కళలు, సాహిత్యం ఉద్యమాలకు తోడ్పడ్డాయని కానీ తెలంగాణలో కళలు ఉద్యమాన్ని స్వయంగా నిర్వహించాయని, జానపద కళలకు ఉద్యమంలో ముఖ్యపాత్ర ఉందని వివరించారు.

విశ్వవిద్యాలయం విద్యార్థి సంజీవ్ నేతృత్వంలో సాగిన తెలంగాణ ఉద్యమ గీతాలను ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' అనే పాటతో ప్రారంభమై అమరవీరుల త్యాగాలకు జేజేలు పలుకుతూ పాడిన అనేక గీతాలు ఆకట్టుకున్నాయి. తొలుత కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య స్వాగతం పలికారు.

# దేశ భాషలందు తెలుగు లెస్స

## జాతీయ పతాకావిష్కరణ

ఉదయం విశ్వవిద్యాలయం ఆవరణలో ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభ్యున్నతికి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్ని విధాల తోడ్పాటునందిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి 20 కోట్ల రూపాయలు తెలుగు విశ్వవిద్యాలయానికి మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిందని ఆయన ప్రకటించారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, అధికారులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రత్యేక పుస్తక ప్రదర్శన

తెలంగాణ రాష్ట్రావతరణ ఉత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016 జూన్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించింది. ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 వరకు జరిగి ఈ ప్రదర్శనలో తెలుగు భాషా సాహిత్యాలు, కళా సంస్కృతులకు సంబంధించిన అరుదైన గ్రంథాలు 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు ధరలో అందించడం జరిగింది. అధిక సంఖ్యలో భాషాభిమానులు ఈ గ్రంథాలను కొనుగోలు చేశారు.

# పనే దైవం




ఉద్యోగులు పనిని దైవంగా భావించి, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని పొట్టి శ్రీరాములు తెలుగు 'విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఉద్యోగులకు ఉద్బోధించారు. ప్రజా ధనాన్ని వేతనాలుగా పొందుతున్న మనం నిజాయితీగా ఉండాలనీ, ద్వంద్వ వైఖరి అవలంభించకూడదనీ ఆయన హితవు పలికారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న ఆచార్య కర్నాటి తోమాసయ్య, తులనాత్మక అధ్యయన కేంద్రం సంచాలకులు, విజ్ఞాన సర్వస్వ కేంద్రం డైరెక్టర్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న

ఆచార్య కె. తోమాసయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.కామ్, ఎం.ఎ. లింగ్విస్టిక్స్ చేశారు. అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య పి.ఎస్. సుబ్రమణ్యం పర్యవేక్షణలో భాషాశాస్త్రంలో పిహెచ్.డి చేశారు. తెలుగు విశ్వవిద్యాలయంలో తేది 5-4-1989న లెక్చరర్‌గా భాషాభివృద్ధి పీఠం, భాష ప్రణాళిక అండ్ నవీకరణ శాఖలో నియమింపబడ్డారు. వీరికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా తేది 27-7-1998న పదోన్నతి కల్పించడమైనది. 2007, జూలై 1న ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. మెంబర్ ఆఫ్ ఎడిటోరియ్ బోర్డ్ ఫర్ ది క్వార్టర్లీ బుల్లెటిన్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్‌గా వ్యవహరించారు. ఆచార్య కె. తోమాసయ్య తెలుగు భవనం ఇన్‌ఛార్జిగా, కంప్యూటర్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, దూరవిద్యా కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులుగా భాషాభివృద్ధి పీఠం పీఠాధిపతిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, రిజిస్ట్రార్‌గా సేవలందించారు.

ఆచార్య సి. మృణాళిని వయసు రీత్యా 2016 జూన్ 30వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా 30వ తేదీ మధ్యాహ్నం డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో జరిగిన వీడ్కోలు సమావేశానికి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆచార్య కె. తోమాసయ్య, ఆచార్య సి. మృణాళిని వివిధ హోదాల్లో చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. వారి కృషి వల్లే విశ్వవిద్యాలయం పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. అంతకు ముందు ఉపాధ్యక్షులు భాషాభివృద్ధి పీఠంలో అధ్యాపకులుగా పని చేస్తున్న బసవరాజు వెంకటేశ్వరరావు పదవీ విరమణ అభినందన కార్యక్రమాన్ని ఉపాధ్యక్షుల కార్యాలయంలో నిర్వహించి ఆయన్ని సత్కరించి, విశ్వవిద్యాలయం తరపున జ్ఞాపికను, అందజేసి, ఆర్థిక ప్రయోజనాల్ని అందించారు.

వీడ్కోలు సభకు తొలుత ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. విశ్వవిద్యాలయం పక్షాన ఆచార్య కె. తోమాసయ్య, ఆచార్య సి. మృణాళిని గార్లను ఘనంగా ఉపాధ్యక్షులు సత్కరించి వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలను అందజేశారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని వివిధ పీఠాల అధిపతులు, డైరెక్టర్లు, శాఖాధిపతులు, ఉద్యోగ సంఘాలు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, పదవీ విరమణ చేసిన ఆచార్య కె. తోమాసయ్యను, ఆచార్య సి. మృణాళినిని ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

మలేషియా తెలుగు సంఘం అధ్యక్షులు అచ్చయ కుమార్ రావు తరపున సత్కారం జరిగింది. వారి అభినందనలు కూడా అందజేశారు. సత్కారాల అనంతరం మాట్లాడిన వక్తలందరూ ఆచార్య కె. తోమాసయ్య, ఆచార్య సి. మృణాళిని, బసవరాజు వెంకటేశ్వరరావు విశ్వవిద్యాలయానికి చేసిన సేవలను, కృషిని ప్రశంసించారు.

ఆచార్య కె. తోమాసయ్య తన స్పందనలో తన ఉన్నతికి కారకులైన ప్రతీ ఒక్కరిని స్మరించుకున్నారు. తన మీద నమ్మకంతో రిజిస్ట్రార్‌గా నియమించినందుకు ఉపాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యక్షుల నుంచి అనేక విషయాలు తెలుసుకున్నానన్నారు. తన ఉద్యోగ జీవితాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహకరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. 27 సంవత్సరాల 2 నెలల 26 రోజులు పని చేశానన్నారు. భాషాభివృద్ధి పీఠంలో పని చేసిన అధ్యాపకులకు, అధ్యాపకేతర మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆచార్య సి. మృణాళిని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., ఎం.ఎ (తెలుగు), ఎం.ఫిల్. (తెలుగు) పిహెచ్.డి. (తెలుగు)ను చేశారు. ఎం.ఎ. (ఉమెన్ స్టడీస్)ను మదర్ థెరిస్సా ఉమెన్ యూనివర్సిటీ నుంచి చేశారు. వీరు తెలుగు విశ్వవిద్యాలయంలో తేది 30-9-1991న లెక్చరర్‌గా తులనాత్మక అధ్యాయన కేంద్రంలో నియమింపబడ్డారు. 2000 నవంబర్ 30న అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2009, డిసెంబర్ 9న ప్రొఫెసర్‌గా పదొన్నతి పొందారు. ఆచార్య సి. మృణాళిని యు.జి.సి. సెల్ కో-ఆర్డినేటర్‌గా, తులనాత్మక అధ్యయన కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులుగా, విజ్ఞాన సర్వస్వ కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులుగా, ప్రచురణల విభాగం ఇన్‌ఛార్జి సంచాలకులుగా, ఇంటర్నల్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ ఇన్‌ఛార్జి సంచాలకులుగా, నాక్ కమిటీ కన్వీనర్‌గా విశ్వవిద్యాలయానికి సేవలందించారు.




ఆచార్య సి. మృణాళిని ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆశావాహ దృక్పథం తనదనీ, ఏ పనైనా చేయగలం అనే దృఢ చిత్తం ఉండాలని సూచించారు. ఆచార్య సి. నారాయణరెడ్డి తోడ్పాటుతో ఈ విశ్వవిద్యాలయ ఉద్యోగంలో చేరినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్లు అందరూ తనకు సహకరించారని తెలిపారు. ఆచార్య శివారెడ్డిగారు బాధ్యత, స్వేచ్ఛ రెండూ తనకు ఇచ్చారన్నారు. ఒక పని సాధ్యం కావడానికి ఎంతో మంది కృషి ఉంది. మీ అందరి సహకారంతోనే విశ్వవిద్యాలయం ఇంత ప్రగతి సాధించిందన్నారు. తాను వ్యక్తిపరంగా ఏ పని చేయలేదనీ, విషయపరంగానే చేశానన్నారు.

అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు, ప్రముఖ కవులు డా. నందిని సిధారెడ్డి, శిఖామణి, పరిశోధక విద్యార్థులు మృదుల, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నీలకంఠం, మహేందర్, లక్ష్మీనారాయణ శర్మ, సంపత్, చంద్రయ్య, సిద్ధార్థ, హరీశ్‌గౌడ్, సత్యనారాయణ, సదన్, రమేశ్, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు ఎం. రాములు, కంప్యూటర్‌సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె. సుధీర్ కుమార్, జర్నలిజం శాఖ అధిపతి ఆచార్య వి. సత్తిరెడ్డి, నృత్యశాఖ తరఫున డాక్టర్ భాగవతుల సేతురాం, సంగీత శాఖాధ్యక్షులు డాక్టర్ ఎస్. ఉమాదేవి, గ్రంథాలయ మాజీ అధికారి డాక్టర్ ఎం. శంకర్ రెడ్డి, నృత్యశాఖ అధ్యాపకులు డాక్టర్ అలేఖ్య పుంజాల, తులనాత్మక అధ్యయన కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులు డాక్టర్ గీతావాణి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం డాక్టర్ నమశ్శివాయ, తదితరులు ఆచార్య కె. తోమాసయ్య, ఆచార్య సి. మృణాళినిల సేవల్ని ప్రస్తుతిస్తూ అభినందన ప్రసంగాలు చేశారు.

బసవరాజు వెంకటేశ్వరరావు 1987లో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. భాషాభివృద్ధి పీఠంలోనే వీరి సర్వీసు మొత్తం గడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో పదవీ విరమణ చేశారు.

# ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య వి. సత్తిరెడ్డి



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య వి. సత్యరెడ్డి 2016, జూన్ 30వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య కె. తోమాసయ్య వయసు రీత్యా 30న పదవీ విరమణ చేయడంతో వారి స్థానంలో ఆచార్య వి. సత్తిరెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమిస్తు ఉపాధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆచార్య కె. తోమాసయ్య నుంచి బాధ్యతలను సత్తిరెడ్డి స్వీకరించారు.

ప్రస్తుతం ఆచార్య వి. సత్తిరెడ్డి జర్నలిజం శాఖ అధిపతిగా, ఐక్యూ ఎసీ డైరెక్టర్‌గా, విద్యాత్మక వ్యవహారాల పీఠాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో సామాజిక, తదితర శాస్త్రాల పీఠాధిపతిగా, దూరవిద్యా కేంద్రం సంచాలకులుగా సేవలందించారు.

ఆచార్య వి. సత్తిరెడ్డి 1961లో నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.సి.జె. ధార్వాడలోని కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజంలో పిహెచ్.డి చేశారు. కొంత కాలం జర్నలిస్ట్‌గా పని చేసిన సత్తిరెడ్డి 1990లో జర్నలిజం శాఖలో అధ్యాపకులుగా నియమింపబడ్డారు

ఆచార్య వి. సత్తిరెడ్డి రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# హరితహారం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2016 జూలై 11 సోమవారం నాడు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి మామిడి మొక్కల్ని నాటారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంబంధాల విభాగం ఇన్‌ఛార్జిగా బి. శ్రీనివాస్‌గౌడ్



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల విభాగం ఇన్‌ఛార్జిగా బి. శ్రీనివాస్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ జె. చెన్నయ్య వయసు రీత్యా పదవీ విరమణ చేయడంతో బి. శ్రీనివాస్‌గౌడ్ ఇన్‌ఛార్జి బాధ్యతలు 2016, ఆగస్టు 31న స్వీకరించారు. విశ్వవిద్యాలయంలో బి. శ్రీనివాస్ గౌడ్ 1992 నుంచి ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

# ఘనంగా సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం




తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016 జూలై 13 బుధవారం సాహితీ పురస్కారాలు ప్రదానం చేసింది. ఎన్.టి.ఆర్. కళామందిరంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఉత్సవంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి. రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి 20,116 రూపాయలు, పురస్కార పత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథి డా.కె.వి. రమణాచారి ఈ సందర్భంగా ప్రసంగిస్తూ రచయితలు, కవులు, కళాకారులు సమాజాన్ని సన్మార్గంలో నడిపే విధంగా రచనలు, కళా ప్రదర్శనలు చేస్తారని అన్నారు. బాలలకు గతంలో శతక పద్యాలు చెప్పడంతో పాటు దేశభక్తిని, దైవభక్తిని పాదుకొల్పే విధానం ఉండేదని, ఈనాడు రైమ్స్ రాకతో అవన్నీ కనుమరుగయ్యాయని అన్నారు. బాలలకు ప్రాథమికంగా నైతిక విలువలు వంట బట్టిస్తే, ఇప్పటిలాగా నిర్భయ చట్టాలే అవసరం ఉండేవి కావని తెలిపారు.

పురస్కారం పొందిన కవి, రచయితల్ని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య శివారెడ్డి అభినందిస్తూ పురస్కారాల ఎంపికలో ఎటువంటి జోక్యమూ ఉండదని అన్నారు. న్యాయనిర్ణేతలకే పూర్తి స్వేచ్ఛ ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఆదరిస్తోందని గత రెండు సంవత్సరాల్లో అదనంగా 27 కోట్ల రూపాయలు ఇచ్చిందని తెలిపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.సత్తిరెడ్డి స్వాగతం పలుకుతూ అకాడమీల కార్యక్రమాలను తెలుగు విశ్వవిద్యాలయం కొనసాగిస్తున్నదన్నారు. విస్తరణ సేవా విభాగం అధిపతి డా. జుర్రు చెన్నయ్య పురస్కార గ్రహీతల పరిచయం చేశారు. పలువురు కవులు, రచయితలు, విమర్శకులు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

# పురస్కార గ్రహీతలు

2013 సంవత్సరానికి పద్య కవితా ప్రక్రియలో ఆచార్య రావికంటి వసునందన్ 'శ్రీ చరణశరణాగతి'కి, వచన కవిత్వంలో దేవిప్రియ 'గాలిరంగు'కు, బాలసాహిత్యంలో పైడిమర్రి రామకృష్ణ 'చింటూ గాడి కథల'కు, కథా ప్రక్రియలో ఎ.ఎన్.జగన్నాథశర్మ 'పేగు కాలిన వాసన'కు, నవలలో జాజులగౌరి 'వొయినం'కు, సాహిత్య విమర్శలో డా. శ్రీరంగాచార్య 'సాహిత్య వీధులు'కు, నాటకంలో డా. కొట్టే వెంకటాచార్యుల 'గుణనిధి'కి, అనువాదంలో డా. సి.మృణాళిని 'మాల్గుడి కథల'కు ఇతరాల్లో డా. సంగనభట్ల నరసయ్య 'తెలివాహ గోదావరి'కి, రచయిత్రి ఉత్తమ గ్రంథంగా కొండపల్లి కోటేశ్వరమ్మ 'నిర్జన వారధి'కి సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రోగ్రాం ఇన్‌ఛార్జి ఆర్. రామమూర్తి వందన సమర్పణ చేశారు.

## పద్యకవిత – ఆచార్య రావికంటి వసునందన్

'శ్రీచరణ శరణాగతి' అనే బృహత్ గ్రంథానికి ఈసారి పద్య కవితా పురస్కారం అందుకున్న రావికంటి వసునందన్ 1949 మే 4న కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్‌లో జన్మించారు. 1971లో 'రతీప్రద్యుమ్నము' పేరుతో తొలి కృతిని రచించారు. ఇప్పటివరకు 80కి పైగా రచనల్ని ప్రచురించారు. వానమామలై వరదాచార్యులు, డా.సి.నా.రె. వంటి ప్రముఖుల సాహిత్యంపై ప్రత్యేక సంచికలను స్వీయ సంపాదకత్వంలో వెలువరించారు. సినారె 'భూమిక – ఒక సమగ్ర పరిశీలనం' అనే అంశంపై ఎం.ఫిల్, 'ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం – విశ్వంభర విలక్షణత' అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేశారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా సేవలందించి డీన్‌గా పదవీ విరమణ చేశారు. యు.జి.సి. మైనర్, మేజర్ ప్రాజెక్టులను కూడా పూర్తి చేశారు. ఈసారి పురస్కారం అందుకున్న 'శ్రీచరణ శరణాగతి' ఒక ప్రౌఢపద్య నిర్భరమైన కావ్యం.

## వచన కవిత – దేవిప్రియ

వచన కవితా ప్రక్రియలో ఉత్తమ గ్రంథంగా ఎంపికైన 'గాలిరంగు' దేవిప్రియ కవితా రచనా పరిణామంలో అత్యున్నత స్థాయిలో ఉంది. ఆధునిక తెలుగు కవిత్వంలో అగ్రశ్రేణి కవిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్న దేవిప్రియ 1951లో గుంటూరులో జన్మించారు. తొలుత సినీరంగంలో అనిసెట్టి సుబ్బారావు వద్ద పనిచేశారు. తర్వాత జర్నలిజంలో స్థిరపడి అనేక పత్రికల్లో, టీవీ ఛానళ్ళలో వివిధ హోదాల్లో సేవలందించారు. కథకునిగా రచనలు చేయడం ప్రారంభించిన దేవిప్రియ పట్టుమని పది కథలు కూడా ప్రచురించకముందే కవిగా మారారు. పైగంబర కవిగా ప్రసిద్ధుడయ్యారు. 'అమ్మచెట్టు' కవితా సంపుటి దేవిప్రియకు విశేషమైన గుర్తింపు తెచ్చి పెట్టింది. ఏడు కవితా సంపుటాలు ప్రచురించారు. బి. నరసింగరావు దర్శకత్వంలో 'దాసి', 'రంగుల కల' వంటి జాతీయ అవార్డులు పొందిన సినిమాలకు స్క్రీన్ ప్లే రాశారు. కొన్ని చిత్రాలకు పాటలు రాశారు. గద్దర్‌పై 'మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' అనే డాక్యుమెంటరీ నిర్మించి దర్శకత్వం వహించారు. 'అధ్యక్షా మన్నించండి' అనే సంపాదకీయాల సంపుటి, దినపత్రికలో 'రన్నింగ్ కామెంటరీ' కూడా దేవిప్రియకు గుర్తింపు పెంచాయి.

## బాలసాహిత్యం – పైడిమర్రి రామకృష్ణ

'చింటుగాడి కథలు' అనే గ్రంథాన్ని రచించిన పైడిమర్రి రామకృష్ణకు 2013 సంవత్సరానికి బాలసాహిత్యంలో సాహితీ పురస్కారం లభించింది. ఖమ్మంలో జన్మించిన రామకృష్ణ ఎం.బి.ఎ. పట్టభద్రుడు. బాలసాహిత్యంపై అపారమైన మక్కువ ఏర్పరచుకొని విరివిగా రచనలు చేస్తున్నారు. పిల్లల కోసం ఇప్పటి వరకు సుమారు 350కి పైగా కథలు, కవితలు, రేడియో నాటికలు, ఇతర రచనలు చేశారు. 'కథా కిరణాలు – మన తెలుగు కథకులు' పేరుతో తెలుగు కథకుల పరిచయాలతో కూడిన గ్రంథాన్ని వెలువరించారు. 'మామయ్య డాట్ కామ్', 'రంగుల రాట్నం', 'అనగనగా ఒక అడవి' బాలల కథల సంపుటాల్ని రచించారు. ప్రస్తుతం సూర్య దినపత్రికలో 'బాల సాహితీ శిల్పులు' శీర్షికన బాలసాహితీ వేత్తల పరిచయాలను ధారావాహికగా 86 వారాలుగా రాస్తున్నారు. బాలసాహితీ ప్రవీణ, బాలసాహితీరత్న వంటి బిరుదులు పైడిమర్రి రామకృష్ణకు లభించాయి.

## కథ – ఎ.ఎన్. జగన్నాథశర్మ

కథానిక ప్రక్రియలో ఈసారి ఉత్తమ గ్రంథంగా ఎంపికైన 'పేగు కాలిన వాసన' కథల సంపుటి ఎ.ఎన్. జగన్నాథశర్మ విశిష్ట రచన. వీరి పూర్తి పేరు అయలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథశర్మ. 1956 ఏప్రిల్ 13న జన్మించారు. వృత్తిరీత్యా పత్రికా రచయిత అయిన శర్మ ప్రస్తుతం ఆంధ్రజ్యోతి వారి 'నవ్య' వారపత్రికకు సంపాదకులుగా ఉన్నారు. ఉత్తరాంధ్ర కథా సాహిత్య ప్రతిభను నిలబెట్టుకునే స్థాయిలో జగన్నాథశర్మ పేరెన్నికగన్న కథలు రాశారు. ఇప్పటి వరకు సుమారు 500 కథలు రాశారు. అత్యంత వాస్తవికమైన కథనం, విలక్షణ శిల్పం కలిగిన వీరి కథలు తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ముఖ్యంగా దిగువ మధ్య తరగతి జీవితాల్లోని కటువైన అనుభవాలను కథలుగా మలచిన తీరు జగన్నాథ శర్మను అగ్రస్థానంలో నిలబెడుతుంది. ఒకానొక అపూర్వమైన అనుభూతిని కలిగించే ప్రత్యేకమైన రచనా ధోరణి జగన్నాథ శర్మది.

## నవల – జాజుల గౌరి

'హొయినం' నవలకు ఉత్తమ నవలా రచన పురస్కారం అందుకున్న జాజులగౌరి ఉన్నత శ్రేణికి చెందిన రచయిత్రి. 1968 మార్చి 2న జన్మించిన గౌరి చదువులకు పేదరికం అడ్డంకిగా ఉన్న వర్గంలో జన్మించినా పరిస్థితులకు ఎదురొడ్డి చదివింది. వ్యక్తిగా, రచయిత్రిగా ఉన్నత స్థానాన్ని అందుకుంది. బి.ఎ, ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం., బి.సి.జె, ఎం.సి.జె వంటి డిగ్రీలు పూర్తి చేసింది. సాహితీ సృజనలో ప్రత్యేకమైన మార్గంలో నడుస్తూ కవయిత్రిగా, రచయిత్రిగా సాగింది. 'మన్నుబువ్వ' కవితా సంపుటితో సాహిత్యలోకం దృష్టిని ఆకర్షించింది. 'మన్నుబువ్వ' యోగివేమన విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా నిర్ణయించబడింది. ఒయినం, కష్టం, భూమిబిడ్డ మొదలైన నవలలు, కథా సంపుటాలు వెలువడ్డాయి. కొన్ని ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. జాజుల గౌరి రచనలపై ఎం.ఫిల్. పిహెచ్.డి పరిశోధనలు సాగుతున్నాయి. సామాజిక ఉద్యమంలోనూ, తెలంగాణ సాధనకై సాగిన రాజకీయ, సాహిత్య ఉద్యమంలోనూ పనిచేశారు.

## విమర్శ – డా. శ్రీరంగాచార్య

సాహిత్య విమర్శా ప్రక్రియలో ఈ సంవత్సరం డా. శ్రీరంగాచార్య రచించిన 'సాహిత్యవీథి' పురస్కారానికి ఎంపికైంది. 1944 సంవత్సరంలో నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్లలో జన్మించిన శ్రీరంగాచార్య ప్రాచ్య భాషాసాహిత్యాల్లో స్నాతకోత్తర పట్టభద్రులే కాకుండా పిహెచ్.డి పరిశోధన కూడా చేశారు. 1966 నుంచి 2002 వరకు 36 సంవత్సరాల పాటు మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలోని ప్రాచ్య కళాశాలలో అధ్యాపకులుగా, ప్రధానాచార్యులుగా సేవలందించారు. ఎంతో మంది తెలుగు విద్యార్థులను తయారు చేసి భాషా సాహిత్య వికాసానికి దోహదం చేశారు. ప్రాచీన సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేశారు. తాళపత్ర, లిఖిత ప్రతుల పరిష్కరణలో సిద్ధహస్తులు. సుమారు 25 గ్రంథాలను ప్రచురించారు. సుమారు 200లకు పైగా సాహిత్య వ్యాసాలు, విమర్శలు రాశారు. తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారానికి ఎంపికైన 'సాహిత్య వీథులు' ప్రాచీన సాహిత్యంపై డా. శ్రీరంగాచార్య గారికి ఉన్న అపారమైన పాండిత్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ కళాశాల అధ్యాపక పురస్కారం అందుకున్నారు.

## నాటకం – డా. కొట్టె వెంకటాచార్యులు

2013 సంవత్సరానికి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి నాటక ప్రక్రియలో గుణనిధి నాటకం ఎంపికైంది. నాటకకర్త డా. కొట్టె వెంకటాచార్యులు స్వయంగా ప్రసిద్ధ నాటక కర్త, పేరున్న నటులు. 1951 మార్చి 1న ప్రకాశం జిల్లా జంగురెడ్డిపాలెంలో జన్మించారు. కాళ్ళకూరి నారాయణరావు రచనలపై పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని శ్రీ రామభద్ర జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా సేవలందించారు. 40 సంవత్సరాల కిందట 'పల్లె పడుచు' నాటకంలో గోపి పాత్ర ధరించడం ద్వారా రంగస్థల కళలో ప్రవేశించిన కొట్టె వెంకటాచార్యులు ప్రాచీన సాహిత్యాధ్యయనం వల్ల పౌరాణిక నాటక రంగంలో ప్రముఖంగా పేరు పొందారు. శిశుపాలుడు, గయుడు, కర్ణుడు, దుర్యోధనుడు, భవానీశంకరుడు మొదలైన అనేక పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. సి.ఎస్.ఆర్. కళామందిరం అనే సంస్థ ద్వారా నాటక రంగానికి సేవలందించారు. శ్రీనాథుని కాశీఖండంలోని ఒక అంశాన్ని గుణనిధి నాటకంగా మలచి బహుమతిని అందుకున్నారు.

## అనువాదం – ఆచార్య సి. మృణాళిని

ఆర్.కె.నారాయణ్ మాల్గుడి డేస్‌ను 'మాల్గుడి కథలు' పేరుతో డా. సి. మృణాళిని తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథం 2013 సంవత్సరానికి ఉత్తమ అనువాద రచనగా సాహితీ పురస్కారం పొందింది. రచయిత్రిగా, అనువాదకురాలిగా, విమర్శకురాలిగా, వ్యాఖ్యాతగా, పాత్రికేయురాలిగా బహుముఖీన ప్రతిభను సముపార్జించిన మృణాళిని తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన కేంద్రం సంచాలకులుగా ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, ఆంగ్ల భాషా సాహిత్యాల్లో స్నాతకోత్తర పట్టభద్రులు. 'సాంఘిక నవలల్లో కథన శిల్పం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నారు.

మౌలిక రచనలు, అనువాదాలు, పత్రికల్లో రాసిన ధారావాహిక రచనలు కలిపి సుమారు 20 గ్రంథాలు ప్రచురించారు. గుల్జార్ కథలు, ఆర్.కె. నారాయణ్ మాల్గుడి కథలు అనువాదాలకు విశేషమైన గుర్తింపు లభించింది. ఆకాశవాణి, దూరదర్శన్, ఇతర ఛానళ్ళలో వ్యాఖ్యాతగా, పరిచయకర్తగా పేరు పొందారు. సాహిత్య సదస్సుల్లో వక్తగా సుప్రసిద్ధులు. దేశ విదేశాల్లో జరిగిన సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు.

## ఇతర వచన రచనలు – డా. *సంగనభట్ల నరసయ్య*

ఇతర వచన రచనా విభాగంలో 'తెలివాహ గోదావరి' అనే గ్రంథం సాహితీ పురస్కారానికి ఎంపికైంది. కరీంనగర్ జిల్లాలోని ధర్మపురిలో 1954వ సంవత్సరంలో జన్మించిన డా. సంగనభట్ల నరసయ్య తెలుగు భాషా సాహిత్యాల్లో స్నాతకోత్సవ పట్టభద్రులయ్యారు. పరిశోధకునిగా, వచన, పద్య కవిగా, విమర్శకునిగా పేరు పొందారు. కర్ణాటక సంగీతాన్ని అభ్యసించి శాస్త్రీయ గానంలో ప్రావీణ్యాన్ని సముపార్జించారు. నటునిగా అభినయ కళలో కూడా సముచితమైన ప్రజ్ఞను సొంతం చేసుకున్న డా. నరసయ్య పౌరాణిక, చారిత్రక నాటకాల్లో నటునిగా, దర్శకునిగా పేరు పొందారు. ధర్మపురిలోని శ్రీ రాజరాజేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో 34 సంవత్సరాల పాటు అధ్యాపకునిగా, ప్రధానాచార్యునిగా సేవలందించారు. 'సమాంతర రేఖలు' అనే గ్రంథం, 'ధర్మపురి క్షేత్ర చరిత్ర' అనే చారిత్రక గ్రంథం రచించారు. ఏ అంశాన్ని తీసుకున్నా ప్రధానంగా మౌలిక పరిశోధన చేసే డా. నరసయ్య తెలుగువారి విశిష్ట చరిత్రకు సంబంధించిన తమ రచన 'తెలివాహ గోదావరి'కి సాహితీ పురస్కారం అందుకున్నారు.

## నిర్జన వారధి – *కొండపల్లి కోటేశ్వరమ్మ*

రచయిత్రుల గ్రంథాల్లో ఉత్తమ రచనగా ఎంపికైన 'నిర్జన వారధి' రచయిత్రి శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మ. జన్మించింది కృష్ణా జిల్లా పామర్రులో. చిన్ననాటి నుంచే చైతన్యవంతంగా ఆలోచించడం, సుస్వరంగా పాటలు పాడడం ఇష్టమైన వ్యాపకం. తరుణ యవ్వనంలోనే కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో లీనమై ప్రజాభ్యుదయమే పరమావధిగా పని చేశారు. మూడేళ్ళ వయసులోనే పెళ్ళిలో బాల వితంతువుగా మారిన కోటేశ్వరమ్మ ఉద్యమ సహచరుడు కొండపల్లి సీతారామయ్యను వివాహం చేసుకున్నారు. ఉద్యమ జీవితం సుదీర్ఘంగా సాగింది. అనేక అనుభవాలను చవి చూశారు. సీతారామయ్యకు దూరమయ్యారు. స్వతంత్ర జీవనం, స్వతంత్ర వ్యక్తిత్వం, వీటికి తోడు రచనా జీవితం ముప్పేటగా అల్లుకొని సాగాయి. ఆ అనుభవాల సంపుటి ఈనాడు బహుమతికి ఎంపికైన 'నిర్జన వారధి'. కోటేశ్వరమ్మ 'అమ్మ చెప్పిన కథలు', 'సంఘమిత్ర' కథల సంపుటాలు, 'అశ్రు సమీక్షణం' కవితా సంపుటి ప్రచురణ పొందాయి. 97 ఏళ్ళ నిండు వయసులోనూ జీవితాన్ని గురించీ, సాహిత్యాన్ని గురించే వీరి ఆలోచనలు.

# ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం




తెలుగు భాషకు త్వరలోనే ప్రాచీన హోదా లభిస్తుందని తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక, క్రీడలు, యువజన సేవల ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో 2016 జూలై 14 గురువారం ఎన్.టి.ఆర్. కళామందిరంలో జరిగిన 2014 ప్రతిభా పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మద్రాసు హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై తెలంగాణ ప్రభుత్వం గత ఏడాదికాలంగా సమర్థవాదనలు వినిపిస్తున్నదని, తీర్పు కొద్ది రోజుల్లోనే వెలువడుతుందని వెంకటేశం వివరించారు. ఆంగ్లం అన్నం పెట్టినా మనం తెలుగువారందరి అభిమానం చూరగొని తెలుగువారుగా జీవించాలంటే తెలుగు తప్పనిసరిగా చదవాలని అన్నారు. బెంగాల్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయంలో తెలుగు పీఠం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. తెలుగు భాషా సంస్కృతుల వికాసం కోసం తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని వివరించారు. తెలుగు జాతి వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి పురస్కారాలనిచ్చి సత్కరిస్తున్నామన్నారు. నిర్ణాయక సంఘాల ద్వారా నిష్పాక్షికమైన రీతిలో పురస్కారాలను అందిస్తున్నామన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ప్రసంగిస్తూ తెలుగు భాషకు, సాహిత్యానికి అత్యంత ప్రాచీనమైన చరిత్ర వుందని, అందుకు ఆధారాలను మద్రాసు హైకోర్టులో సమర్పించామని చెప్పారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వారికి తెలుగు విశ్వవిద్యాలయం అందిస్తున్న

పురస్కారాలు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనవని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు ఆచార్య వి.సత్తిరెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరాలంటే అభిరుచితో పాటు నిరంతర సాధన చేయాలని అన్నారు. విస్తరణ సేవా విభాగం అధిపతి డా. జుర్రు చెన్నయ్య పురస్కార గ్రహీతల్ని పరిచయం చేశారు. ప్రోగ్రాం ఇన్‌ఛార్జి ఆర్. రామమూర్తి వందన సమర్పణ చేశారు.

## పురస్కారాలందుకున్న ప్రతిభామూర్తులు

జూపాక సుభద్ర (కవిత్వం), డా. దిలావర్ (విమర్శ), బి. శ్రీనివాసరెడ్డి (శిల్పకళ), బి. అంజనీ రెడ్డి (చిత్రకళ), డా. అలేఖ్య పుంజాల (నృత్యం), హైదరాబాద్ బ్రదర్స్ – డి. రాఘవాచారి, డి. శేషాచారి (సంగీతం), దాసు కేశవరావు (పత్రికా రచన), సి.వి.కె. రావు (నాటకరంగం), మొగులయ్య (జానపద కళారంగం – పన్నెండు మెట్ల కిన్నెర), తిగుళ్ళ శ్రీహరిశర్మ (అవధానం), వావిలికొలను రాజ్యలక్ష్మి (ఉత్తమ రచయిత్రి), శిరంశెట్టి కాంతారావు (కథ / నవల) పురస్కారం కింద రూ. 20,116/–లు, పురస్కార పత్రం, శాలువాతో తెలుగు విశ్వవిద్యాలయం సత్కరించింది.

## కవిత్వం – జూపాక సుభద్ర

కవిత్వంలో ప్రతిభా పురస్కార గ్రహీత జూపాక సుభద్ర 1964 అక్టోబర్ 31న వరంగల్ జిల్లా రేగొండ మండలం దామరంచపల్లిలో జన్మించారు. చిన్ననాటి నుంచి విద్యార్థి దశ వరకు ఎదుర్కొన్న కులవివక్ష సుభద్రకు సాహిత్యరంగంలో, సామాజిక జీవనంలో ప్రతిఘటన చైతన్యాన్నిచ్చింది. మనసులోని భావాల్ని అక్షరబద్ధం చేయడం విద్యార్థి దశలోనే అబ్బింది. చాలా రచనల్ని దాచుకోలేకపోయారు. "అయ్యయ్యో దమ్మక్క" తెలుగు కవిత్వంలో జూపాక సుభద్రకు ప్రత్యేక స్థానాన్ని కట్టబెట్టింది. దళిత స్త్రీల జీవన చిత్రాన్ని సమగ్రంగా ఆత్మాశ్రయంగా ఆవిష్కరించిన కవిత్వమిది. 'రాయక్కమాన్యం' పేరుతో సుభద్ర ప్రచురించిన కథల సంపుటి కూడా ఆమెను కథా రచయిత్రిగా నిలపడమే గాక పదునైన రచనగా పేరు పొందింది. ఇంకో కవితా సంపుటి, కథల సంపుటి ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. ఇవిగాక పదేళ్ళపాటు స్త్రీవాద పత్రిక భూమికలో ధారావాహికంగా రాసిన సాహిత్య, రాజకీయ వ్యాసాలను పుస్తక రూపంలో తేనున్నారు. మాదిగ ఉపకులాల సామాజిక, సాంస్కృతికాంశాల్ని ఇతివృత్తంగా తీసుకుని రచించిన కథలతో రెండు సంకలనాల్ని తెచ్చారు. కృపాకర్ మాదిగతో కలిసి 84 మంది కవితలను ప్రచురించిన 'కైతునకల దండెం' ఇంకా అనేక రచనలు చెప్పుకోదగ్గవి.

## విమర్శ – డా. దిలావర్

విమర్శలో ప్రతిభా పురస్కారానికి ఎంపికైన డా. దిలావర్ అధ్యాపకునిగా, విమర్శకునిగా, కవిగా, కథకునిగా లబ్ధ ప్రతిష్టులైన సాహితీమూర్తి. నేటి ఖమ్మంజిల్లా ఇల్లందు తాలూకాలో 1949 జూన్ 5న జన్మించారు. 'దాశరథి కవితా వ్యక్తిత్వ పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ప్రాచీనాధునిక సాహిత్యాధ్యయనం దిలావర్‌కు ఇష్టమైన వ్యాపకం. ఎర్రన–పోతనల రచనల్లో 'ప్రహ్లాద చరిత్ర'ను

తులనాత్మకంగా అధ్యయనం చేసి విమర్శా గ్రంథాన్ని రచించారు. ప్రపంచ సాహిత్యాన్ని మథించి 'దూరాల చేరువ'లో అనే మరో విమర్శా గ్రంథం రాశారు. రాయప్రోలు తృణకంకణం, తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం తదితర అంశాలపై వ్యాసాలు రాశారు. వెలుగుపూలు, వెన్నెలకుప్పలు, జీవన తీరాలు వంటి కవితా సంపుటాలు, మచ్చుబొమ్మ, కొండకోనల్లో వంటి కథా సంపుటాలు, కొన్ని నవలలు రాశారు.

## చిత్రకళ – అంజనీరెడ్డి

1951లో తెలంగాణలో హైదరాబాద్‌లో పుట్టి జాతీయ అంతర్జాతీయ చిత్రకారిణిగా ఎదిగిన ప్రొఫెసర్ బి. అంజనీరెడ్డి ఎన్నో వ్యష్టి చిత్రకళా ప్రదర్శనలు, బృంద ప్రదర్శనలు నిర్వహించి అగ్రశ్రేణిలో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లోనేగాక ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, తదితర నగరాల్లో వీరి కళాఖండాలు ప్రదర్శితమయ్యాయి. జె.ఎన్.టి.యు. ఫైనార్ట్స్ కళాశాలలో 24 సంవత్సరాల పాటు చిత్రకళలో ఆచార్యులుగా సేవలందించారు. ప్రకృతి వైపరీత్యాల బాధితులు, అనాథ స్త్రీలు, పిల్లల కోసం తమ పెయింటింగ్‌లు విక్రయించి సహాయమందించారు. న్యూయార్కు, న్యూజెర్సీ, శ్రీలంక, కరాచీ, జకార్తా, లండన్ తదితర నగరాల్లో జరిగిన అంతర్జాతీయ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఢిల్లీలోని మోడర్న్ ఆర్ట్ గ్యాలరీ, లలిత కళా అకాడమీ, రాష్ట్రపతి భవన్, మద్రాస్ మ్యూజియం ఆఫ్ మాడర్న్ ఆర్ట్, రాజస్థాన్ లలిత కళా అకాడమీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అంజనీరెడ్డి కళాఖండాల్ని సేకరించి ప్రదర్శిస్తున్నాయి.

## శిల్పకళ – బొల్లా శ్రీనివాసరెడ్డి

ఆధునిక శిల్పకళారంగంలో ప్రత్యేకమైన గుర్తింపు సాధించిన బొల్లా శ్రీనివాసరెడ్డి 1962 జూలై 10న నల్లగొండ జిల్లా సూర్యాపేటలో జన్మించారు. శిల్పకళలో స్నాతకోత్తర పట్టభద్రులు కావడంతోపాటు బరోడా ఎం.ఎస్. యూనివర్సిటీలో శిల్పంలో పోస్ట్ డిప్లొమా, జె.ఎన్.టి.యు.లో బంగారు పతాకం సాధించారు. జె.ఎన్.టి.యు. ఫైనార్ట్స్ కళాశాలలో శిల్పశాస్త్రాన్ని, ప్రయోగాన్ని గురించి అధ్యయనం చేసిన ఒకనాటి విద్యార్థి అదే కళాశాలలో శిల్పశాఖ అధ్యాపకునిగా, శాఖాధిపతిగా, ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రారుగా అనేక హోదాల్లో ప్రతిభావంతునిగా సేవలందించారు. అనేక ఇతర విశ్వవిద్యాలయాల్లో పరీక్షకునిగా, నిపుణునిగా ఉన్నారు. ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బయోడైవర్సిటీ సదస్సులో, అంతర్జాతీయ శిల్పుల సదస్సులో పాల్గొన్నారు. దేశ విదేశాల్లో తమ శిల్ప కళాఖండాల్ని ప్రదర్శించారు. కళా శిబిరాల్లో చురుగ్గా పాల్గొని లలిత కళా అకాడమీ నుంచి జాతీయ పురస్కారం పొందారు. ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు.

## నృత్యకళా రంగం – డా. అలేఖ్య పుంజాల

నృత్యకళా రంగంలో ప్రతిభా పురస్కారం పొందిన డా. అలేఖ్య పుంజాల నృత్యసీమలో ఉన్నత స్థాయిలో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. తెలంగాణలో హైదరాబాద్ నగరంలో జన్మించి ఇక్కడే

సాధారణ విద్యలో, భరతనాట్యంలో పట్టభద్రులై దాదాపు నాలుగు దశాబ్దాలుగా నర్తకీమణిగా, నాట్యగురువుగా సేవలందిస్తున్నారు. అనేక నృత్య రూపకాలకు నాట్యీకరణ చేసి, ప్రధాన పాత్ర ధరించి విజయవంతంగా ప్రదర్శించారు. అనేక సోలో అంశాలను రూపొందించారు. సాత్త్వికాభినయానికి ప్రత్యేకమైన పేరు పొందారు. శాంతరసం నుంచి రౌద్రరసం వరకు నవరసపోషణతో విదుషీమణిగా వినుతికెక్కారు. క్షేత్రయ్య పదాలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ప్రతిష్ఠాకరమైన కేంద్రం సంగీత నాటక అకాడమీ అవార్డు, తెలంగాణ రాష్ట్రావిర్భావం సందర్భంగా ప్రభుత్వం నుంచి అత్యున్నత పురస్కారం, హంస అవార్డు, ప్రతిభా రాజీవ్ పురస్కారం, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆఫ్ నార్త్ అమెరికా వారి శ్రీ కళాపూర్ణ అవార్డు వంటి అనేక గౌరవాలందుకున్నారు. దేశ విదేశాల్లో జరిగిన ప్రతిష్ఠాత్మక నృత్యోత్సవాల్లో కూచిపూడి నాట్య ప్రదర్శనలిచ్చారు.

## సంగీతం – హైదరాబాద్ బ్రదర్స్ డి. రాఘవాచారి, డి. శేషాచారి

తెలంగాణ నుంచి శాస్త్రీయ సంగీత జగత్తులో అత్యున్నత స్థాయిలో ప్రకాశిస్తున్నవారు డి. రాఘవాచారి, డి. శేషాచారి. హైదరాబాద్ బ్రదర్స్‌గా లోక ప్రసిద్ధులైన ఈ సోదరులు హైదరాబాద్ నగరంలో సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు దరూర్ సులోచనాదేవి, రత్నమాచార్యులు తొలి గురువులు. అనంతర కాలంలో తమ విద్యను మరింత ఉత్తమ స్థాయికి మలచుకున్నారు. ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ కార్యక్రమంలో గానం చేశారు. మన దేశంలోనే గాక అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ప్రతిష్ఠాత్మక సంగీత సభల్లో గాత్ర కచేరీలు చేశారు. శరీరాలు వేరైనా సంగీతాత్మ ఒక్కటిగా సాగుతున్న హైదరాబాద్ సోదరులు అలత్తూరు సోదరులతో పోల్చదగిన మహోన్నత విద్వాంసులు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీ, కృష్ణగాన సభల్లో పలుమార్లు కచేరీలు చేసి తెలుగు వారి సంగీత ప్రతిభను చాటి చెప్పడమే గాక వరసగా ఉత్తమ గాత్ర సంగీత విద్వాంసులుగా పురస్కారాలు పొందారు. కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులుగా గౌరవించబడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరికి కళారత్న పురస్కారం ప్రదానం చేసింది. కేంద్ర సంగీత నాటక అకాడమీ అత్యున్నత పురస్కారం అందించింది. తెలంగాణ రాష్ట్రావిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రదానం చేసింది.

## పత్రికా రంగం – దాసు కేశవరావు

సుప్రసిద్ధులైన పత్రికా రచయితలు, సాహితీ ప్రముఖుల కుటుంబంలో 1943 సెప్టెంబర్ 23న జన్మించిన దాసు కేశవరావు బి.ఎ పట్టభద్రులై తదుపరి జర్నలిజంలో స్నాతకోత్తర పట్టభద్రులయ్యారు. కళాశాల విద్యార్థిగా ఉండగానే పత్రికా రచనలో తొలి అడుగులు వేశారు. యు.ఎన్.ఐ. వార్త సంస్థలో కొంత కాలం పనిచేసి దినపత్రికల్లో ప్రవేశించారు. దక్కన్ క్రానికల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది హిందూ మొదలైన ప్రముఖ ఆంగ్ల దినపత్రికల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. హిందూలో రాయలసీమ, తెలంగాణ రోయింగ్ కరస్పాండెంట్‌గా చేరి, 2005లో డిప్యూటీ ఎడిటర్‌గా పదవీ విరమణ చేశారు. 35 ఏళ్ళ పత్రికా రచనా జీవితంలో తెలుగు – ఆంగ్ల భాషలను అమితంగా ప్రేమించారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్‌కు మూడు పర్యాయాలు

అధ్యక్షులుగా ఉన్నారు. 2012లో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారమిచ్చి గౌరవించింది. ఆంగ్ల పత్రికా రచయితలుగా ప్రముఖంగా పేరు పొందిన వారిలో కేశవరావు ఒకరు. జర్నలిజం, తదితర అంశాలపై అనేక గ్రంథాలు రాశారు. మహాకవి దాసు శ్రీరాములు 'జీవిత చరిత్రను తెలుగు అకాడమీ ప్రచురించింది. ఏడు తెలుగు గ్రంథాల్ని ఆంగ్లంలోకి అనువదించారు.

## నాటక రంగం - సి.వి.కె. రావు

రంగస్థల నటులుగా, దర్శకునిగా, నాటక కళా సంస్థ నిర్వాహకులుగా సుదీర్ఘ కాలపు అనుభవం గడించిన సి.వి.కె. రావు నాటకాభిమానులకు, కళాకారులకు సుపరిచితులు. 1929 జూన్ 5న ఖమ్మం జిల్లా లింగాపురంలో జన్మించారు. బి.ఎ. పట్టభద్రులై బిడిఓగా సేవలందించారు. విద్యార్థిగా 11వ ఏట రంగస్థలంపై అడుగుపెట్టిన రావు తర్వాతి కాలంలో పూర్తికాలం నాటక రంగానికి సేవ చేశారు. లక్నోలో 'సుమతి', అలహాబాద్‌లో 'మృగ మైదానం' వంటి నాటకాలు ప్రదర్శించారు. గోదావరి ఖనిలో తాను ప్రధాన పాత్ర ధరించి దర్శకత్వం వహించి ప్రదర్శించిన నాటకానికి ఉత్తమ దర్శకత్వ బహుమతి లభించింది. కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ పరిషత్తులో కూడా బహుమతి అందుకున్నారు. దేవభక్తుని నందీశ్వరుడు నాటక కళాపరిషత్తును ప్రారంభించి రెండు దశాబ్దాలు నిర్వహించారు. 'మురళీ మనోహర్ నాట్యమండలిని స్థాపించి సుదీర్ఘ కాలం విజయవంతంగా నడిపారు. 88 ఏళ్ళ వయసులో కూడా నాటకం కోసం తపన వీడలేదు.

## జానపద కళా రంగం - మొగులయ్య

పన్నెండు మెట్ల కిన్నెర అనే వాద్యంతో విలక్షణమైన స్వరంతో కథాగానం చేసే మొగులయ్య మహబూబ్‌నగర్ జిల్లా రాయిపాకుల గ్రామంలో జన్మించారు. తాత ముత్తాతలు కనిపెట్టిన అరుదైన కథాగాన ప్రక్రియను ఎన్నో కష్టాలనెదుర్కొంటూ కూడా కొనసాగిస్తున్న గొప్ప కళాకారుడీయన. 8 ఏళ్ళ వయసులోనే తండ్రి ఎల్లయ్య వద్ద ఈ కథాగానాన్ని నేర్చుకున్నాడు. పన్నెండు మెట్ల కిన్నెర మీటుకుంటూ తాదాత్మ్యంతో మియాసాబ్, పండుగ సాయన్న, గద్వాల రాజా వంటి వీరుల గాథల్ని మొగులయ్య గానం చేస్తుంటే వినడం ఒక అపూర్వమైన అనుభూతి. కటిక పేదరికం ఒకవైపు. మంచి కళాకారుడనే ప్రశంస మరోవైపు. రెండు పార్శ్వాలు ఆయన జీవితంలో ఉన్నాయి. ఒంట్లో శక్తి ఉన్నంతకాలం పగలంతా మట్టి పనిచేస్తూ రాత్రి కళాప్రదర్శన చేస్తూ జీవనం సాగించాడు. ఇప్పుడు శక్తి ఉడిగి బతుకు కష్టమైంది. తెలంగాణ ప్రభుత్వం ఆదుకొని అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నది.

## అవధానం - తిగుళ్ళ శ్రీహరిశర్మ

అవధాన రంగంలో విశిష్ట సేవలందించిన తిగుళ్ళ శ్రీహరిశర్మ ఈ సంవత్సరం ఆ రంగంలో ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. కరీంనగర్ జిల్లా చీర్లవంచలో 1951లో జన్మించారు. సంస్కృత కళాశాలలో ప్రాచ్య భాషా సాహిత్యాల్లో పట్టభద్రులయ్యారు. ఎం.ఎ. సంస్కృతం, పండిత శిక్షణ కూడా పూర్తి చేసి

1973వ సంవత్సరంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా ప్రవేశించారు. 36 సంవత్సరాలు ఏకధాటిగా సేవలందించి ప్రధానాచార్యులుగా పదవీ విరమణ చేశారు. సుమారు 40 సంవత్సరాలుగా అవధానాలు చేస్తున్న తిగుళ్ళవారు 155 తెలుగు అవధానాలు, 15 సంస్కృతావధానాలు విశేషమైన ఆదరణ పొందాయి. వీరి అష్టావధానాల్లో ఛందోభాషణం ప్రత్యేకమైంది. విద్యార్థులకు ప్రాచీనాంధ్ర సంస్కృతి భాషా సాహిత్యాలను పరిచయం చేయడం కోసం అవధాన విద్యను ప్రయోగించారు. అవధాన ప్రవీణ, అవధాన కళాభూషణ, అవధాన విద్యావాచస్పతి వంటి అనేక బిరుదులందుకున్నారు.

## ఉత్తమ రచయిత్రి - వావిలికొలను రాజ్యలక్ష్మి

రచయిత్రుల యుగంలో పుట్టి వారి మార్గంలో కథా, నవలా రచనాభిరుచిని పెంపొందించుకుని సృజనాత్మక రచన వ్యాసంగాన్ని కొనసాగించిన వావిలికొలను రాజ్యలక్ష్మి 2014 సంవత్సరపు ఉత్తమ రచయిత్రి పురస్కారానికి ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నాగరకర్నూల్ తాలూకా ఏదుల గ్రామంలో ఆమె జన్మించారు. చిన్నప్పటి నుంచి కథలు, నవలలు ఇష్టంగా చదవడమే గాక ఆ స్ఫూర్తితో రచనలు చేయడం ప్రారంభించారు. వివాహానంతరం భర్త వాయుసేనలో ఉద్యోగి కావడం వల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో నివసించారు. భిన్న సంస్కృతులను, జీవన విధానాన్ని అధ్యయనం చేసి తన రచనల్లో వైవిధ్యం చూపారు. రాజ్యలక్ష్మిగారు ఇప్పటివరకు 13 నవలలు, 60కి పైగా కథలు రాశారు. తొలి నవల 'ఆనంద కిరణాలు' రెండో నవల 'జీవన చక్రం' నవలలు ప్రజామాత వారపత్రికలో ధారావాహికగా ప్రచురితమై పాఠకాదరణ పొందాయి. ఓ పువ్వు రాలింది, చెదిరిన మేఘాలు, కళ్యాణరేఖ, మౌనగీతం, ఆశల దీపాలు మొదలైన నవలలు ప్రచురితమయ్యాయి.

## కథ / నవల - *శిరంశెట్టి కాంతారావు*

కథ / నవలా ప్రక్రియల్లో ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించిన శిరంశెట్టి కాంతారావు 1958 జూలై 25న నల్లగొండ జిల్లా ఫణిగిరిలో జన్మించారు. విద్యార్థి దశలో తెలుగు ఉపాధ్యాయులు తెలుగు భాషా సాహిత్యాలపై కలిగించిన అభిమానం రచనాభిరుచికి పాదులు వేసింది. ప్రజాశక్తి పత్రిక ఆదివారం అనుబంధంలో 'సిండికేట్' అనే తొలికథ అచ్చయ్యింది. అతి తక్కువ కాలంలోనే సుమారు 125 కథలు రాశారు. వివిధ పత్రికల్లో ప్రచురితమై పాఠకుల ఆదరణతో పాటు 35 కథలకు బహుమతులను తెచ్చిపెట్టాయి. 'కంచి మేకలు' 'మట్టి తాళ్ళవల్ల', 'ఊతకర్రలు' మొదలైన కథా సంపుటాలు వెలువడ్డాయి. 'ఆకుపచ్చ విధ్వంసం', 'పూల కుండీలు', 'వ్యూహం' నవలలు ఇప్పటికీ ప్రచురితమయ్యాయి. 'దుఃఖభూమి', 'పడుగు పేకలు' ముద్రణ పొందనున్నాయి. 25 కథల వరకు గిరిజనుల నేపథ్యం నుంచి రావడం శిరంశెట్టి కాంతారావు ప్రత్యేకత. జీవితాన్ని దగ్గరగా చూడడం, లోకవృత్త పరిశీలనానుభవాన్ని అత్యంత సరళ సుందరమైన కథా కథనశిల్పంతో కథలు, నవలలు రాయడం ద్వారా కాంతారావుకు సాహిత్య రంగంలో ప్రత్యేకమైన గుర్తింపు లభించింది.

# పరిశోధనలకు ఈ చరిత్ర ఆధారం




భవిష్యత్తులో చరిత్రపై పరిశోధనలకు 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సమకాలీన చరిత్ర (క్రీ.శ. 1950–1990)' ఎంతో ఉపయోగపడుతుందని భారత చరిత్ర పరిశోధనా మండలి (ఐసీహెచ్ఆర్) అధ్యక్షుడు ఆచార్య వై. సుదర్శనరావు అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో సంకలనం చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సమకాలీన చరిత్ర (క్రీ.శ. 1950–1990) తెలుగు, ఆంగ్ల సంపుటాలను 2016 జూలై 15న శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఆంగ్ల సంపుటాన్ని ఆవిష్కరించిన ఆచార్య వై. సుదర్శనరావు మాట్లాడుతూ సమకాలీన చరిత్రను నిర్మించేటప్పుడు ప్రాంతాల వారీగా సంస్కృతి పరంగా చూడవలసి వస్తుందని చెప్పారు. ముమ్ముందు సమగ్ర పరిశోధనలకు ఈ సంపుటి ఆధారంగా నిలుస్తుందన్నారు. ప్రధాన సంపాదకులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఈ సంపుటాలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర–సంస్కృతి ప్రాజెక్టులో భాగంగా ఇప్పటి వరకు ఏడు సంపుటాలు వచ్చాయని.... ఇది చివరిదని చెప్పారు. 1950 నుంచి 1990 మధ్య కాలంలో తెలుగు రాష్ట్రాల సమకాలీన చరిత్రను నిర్మించడంలో చరిత్రకారులు చూపిన శ్రద్ధ, పరిశోధనా కృషి ప్రశంసనీయమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి తెలుగు సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 తర్వాత సమకాలీన చరిత్రను నిర్మించడం కత్తి మీద సాములాంటిదని తెలిపారు. తెలుగు రాష్ట్రాల సమకాలీన చరిత్రను కూర్చడం అభినందనీయమని అన్నారు. నూతన పరిణామాల వల్ల సంస్కృతి మారిపోతున్న క్రమంలో పూర్వ చరిత్ర, సంస్కృతి గ్రంథస్థం కావడం మంచి పరిణామమని చెప్పారు. ప్రముఖ చరిత్రకారులు, పరిశోధకుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఉప కులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆచార్య జి. వెంకట్రామయ్య, చరిత్ర సంపుటాల ప్రాజెక్టు సమన్వయకర్త ఆచార్య డి. మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యక్షులుగా ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరణ



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన ఉపాధ్యక్షులుగా ప్రముఖ కవి, విమర్శకుడు, ఆచార్య ఎస్.వి. సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకూ ఉపాధ్యక్షులుగా ఉన్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి నుంచి ఆయన 2016 జూలై 25వ తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా, శాఖాధిపతిగా, పరిశోధనా పర్యవేక్షకునిగా విశేషమైన సేవలందించిన ఎస్.వి. సత్యనారాయణ హైదరాబాదు నగరంలో పుట్టి పెరిగారు. సాహిత్య రంగంలో కవిగా, విమర్శకునిగా, వక్తగా పేరు పొందారు. 'సరిగమలు', 'ఉద్యమం' వంటి గేయ కవితా సంపుటాలు 'జీవజ్వాల', 'యుద్ధం జరుగుతూనే ఉంది', 'జీవితం ఒక ఉద్యమం' వంటి కవితా సంపుటాలు, 'రేఖా చిత్రాలు', 'ఆలోచన', 'దళిత సాహిత్య నేపథ్యం', 'అభ్యుదయ సాహిత్యం, ఇతర ధోరణులు', 'ఆధునిక సాహిత్యం , విభిన్న ధోరణులు' వంటి విమర్శా గ్రంథాలను, తమ్మారెడ్డి సత్యనారాయణ, ధర్మభిక్షం, ఆరుట్ల కమలాదేవి తదితరుల జీవిత చరిత్రలను, ఎస్.వి. సత్యనారాయణ రచించారు. అనేక సంకలనాలకు, ప్రత్యేక సంచికలకు సంపాదకత్వం వహించారు. విద్యార్థి దశ నుంచే వ్యక్తిగా, కవిగా, సామాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాల్లో మమేకమై

పని చేశారు. అనేక సంస్థల నుంచి పురస్కారాలందుకున్నారు. నూతన ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వివిధ పీఠాలు, శాఖలు, కేంద్రాలు, విభాగాలకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ఆచార్య ఎస్.వి. సత్యనారాయణను అభినందించారు.

## బంగారు తెలుగు విశ్వవిద్యాలయం కోసం శ్రమిస్తాను

బంగారు తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సాగిస్తున్న కృషి నుంచి స్ఫూర్తి పొందిన తాను అదే మార్గంలో కృషి చేసి బంగారు తెలుగు విశ్వవిద్యాలయ సాధనకు శ్రమిస్తానని, ఇప్పటి వరకూ ఉపాధ్యక్షులుగా పనిచేసిన వారి సలహాలను, సిబ్బంది సహకారాన్ని పొందుతానని నూతన ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ అన్నారు. ఇప్పటి వరకూ ఉపాధ్యక్షులుగా సేవలందించిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి వీడ్కోలు పలుకుతూ, నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎస్.వి. సత్యనారాయణకు స్వాగతం చెపుతూ విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. తనపై విశ్వాసం ఉంచి ఉపాధ్యక్షులుగా నియమించిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావుకు, విద్యాశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ తనను తాను పునర్‌నిర్వచించుకొనే సందర్భంలో తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్ర, పదకోశాలు, నిఘంటువుల నిర్మాణం వంటి చారిత్రక కర్తవ్యాలను పూర్తి చేసే క్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం, ప్రెస్ అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం, తెలుగు అకాడమీలతో సమన్వయం చేసుకుంటుందని ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ వివరించారు. ఉద్యమ కాలంలో తరగతి గదులను వదిలిన విద్యార్థులు తిరిగి తరగతులను సుసంపన్నం చేయాలని సూచించారు. క్రమశిక్షణ, శిక్షణ లేనిదే గొప్ప వ్యక్తిత్వాలు రూపొందవని ఆయన అన్నారు.

పదవీ విరమణ సందర్భంగా తనను గౌరవించిన విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రగతికి తాము చేసిన కృషిలో అందరి భాగస్వామ్యం ఉందని ముఖ్యంగా సిబ్బంది సహకారం సంపూర్ణంగా లభించిందని తెలిపారు. ఒకేసారి అన్ని పనులు జరిగే అవకాశం లేదని అందువల్ల కొన్ని ప్రాధాన్యాలు విధించుకొని పని చేశామని శివారెడ్డి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. ప్రజా సంబంధాల అధికారి డా.జె. చెన్నయ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ గన్‌పార్క్‌లో ఉన్న తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి తెలంగాణ సాధన కోసం త్యాగాలు చేసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

# కూచిపూడి నృత్యంలో ఇటీవలి పరిశోధనలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడి నాట్యంలో ఇటీవల వినూత్నమైన పరిశోధనలు జరిగాయి. లలితకళాపీఠంలోని నృత్యశాఖలో ప్రముఖ నర్తకి, శ్రీ కీర్తి నృత్య అకాడమి వ్యవస్థాపకురాలు వల్లభనేని సజని, కూచిపూడి నాట్య సంప్రదాయ కుటుంబంలో జన్మించి ప్రముఖ నర్తకులుగా, గురువులుగా పేరు పొందిన యువకులు చింతా రవి బాలకృష్ణ, ఏలేశ్వరపు శ్రీనివాసులు వివిధ అంశాలపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత వ్యాసాలకు విశ్వవిద్యాలయం పిహెచ్.డి. డిగ్రీ ప్రకటించింది. సజని "సిద్ధేంద్రయోగి సత్యభామను అన్నమాచార్య అలమేలు మంగను" తులనాత్మకంగా పరిశోధించి తన సిద్ధాంత వ్యాసాన్ని రచించారు. దేశ విదేశాల్లో నర్తకిగా ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నారు. అమెరికాలోని ఓక్లీహోమ నగర గౌరవ పౌరసత్వం పొందడం విశేషం. డా. అలేఖ్య పుంజాల పర్యవేక్షణలో సజని పరిశోధన చేశారు.

చింతా రవి బాలకృష్ణ "కూచిపూడి వారి రూపానురూపం – పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ" అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. కొన్ని తరాలుగా కూచిపూడి కళాకారులు తాము పురుషులై ఉండి స్త్రీ పాత్రలు ధరించి అభినయించే సందర్భంలో వారు స్త్రీలే అన్నంతగా భ్రమ కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియను రూపాను రూపమని వ్యవహరిస్తారు. రవి బాలకృష్ణ వేదాంతం సత్యన్నారాయణ శర్మపై తమ ప్రత్యేక అధ్యయనం సాగించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ నుండి బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాన్ని అందుకున్న రవి బాలకృష్ణ ప్రముఖ నర్తకునిగా పేరుపొందారు.

ఏలేశ్వరపు శ్రీనివాసులు కూచిపూడి "యక్షగానాల్లో ప్రతినాయక పాత్రల"పై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం రూపొందించారు. ఉషా పరిణయంలో బాణాసురుడు, ప్రహ్లాదలో హిరణ్య కశ్యపుడు వంటి కూచిపూడివారి యక్షగానాల్లోని ప్రతినాయక పాత్రల అభినయాన్ని గురించి తమ గ్రంథంలో విపులంగా పేర్కొన్నారు. శ్రీనివాస్ బిస్మిల్లా ఖాన్ అవార్డుతో పాటు నృత్య కౌముది, నృత్య రత్న మొదలైన బిరుదులందుకున్నారు. రవి బాలకృష్ణ, శ్రీనివాస్ ఇద్దరూ డా. వేదాంతం రామలింగశాస్త్రి పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

## జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్‌లోని జానపద, గిరిజన విజ్ఞాన పీఠంలో 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి ఆచార్య భట్టు రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనాలు అర్పించారు. అనంతరం ఆయన తన ప్రసంగంలో స్వాతంత్ర్యోద్యమ వివరాలను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జానపద గిరిజన విజ్ఞాన పీఠం బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# మలేషియాలో
# తెలుగు భాషాభివృద్ధికి సహకరిస్తాం



మలేషియాలో తెలుగు భాషాభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మలేషియా తెలుగు సంఘం ప్రతినిధులకు హామీనిచ్చారు. ఈ మేరకు మలేషియా తెలుగు సంఘం అధ్యక్షులు డాక్టర్ అచ్చయ్యకుమార్ రావు నేతృత్వంలో 8 మంది ప్రతినిధుల బృందం విశ్వవిద్యాలయాన్ని 2016 ఆగస్టు 3న సందర్శించి ఉపాధ్యక్షులు ఎస్వీ సత్యనారాయణతో చర్చలు జరిపింది. రెండు శతాబ్దాల క్రితం వలస వెళ్లిన తెలుగువారు ఇతర విదేశీ, భారతీయ భాషల వారితో పోటీ పడుతూ ఉన్నంతలో మాతృభాషా పరిరక్షణకు శక్తివంచన లేకుండా పాటుపడుతున్నారని డాక్టర్ అచ్చయ్య కుమార్ రావు తెలిపారు. పిల్లలు, పెద్దలకు తెలుగు నేర్పించే కార్యక్రమాన్ని ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి అనుబంధంగా తెలుగు కోర్సు నిర్వహణ, పరీక్షల నిర్వహణ, పట్టాల ప్రధానం చేస్తున్నామన్నారు. మలేషియాలో తమిళం, ఆంగ్లం, మలై భాషలకు తోడుగా తెలుగువారు, మాతృభాషను కాపాడుకునేందుకు ఎంతో తపన పడుతున్నారని, ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో మూడు వేల మంది విద్యార్థులు తెలుగు నేర్చుకుంటున్నారని వివరించారు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తెలుగు సంఘం 30 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. మలేషియాతో పాటు సింగపూర్, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లకు

కేంద్రంగా మలేషియాలో 5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న అయిదు అంతస్తుల తెలుగు అకాడమీ వచ్చే జులై నాటికి పూర్తవుతుందని, ఆ భవనంలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి వివిధ విభాగాలను ఏర్పాటు చేస్తామని డాక్టర్ అచ్చయ్యకుమార్ రావు పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ మలేషియాలో తెలుగును కాపాడుకునేందుకు జరుగుతున్న కృషిని ప్రశంసించారు. ఏటా మార్చి మాసంలో తెలుగు విశ్వవిద్యాలయం మలేషియాలో తెలుగు పరీక్షలను క్రమం తప్పకుండా ముందుగా నిర్ణయించిన తేదీల్లోనే నిర్వహిస్తుందని, అఫిలియేషన్, పరీక్ష ఫీజులను పెంచబోమని హామీనిచ్చారు. తెలుగు భాష ఉచ్చారణ రీతులకు సంబంధించి విదేశీ విద్యార్థుల సౌలభ్యం కోసం భాషా ప్రయోగశాలను నెలకొల్పుతామని, అందుకయ్యే ఖర్చులో సగం సగం భరించే ఏర్పాట్లు చేస్తామన్నారు. తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అంగీకరించారు.

## మాకు ధనం వద్దు... తెలుగుదనం ఇవ్వండి...

మలేషియా తెలుగు సంఘం అధ్యక్షులు డాక్టర్ అచ్చయ్యకుమార్‌రావు తమ దేశంలో తెలుగువారి భావాలను వివరిస్తూ ఆర్థికంగా ఏదో విధంగా తెలుగు వికాస కార్యక్రమాల్ని నిర్వహించుకుంటామని, తెలుగు విశ్వవిద్యాలయం తరఫున ధనం అవసరం లేదు కానీ తెలుగుదనం మాత్రం పుష్కలంగా ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ యేడాది తమకు విశ్వవిద్యాలయ మండలి వెంకట కృష్ణారావు సంస్కృతీ పురస్కారాన్ని అందిస్తున్నందుకు ఆయన ఎస్వీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు, ఫ్రాన్స్‌లోని దక్షిణాసియా ఓరియంటల్ లాంగ్వేజెస్ అధ్యయనాల సంస్థ సహాయ ఆచార్యులు డాక్టర్ డానియల్ నాజర్స్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాహిత్య పీఠం పీఠాధిపతి ఆచార్య ఎండ్లూరి సుధాకర్



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమండ్రి ప్రాంగణంలోని సాహిత్య పీఠం పీఠాధిపతిగా ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీఠాధిపతిగా విధులు నిర్వహించిన ఆచార్య పొన్నా లీలావతి వయసు రీత్యా 2016 జూలై 31న పదవీ విరమణ చేశారు. వీరి స్థానంలో పీఠాధిపతిగా ఆచార్య ఎండ్లూ సుధాకర్ నియామకం జరిగింది. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ సాహిత్య పీఠంలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. గతంలో రెండుసార్లు పీఠాధిపతిగా కూడా వీరు బాధ్యతలు నిర్వహించారు.

# మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారం ప్రదానం




తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అగ్రతాంబూలం ఇచ్చేలా ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. 2016 ఆగష్టు 4వ తేది గురువారం విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ ప్యాలెస్‌లోని మండలి వెంకటకృష్ణారావు 90 జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మలేసియా తెలుగు సంఘం అధ్యక్షులు అచ్చయ్య కుమార్ రావుకు మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. మండలి వెంకట కృష్ణారావు ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసి ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప ఆదర్శవంతుడన్నారు. కాగా, ఆంగ్ల విద్య మోజులో పడి మాతృభాషను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రాథమిక విద్యలోనే ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అందరూ సహకరిస్తే విశాఖపట్నంలో తెలుగు మహాసభల్ని నిర్వహిస్తామని తెలిపారు.

## ప్రవాసుల స్ఫూర్తితో తెలుగుకు సేవ

తెలుగు రాష్ట్రంలో ఉండి తెలుగు భాషాను మరిచిపోతున్నామనీ, విదేశాలలో ఉన్న తెలుగు వారిని స్ఫూర్తిగా తీసుకొని భాషాను పరిరక్షించుకోవాలనీ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తన తండ్రి కీ.శే. మండలి వెంకటకృష్ణారావు తెలుగు భాషా పరిరక్షణ కోసం చేసిన సేవలు మరుపురానివన్నారు. ప్రతియేటా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో సంస్కృతి పురస్కారాలను భాషా పరిరక్షకులకు అందజేస్తామన్నారు. ఈ సభలో ఫ్రాన్స్ దేశస్థుడు డానియల్ నాజర్స్ వచ్చిరానీ తెలుగు భాషలో చేసిన ప్రసంగం నవ్వులు పూయించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిడ్ రాజు, మాజీ ఎమ్మెల్సీ వెంకటయ్య, అమెరికా తెలుగు సంఘనేత ఆళ్ల శ్రీనివాసరెడ్డి, లండన్ యుకె తెలుగు సంఘం నాయకులు సత్యప్రకాశ్, మలేషియా తెలుగు ప్రతినిధులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయ అంతర్జాతీయ తెలుగు కేంద్రం డైరక్టర్ ఆచార్య డి. మునిరత్నంనాయుడు స్థానిక సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆచార్య కె. జయశంకర్ తెలంగాణ కాలజ్ఞాని




తెలంగాణ రాష్ట్రం ఎప్పుడొస్తుందో, ఎట్లా వస్తుందో ముందే ఊహించి చెప్పిన కాలజ్ఞాని ఆచార్య జయశంకర్ అని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2016, ఆగస్టు 6వ తేదీన విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 82వ జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం శాంతియుతంగా సాగడానికి జయశంకరే కారణమన్నారు. ఉద్యమానికి ప్రముఖ భూమిక వేసిన ఘనత జయశంకర్‌దేనని, స్వాతంత్ర్య ఉద్యమం తర్వాత దేశంలో విజయవంతమైన మొట్టమొదటి ఉద్యమం తెలంగాణ ఉద్యమమని చక్రపాణి అన్నారు. తెలంగాణలో పుట్టిన వారు ఆంధ్రప్రాంతం వారైనా ఇక్కడివారేనని జయశంకర్ భావించారని తెలిపారు.

విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షోపన్యాసమిస్తూ తెలంగాణ ఉద్యమ విజయానికి మూడు కారణాలున్నాయని, అవి తాత్త్విక భూమిక, సంస్థాగత నిర్మాణం, నిబద్ధత నాయకత్వం అని, ఈ మూడింటిలో జయశంకర్ అతిముఖ్యమైన తాత్త్విక భూమిక నిర్మాణం చేశారని తెలిపారు. 1952వ సంవత్సరంలో 18 ఏళ్ళ వయసులో తెలంగాణ కోసం ఆలోచించడం ప్రారంభించిన జయశంకర్ చివరి నిముషం వరకు అదే ధ్యాస, అదే శ్వాసగా జీవించారని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు కోసం జరిగిన పోరాటంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి జయశంకర్ అన్ని మార్గాలను అన్వేషించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వి.సత్తిరెడ్డి, విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మలేషియా తెలుగు సంఘ ప్రతినిధులకు సన్మానం




మలేషియాలో తెలుగు భాషా చైతన్యాన్ని దశదిశలా వ్యాప్తి చేస్తున్న మలేషియా తెలుగు సంఘ ప్రతినిధులను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016 ఆగస్టు 6వ తేదీన విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించింది. ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం వల్ల తెలుగు వారికి రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయని, తెలుగు భాష రెండు రాష్ట్రాల్లోనూ అభివృద్ధి చెందుతుందని అన్నారు. మలేషియాలో తెలుగు వ్యాప్తికి కృషి చేస్తున్న మలేషియా తెలుగు సంఘాన్ని ఎంతగానో అభినందించారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచీకరణ అనివార్యమైన పరిస్థితుల్లో మనదైన భాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సంఘానికి విశ్వవిద్యాలయం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ అచ్చయ్య తన స్పందనలో మలేషియాలో ఉగాది పండుగ ప్రధానమైనదని, ప్రధానమంత్రి కూడా ప్రజలందరికి మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారన్నారు. తెలుగు భాషను తమ పిల్లలకి నేర్పించేందుకు పాటు పడుతున్నట్లు, తెలుగు విశ్వవిద్యాలయం నిర్దేశించిన పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేషియా ప్రతినిధులు గణేశన్, డాక్టర్ ప్రతాప్, దామోదరం, సీతారావు, దుర్గప్రియ, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ జుర్రు చెన్నయ్య, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిలికానాంధ్ర 'మనబడి' స్నాతకోత్సవం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం పక్షాన రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారి విద్యా సాంస్కృతిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో తెలుగు పీఠాలను నెలకొల్పి వాటి ద్వారా ఆయా ప్రాంతాలలో తెలుగు భాష బోధన, పరిశోధన, ప్రచురణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇటీవలి కాలంలో విదేశాలకు వలస వెళ్ళిన ప్రజలు వారి పిల్లలకు తెలుగు భాష, సంస్కృతులను నేర్పించాలనే తపన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం పక్షాన సిలికానాంధ్ర సంస్థ 'మనబడి' ద్వారా నిర్వహిస్తున్న తెలుగు సర్టిఫికెట్ కోర్సుకు, మలేషియా తెలుగు సంఘం నిర్వహిస్తున్న తెలుగు సర్టిఫికెట్ కోర్సుకు విశ్వవిద్యాలయం అఫిలియేషన్ మంజూరు చేసింది.

ఆ మేరకు సిలికానాంధ్ర 'మనబడి' సంస్థ అమెరికాలో 25 రాష్ట్రాలలో తెలుగు విశ్వవిద్యాలయం ఆమోదించిన పాఠ్య ప్రణాళిక ఆధారంగా నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సును వారాంతపు సెలవు దినాలలో (శని, ఆదివారాలు) 2007వ సంవత్సరం నుండి బోధిస్తోంది. సిలికానాంధ్ర 'మనబడి' విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 2014 అక్టోబర్ నెలలో మొదటిసారి అమెరికాలోని కాలిఫోర్నియా, డల్లాస్, న్యూజెర్సీలలో, 2015 మే నెలలో రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగింది. 2014లో 390 మంది, 2015లో 530 మంది విద్యార్థులు పరీక్షలు పై కేంద్రాలలో రాశారు.

2015-16 విద్యా సంవత్సరానికి అమెరికా దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో కూడా సిలికానాంధ్ర 'మనబడి' సంస్థ వారు తెలుగు బోధనను ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా 6000 మంది విద్యార్థులు తెలుగు కోర్సులో ప్రవేశం పొందారు. ఇందులో రెండేళ్ళు కోర్సు పూర్తి చేసిన వారికి జూనియర్ సర్టిఫికెట్‌గానూ, నాలుగేళ్ళు కోర్సు పూర్తి చేసిన వారికి సీనియర్ సర్టిఫికెట్ గాను నిర్ణయించి విశ్వవిద్యాలయం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తుంది. 2016 మే 14, 15 తేదీల్లో అమెరికాలోని కాలిఫోర్నియా, డల్లాస్, న్యూజెర్సీ, లాస్ ఏంజిల్స్ అనే నాలుగు ప్రధాన కేంద్రాలలో మొత్తం 1030 మందికి పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగింది.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి తెలుగు రెండవ భాషగా బోధనానుభవం కలిగిన నలుగురు అధ్యాపకులను పరిశీలకులుగా రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వై. రెడ్డి శ్యామల, పీఠాధిపతి, భాషాభివృద్ధిపీఠం డాక్టర్ జి.ఎస్. గేబ్రియల్, ఆచార్య డి. మునిరత్నం నాయుడు, డైరెక్టర్, అంతర్జాతీయ తెలుగు కేంద్రం వారు పరీక్షలు నిర్వహించి, మూల్యాంకనం చేసి, ఉత్తీర్ణులైన వారి జాబితాను విశ్వవిద్యాలయం పరీక్షల విభాగానికి పంపడమైంది. ఆ మేరకు పరీక్షల విభాగం వారు తయారు చేసిన సర్టిఫికెట్లను విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డా.జె. చెన్నయ్య అమెరికాకు తీసుకొని వెళ్ళారు. తేది. 22.05.2016న అమెరికాలో జరిగిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ సభలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య ఉపాధ్యక్షుల వారి పక్షాన ఉత్తీర్ణులైన విద్యార్థులకు వేదిక మీద సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

# తెలుగుకు ప్రాచీన హోదాపై మద్రాసు హైకోర్టు తీర్పు హర్షదాయకం

తెలుగు భాషకు ప్రాచీన హోదాను వ్యతిరేకిస్తూ చెన్నైకి చెందిన న్యాయవాది గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను 2016 ఆగస్టు 8 సోమవారం తేదీన మద్రాసు హైకోర్టు కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు పట్ల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. దీనితో కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ఇదివరకే ప్రాచీన హోదా కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం అమలుకు మార్గం సుగమమైంది. తమిళంతో పోలిస్తే తెలుగు భాషా సాహిత్యాలకు నిర్దిష్టమైన ప్రాచీన చరిత్ర ఉందని కాబట్టి తెలుగుకు ఆ ప్రతిపత్తి ఇవ్వాలని జరిగిన పోరాటంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ముందు నిలిచిందని ఆచార్య ఎస్వీ సత్యనారాయణ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అంతటా సమావేశాలు నిర్వహించి భాషా సాహిత్య రంగాల్లోని వారిని, ప్రజా ప్రతినిధులను, పత్రికా సంపాదకులను ఒక వేదిక మీదకు తెచ్చి వారి అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న అన్ని తెలుగు సంఘాల నుండి తెలుగుకు ప్రాచీన హోదా కోరుతూ తీర్మానాలు తెప్పించామని, ప్రపంచంలోని ముఖ్యమైన దేశాల్లో ప్రధానంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మలేషియా, మారిషస్ వంటి దేశాల తెలుగు సంఘాలు కూడా విశ్వవిద్యాలయం సమన్వయంతో తెలుగుకు ప్రాచీన హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమావేశాలు నిర్వహించాయని ఉపాధ్యక్షులు వివరించారు. ఎట్టకేలకు మద్రాసు హైకోర్టులో తెలుగుకు అనుకూలంగా తీర్పు వెలువడడం ఆహ్వానించదగిన పరిణామమని తెలిపారు. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ తీసుకున్న శ్రద్ధ అభినందనీయమని, ప్రభుత్వంతో చర్చించి కేంద్ర ప్రభుత్వం నుండి తెలుగు భాషాభివృద్ధి ప్రణాళికలకు రూప కల్పన చేసే విషయంలో తెలుగు విశ్వవిద్యాలయం తన వంతు కృషి చేస్తుందని ఎస్వీ సత్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో తెలుగు వికాసానికి జరిగే కార్యక్రమాలకు విశ్వవిద్యాలయం ముఖ్యమైన స్థానంగా ఉంటుందని వివరించారు.

## డాక్టర్ పరిమళగంధం ఆకస్మిక మృతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠంలోని నిఘంటు నిర్మాణ శాఖలో అధ్యాపకులుగా పని చేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ పరిమళగంధం 2016, ఆగస్టు 23న కుప్పంలో ఆకస్మికంగా మృతి చెందారు. డాక్టర్ పరిమళగంధం 1989 ఏప్రిల్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్‌గా విశ్వవిద్యాలయం విధుల్లో చేరారు. వీరు 2015 ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు.

# గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహాయం పొందిన రచయితలు

తెలుగులో సృజనాత్మక రచనలు, పరిశోధన, విమర్శ, ఎం.ఫిల్, పిహెచ్.డి తదితర విభాగాల్లో 73 మంది రచయితలకు తమ పుస్తకాలు ముద్రించుకోవడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక సహాయం మంజూరు చేసింది. తెలంగాణ పది జిల్లాల నుంచి 73 మందికి కనీసం 8 వేల నుంచి గరిష్టంగా 15 వేల వరకూ మొత్తం రూ. 7.8 లక్షలను కేటాయిస్తూ రచయితలకు లేఖలు పంపినట్లు ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ తెలిపారు. విశ్వవిద్యాలయానికి అందిన రాత ప్రతులను నిపుణులు పరిశీలించి అందజేసిన నివేదికలను అనుసరించి ఈ మొత్తాలను మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. జిల్లాల వారీగా: హైదరాబాదు నుంచి డా. కె. నిర్మలాదేవి, సిహెచ్. చంద్రయ్య, ఎస్. వినోభాచారి, డా.కె.నీహారిణి, డా.కె. అరుణజ్యోతి, కె. రమేష్, ఎ. పరమాత్మ, బి. సత్యనారాయణ, కందుకూరి శ్రీరాములు, అరుణ నారదభట్ల, అరుణశ్రీ, ఎస్. స్వర్ణలత, బి. సంపత్ కుమార్, పొత్తూరి విజయలక్ష్మి, ఎస్. నాగేంద్రనాథరావు, వి. రాజేశ్వర్‌శర్మ, ఎం.ఎస్.బి.బి.కె. దుర్గా ప్రసాద్, ఒద్దిరాజు మురళీధరరావు, జి. పరమేశ్వర్, డా.ఎం. ప్రమీలాదేవి, కె.పి.అశోక్ కుమార్, ఆచార్య ననుమాస స్వామి, ఎం.వి.వి. ప్రసాద్, ఆర్.శ్రీరాములు, బి.వి. భద్రగిరీష్, ఎ. వెంకట నారాయణ, సి.బి.ఆర్. మాణికేశ్వరి, ఆచార్య సూర్యధనుంజయ్, ఆచార్య ఎస్వీ. రామారావు, కె. లక్ష్మారెడ్డి, ఎం. శ్రీనివాస్‌లకు నల్గొండ జిల్లా నుంచి పల్లె వెంకన్న, వాసా భూపాల్, ఎస్. నాగజాను, బైరపాక స్వామి, దండమూడి శ్రీ చరణ్, సుంకర రమేష్, పి. వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా నుంచి బి. రాజ్‌కుమార్, గజవెల్లి యల్లయ్య, సి.వి. జయవీర్ రాజు, టి. శ్రీరంగస్వామి, కరీంనగర్ జిల్లా నుంచి ఎ. శ్రీధర్, యం. రత్నం, సిరిసిల్ల చందన, పొన్నాల బాలయ్య, జిందం అశోక్, పత్తిపాక మోహన్, పెరుక రాజు, యం. నారాయణ శర్మ, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సురేష్ బాబు, ఎం. పురుషోత్తం, కె. రఘురాములు గౌడ్, రంగారెడ్డి జిల్లాలో డా. మలుగ అంజయ్య, కె. బుచ్చయ్య, కె. సత్యం, కూతురు రాంరెడ్డి, మెదక్ జిల్లాలో పి. మల్లేశం, ఎ. చంద్రారెడ్డి, పప్పుల రాజిరెడ్డి, వి. వెంకటేశ్ గౌడ్, యం. యాదగిరి మాదిగ, వి. ముద్దంగుల ఎల్లన్న, పి. వెంకటేశ్వర్లు, సిద్దంకి యాదగిరి, పి. యాదగిరి, సిహెచ్. సుధాకర్, ఖమ్మం జిల్లాలో ఎస్.ప్రభాకరాచార్యులు, ఆదిలాబాద్ జిల్లాలో ఎం.జి. ఖుర్షీద్ అహ్మద్ ఖాన్, గోపగాని రవీందర్, నిజామాబాద్ జిల్లాలో సిహెచ్. ప్రకాష్, వి. శంకర్.

పుటల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని వీరికి ఆర్థిక సహాయం మంజూరు చేశామని, పుస్తకాలు ముద్రించి అందజేయడానికి తగిన గడువు కూడా ఇచ్చామని ఆచార్య ఎస్వీ సత్యనారాయణ తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయికి తెలుగు విశ్వవిద్యాలయం



తెలుగు విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామని ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అన్నారు. విశ్వవిద్యాలయ ప్రధాన ప్రాంగణంలో ఆగస్టు 15, 2016 నాడు 70వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ – సాహిత్యం, సంగీతం, నృత్యం, రంగస్థల కళలు, జానపద కళలు, శిల్పం తదితర కోర్సుల నిర్వహణ ద్వారా మన సంస్కృతి పరిరక్షణ, పరివ్యాప్తికి దోహదం చేయాలని భావిస్తున్నామని అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఇతర సంప్రదాయ విశ్వవిద్యాలయాల వంటిది కాదన్నారు. తగిన ప్రణాళికలతో వస్తే నిధుల కొరత అనేది లేకుండా చూస్తానని అన్నారు. నీది, నాది అని కాకుండా మనది అనే భావంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరిచేందుకు కృషి చేద్దామని తెలియజేశారు. తెలంగాణ కళలకు భాషా సంస్కృతులకు సంబంధించి బంగారు తెలంగాణ కోసం పాటుపడవలసిన తరుణం ఆసన్నమైందని అన్నారు. భారతదేశ 70వ స్వాతంత్ర్య దినోత్సవం, 75వ క్విట్ ఇండియా ఉద్యమం శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్యోద్యమ ఘట్టాన్ని వివరిస్తూ బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ కృషిని వివరించారు. స్వాతంత్ర్యోద్యమ ఫలితాలను అనుభవిస్తూ, భావితరాలకు అందించవలసిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. దూరవిద్యా కేంద్రం లలిత సంగీతం విద్యార్థుల దేశభక్తి గీతాలను ఆలపించారు. ప్రముఖ గాయని, నృత్యశాఖ అధ్యాపకురాలు ఎ. శారదారెడ్డి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రచించిన ఉదయం మహోదయం అనే దేశభక్తి గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి, వివిధ పీఠాల అధిపతులు, కేంద్రాధిపతులు, శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసూయ ద్వేషాలతో పతనమవుతున్న మనిషి



రక్షాబంధన్‌ను పురస్కరించుకుని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సోదరీమణులు 2016, ఆగస్టు 17వ తేదీ గురువారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. సిస్టర్ సుజాత నేతృత్వంలోని ఈ బృందం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు రాఖీ కట్టారు. ప్రతిఫలంగా కొన్ని గుణాలు వదిలిపెట్టాలని బ్రహ్మకుమారీలు ఉపాధ్యక్షులును కోరగా... కోపం, అసూయ ద్వేషాలే మనిషి పతనానికి కారణమవుతాయి. కాబట్టి ఈ రెండింటితో పాటు బద్ధకాన్ని వదిలేస్తున్నట్లు ఉపాధ్యక్షులు తెలిపారు. మనిషికి మనిషికీ మధ్య ప్రేమ సుగంధాలు వెదజల్లే సమాజ నిర్మాణం కోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

## రసమయి బాలకిషన్‌కు ప్రీ పిహెచ్.డి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖలో పిహెచ్.డి పరిశోధన చేస్తున్న సాంస్కృతిక సారధి అధ్యక్షులు రసమయి బాలకిషన్ ఇటీవలే ప్రీ పిహెచ్.డి పూర్తి చేశారు. 2016 ఆగస్టు 22వ తేది సోమవారం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తీర్ణతా పత్రాన్ని అందుకున్నారు. ఆయన గతంలో తెలుగు విశ్వవిద్యాలయంలోనే ఎం.ఎ. పూర్తి చేశారు. పిహెచ్.డి పరిశోధన కూడా త్వరగానే పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. రిజిస్ట్రార్ వి. సత్తిరెడ్డి, బుద్ధవనం ప్రాజెక్టు అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య, పాత్రికేయులు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జానపద దినోత్సవం



ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖ ఆధ్వర్యంలో 2016 ఆగష్టు 22వ తేది సోమవారం కళాకారులు ప్రదర్శించిన విభిన్నమైన తెలంగాణ జానపద కళారూపాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. తెలంగాణకు ప్రత్యేకంగా పేరు తెచ్చిన ఒగ్గు కథ, లంబాడీ నృత్యం, జానపద బృందగానం, కోలాటం, డప్పు నృత్యం, బుర్రకథ, జడకోపు కట్టిపడేశాయి. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, సాంస్కృతిక సారథి ఛైర్మన్ రసమయి బాలకిషన్, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ డైరెక్టర్, బుద్ధవనం ప్రాజెక్టు అధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య, జర్నలిస్టు పాశం యాదగిరి తదితర ప్రముఖుల సమక్షంలో కళాకారులు డప్పు నృత్య విన్యాసాలతో, చెక్కభజన దరువులతో స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరం వేదికపై జరిగిన అరుదైన కళారూపాలు ప్రదర్శన నగరానికి జానపద సౌరభాన్ని పరిచయం చేసింది. తలారి బాలయ్య గొంతు కిన్నెర ప్రత్యేకతను చాటింది. ఒకవైపు అలవోకగా వీరగాధను ఆలపించి ఆ వెంటనే గొంతుతోనే కిన్నెర వాద్యాన్ని పలికించి అపూర్వమైన అనుభూతిని పంచారు.

పన్నెండు మెట్ల కిన్నెర మొగులయ్య పాలమూరు జిల్లాకు చెందిన జానపద గాధను గానం చేస్తూ మీటిన మెట్లకిన్నెర పరవశింప జేసింది. ఈ రెండు అంశాలను గురించి జానపద విజ్ఞాన పరిశోధకుడు డా. దాసరి రంగ పరిచయం చేశారు.

జానపద కళల శాఖ విద్యార్థులు ప్రదర్శించిన లంబాడి నృత్యం తరువాత షేక్ బాబూజీ బృందం ప్రదర్శించిన శ్రీకృష్ణదేవరాయలు బుర్రకథ రంజింపచేశాయి. విఖ్యాత ఒగ్గు కథ కళాకారుడు మిద్దె రాములు

వద్ద శిక్షణ పొంది అనంతరం తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద కళల్లో ఎం.ఏ. పూర్తి చేసిన ఎగుర్ల శ్రీనివాస్ బృందం ప్రదర్శించిన ఎల్లమ్మ ఒగ్గు కథ తెలంగాణ జానపద కళా వైశిష్ట్యానికి ప్రతిబింబంగా నిలిచింది. కళాకారుల గానం, నృత్యం పోటీపడి సాగింది. భజన పుల్లయ్య నేతృత్వంలో గద్వాల కళాకారులు ప్రదర్శించిన జడకోపు, చెక్కభజన ఆసక్తికరంగా సాగాయి. లయబద్ధంగా నృత్యం చేస్తూనే జడకోపును అల్లటంలో చూపిన నైపుణ్యం వస్త్ర శిల్పాన్ని తలపించింది.

గుడిపెల్లి రవి బృందం ఆలపించిన 'మల్లెల మకరందమే నా జానపదం', 'ఉరుమోలె ఉరమాలె మెరుపోలె మెరువాలె' బృందగానం అర్థవంతంగా సాగింది. ప్రముఖ గాయకులు మాష్టార్జీ అందించిన జానపద గీత కదంబం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ జానపద కళలకు పెద్ద పీట వేయడం ద్వారా ఈ కళలను సామాన్య ప్రజల్లోకి తీసుకువెళతామని, యువతకు మనదైన సంస్కృతిని పరిచయం చేస్తామని అన్నారు. ముఖ్య అతిథి సాంస్కృతిక సారథి అధ్యక్షులు రసమయి బాలకిషన్ తనదైన శైలిలో పాటలు పాడుతూ తన జీవితాన్ని నిలబెట్టిన జానపద కళల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. రానున్న కాలంలో తెలంగాణ కళల రాష్ట్రంగా వెలుగొందుతుందని చెప్పారు. ఆదిమ దశ నుంచి ఆధునిక దశ వరకూ పాట మానవ జీవితంలో విడదీయలేని విధంగా సాగిందని తెలిపారు.

బుద్ధవనం ప్రాజెక్టు అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య భారతదేశంలో ఎక్కడాలేనన్ని జానపద కళలు తెలంగాణలో ఉన్నాయని అన్నారు. తెలంగాణ జానపద కళా రూపాలకు సంబంధించిన వస్తు ప్రదర్శన శాలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు ఆచార్య వి. సత్తిరెడ్డి, విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జానపద కళల శాఖ విద్యార్థిని అరుణ ప్రార్థనా గీతం ఆలపించారు.



# ఉమా రామారావు మృతికి సంతాపం



ప్రముఖ నాట్యవేత్త డాక్టర్ కె. ఉమారామారావు మృతికి 2016 ఆగస్టు 27వ తేదీ శనివారం నాడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రగాఢ సంతాపం తెలియజేసింది. చిన్నతనంలోనే నాట్య కళారంగంలో పాదం మోపి గొప్ప గురువుల వద్ద తన కళా విద్యకు మెరుగులు దిద్దుకుని నర్తకిగా, నాట్య గురువుగా, నాట్య కళా పరిశోధకురాలిగా విశేషమైన సేవలందించిన ఉమ తెలుగు విశ్వవిద్యాలయం తొలినాళ్ళలోనే నృత్యశాఖలో ఆచార్యులుగా ప్రవేశించారని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ వివరించారు. కూచిపూడి, భరతనాట్యం రెండు శైలుల్లోనూ ప్రావీణ్యం కలిగిన డా. ఉమారామారావు తెలుగు విశ్వవిద్యాలయం నృత్యశాఖ ద్వారా ఎంతో మంది నర్తకీ, నర్తకులను తీర్చి దిద్దారని, దేశ, విదేశాల్లో ఆమె శిష్యులు నాట్యకళా వ్యాప్తికి సేవ చేస్తూనే ఈ తరానికి నాట్యంలో శిక్షణ ఇస్తున్నారని ఆయన తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం డాక్టర్ ఉమా రామారావును ప్రతిభా పురస్కారంతో సముచితంగా సత్కరించుకున్నదని ఎస్.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. కూచిపూడి సంప్రదాయ కుటుంబాలకు చెందిన గురువులకు ప్రత్యామ్నాయంగా తనదైన మార్గాన్ని ఏర్పరచి, నాట్యంలో ప్రయోగాలకు, పరిశోధనకు సమ ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

డాక్టర్ ఉమారామారావు 2016 ఆగస్టు 26 తేదీన అనారోగ్యంతో హైదరాబాదులో మృతి చెందారు.

# ఉద్యోగుల అభిమానాన్ని చూరగొనడం ప్రశంసనీయం



విశ్వవిద్యాలయంలో తమ తోటి ఉద్యోగుల నుంచి అభిమానం పొందడం ప్రశంసనీయమని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఇన్‌ఛార్జిగా, ప్రజా సంబంధాల అధికారిగా సేవలందించిన డాక్టర్ జుర్రు చెన్నయ్య, పరిపాలనా విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా సేవలందించిన సి. రామలక్ష్మి, ఉపాధ్యక్షులు కార్యాలయంలో డిప్యూటి రిజిస్ట్రార్‌గా పని చేసిన ఎన్. సుధాకర్ రెడ్డి, పరిపాలన విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన వై. నాగమణి వయసు రీత్యా 2016, ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈ నలుగురు ఉద్యోగులకు వీడ్కోలు సమావేశాన్ని డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యక్షులు ప్రసంగిస్తూ పదవీ విరమణ కార్యక్రమం ఆనందంగా జరగడం సంతోషదాయకమన్నారు. తమ ఉద్యోగ జీవితంలో ఇంత మంది అభిమానాన్ని పొందడం ప్రశంసనీయమన్నారు. ఈ నలుగురు ఉద్యోగులు తమ తమ రంగాల్లో విశిష్టమైన కృషి చేసి విశ్వవిద్యాలయం అభివృద్ధిలో పాలుపంచుకున్నారనీ, విశ్వవిద్యాలయం ప్రతిష్ట పెంచారని కొనియాడారు. పదవీ విరమణ రోజున అందరూ ప్రశాంతంగా ఉన్నారు. విశ్రాంత జీవితం చాలా ఆనందంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయానికి విలువైన సేవలందించిన మీ వెంట విశ్వవిద్యాలయం ఉంటుందన్నారు.



సభకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. సత్తిరెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత పదవీ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులకు విశ్వవిద్యాలయం తరపున ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్ ఘనంగా సత్కరించి వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలను అందజేశారు. అనంతరం వివిధ పీఠాల అధిపతులు, కేంద్రాధిపతులు, శాఖాధిపతులు, ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు, బంధువులు, ఆత్మీయులు, స్నేహితులు పదవీ విరమణ పొందిన సిబ్బందికి సముచిత రీతిన సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అనంతరం పలువురు అభినందనపూర్వక ప్రసంగాలు చేసారు. విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారితో గల ఆత్మీయ అనుబంధం పంచుకున్నారు.

ఎం. రాములు తమ ప్రసంగంలో ఉద్యోగులందరూ ఆయా విభాగాల్లో పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశారన్నారు. బతకడానికి విశ్వవిద్యాలయం జీవనోపాధి కల్పించింది. ఈ విశ్వవిద్యాలయాన్ని మరచిపోకూడదన్నారు. విశ్వవిద్యాలయానికి డాక్టర్ జె. చెన్నయ్య అమూల్య కానుక అని అభివర్ణించారు.

అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు మాట్లాడుతూ విధుల నిర్వహణలో వారితో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేశారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రం నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో చెన్నయ్య ఎంతో సహకారం అందించారని కొనియాడారు.

ఆంధ్ర నాట్యం అధ్యాపకురాలు డా. సువర్చల తన ప్రసంగంలో చిన్ననాటి నుంచి చెన్నయ్యతో గల ఆత్మీయ అనుబంధం, వారి సేవలు, కృషిని ప్రశంసించారు.

చరిత్ర – సంస్కృతి – పురావస్తు శాస్త్ర పీఠం పీఠాధిపతి ఆచార్య పి. చెన్నారెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులు, స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారనీ, డాక్టర్ జె. చెన్నయ్య



మంచి జ్ఞాని అని ప్రశంసించారు.

చరిత్ర – సంస్కృతి – పురావస్తు శాస్త్ర పీఠం, తెలుగు భాషీయులు చరిత్ర – సంస్కృతి శాఖాధిపతి డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ ఉద్యోగులకు మంచి అవకాశం విశ్వవిద్యాలయం కల్పించిందన్నారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎదగడానికి దోహదం చేసిందన్నారు. విశ్వవిద్యాలయాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

జర్నలిస్టు డాక్టరు కె.బి.లక్ష్మి మాట్లాడుతూ స్పష్టత, ఖచ్చితత్వం, భాష, స్వరం, అనువాదం, చక్కగా సమాచారం అందజేయడం – ఈ లక్షణాలన్నీ చెన్నయ్యలో పుష్కలంగా ఉన్నాయనీ, ఇవన్నీ వీరు ఎదగడానికి దోహదం చేశాయని ప్రశంసించారు.

డాక్టర్ జె. చెన్నయ్య లేని లోటు పూడ్చలేనిదని జయభారతి అన్నారు. అనుకున్న పని స్వేచ్ఛగా చేసే అవకాశం పదవీ విరమణతో చెన్నయ్యకు లభించిందన్నారు.

పరిశోధక విద్యార్థులు ఆరూరి సుధాకర్ తమ ప్రసంగంలో విశ్వవిద్యాలయం విద్యార్థులకు గుర్తింపు ఇచ్చిందన్నారు. ఏదైనా విషయాన్ని నూతనంగా పరిచయం చేసే నైపుణ్యం చెన్నయ్యకు ఉందన్నారు. గుర్తింపు కలిగి, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించాలని కోరారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమ మద్దతు ఇస్తామన్నారు.

మరో పరిశోధక విద్యార్థి గుడిపల్లి రవి తన ప్రసంగంలో పదవీ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఆత్మీయ మనస్తత్వం, ప్రేమను పంచే గొప్ప వ్యక్తిత్వం కలిగిన వారు చెన్నయ్య అని అన్నారు. చెన్నయ్య ఉండే పరిసరాలు ఆనందంతో ఉంటాయన్నారు. ఎంతో మంది ప్రతిభా వంతులైన కళాకారులను వెలికి తీసి వారికి గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు.




డాక్టర్ విజయ కుమార్‌జీ మాట్లాడుతూ యూనివర్సిటీ గొంతుకను ప్రపంచానికి చెన్నయ్య చాటి చెప్పారన్నారు. యూనివర్సిటీ మీద రాళ్ళు పడకుండా తన శరీరాన్ని అడ్డుపెట్టారన్నారు. తన పదవిని అడ్డు పెట్టుకుని ఏనాడు ఏదీ ఆశించలేదని తెలిపారు.

డాక్టర్ జె. చెన్నయ్య కుమారుడు వసంత్ మాట్లాడుతూ మా నాన్న ఇంత పేరు ప్రఖ్యాతులు సంపాదించడానికి మా అమ్మ కృషి ఎంతో ఉందన్నారు. మా నాన్న మా నాయకుడు. ఆయనలో జ్ఞానానికి మించిన కళ ఉంది. అది వెలుగులోకి రావాలి. అభిమానం చూపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆచార్య సి. నారాయణ రెడ్డి పెద్ద అల్లుడు భాస్కరరెడ్డి విశ్వవిద్యాలయ ఉద్యోగులు అశ్వాఖ్ అహ్మద్, దశరథరెడ్డి, డా. భాగవతుల సేతురామ్,  పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అభినందిస్తూ ప్రసంగాలు చేశారు.

అనంతరం విశ్వవిద్యాలయం, ఉద్యోగుల సేవలను కొనియాడుతూ తమకు చేసిన సత్కారానికీ, తెలిపిన అభినందలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ స్పందనను వినిపించారు.

ఉద్యోగ జీవితంలో తనకు సహకరించిన వారందరికీ రామలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను 1986, జూన్ 2న తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందానని గుర్తు చేశారు. తల్లిదండ్రులకు, ఉద్యోగ అవకాశం కల్పించిన అప్పటి ఉపాధ్యక్షులు ఆచార్య తూమాటి దొణప్పకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన ఉద్యోగ జీవితం ఇలాంటి మంచివారి మధ్య గడచి పోవడం భగవంతుడు తనకు ఇచ్చిన వరంగా భావిస్తానన్నారు.

వై. నాగమణి తన స్పందన ప్రసంగంలో విశ్వవిద్యాలయంలో ఉద్యోగ అవకాశం కల్పించిన అప్పటి డిప్యూటీ రిజిస్ట్రార్ డి.వి. సుబ్బారావుకు తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

డాక్టర్ జె. చెన్నయ్య భావోద్వేగానికి లోనై తన స్పందన ప్రసంగాన్ని ప్రారంభించారు. తన గురించి మాట్లాడిన వారికీ, అభినందించిన వారికీ, కృతజ్ఞతలు తెలియజేశారు నాకు లభించిన అభినందనలు, సత్కారాలు విశ్వవిద్యాలయంలోని అందరికీ చెందుతాయన్నారు. జన్మనిచ్చిన తన తల్లి, విశ్వవిద్యాలయం, నా భార్య ఈ ముగ్గురు లేకుండా తాను లేనన్నారు. తన ఆరు నెలల వయసులో తండ్రి చనిపోతే అమ్మే తల్లీ తండ్రియై నన్ను పెంచి పోషించింది. కూలీ నాలీ చేసి నన్ను ఉన్నత చదువులు చదివించింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే తొలుత పోస్ట్ మాస్టర్ ఉద్యోగం వచ్చింది. ఒక వైపు ఉద్యోగం చేస్తూ, చదువుకుంటూ, జిల్లా విలేఖరిగా పని చేశాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చేశాను. భారతీయ విద్యాభవన్‌లో జర్నలిజం కోర్సు చేశానని వివరించారు. ఎన్.టి.రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించిన తొలి రోజుల్లోనే 1982లో ఇంటర్వ్యూ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఈనాడులో పని చేస్తున్న కాలంలో డాక్టర్ సి. నారాయణరెడ్డి తనకు ఉద్యోగ అవకాశం కల్పించారనీ, వారి పేరు నిలబెట్టాననీ అన్నారు. ఇది నాకు జీవితంలో సంతృప్తినిచ్చిందన్నారు. విశ్వవిద్యాలయం ప్రతిష్ట పెంచేది ప్రజా సంబంధాల అధికారి ఉద్యోగమని అన్నారు.

రామోజీరావు దగ్గర జర్నలిజంలో మెలుకువలు నేర్చుకున్నాను. వారికి ఎప్పటికీ కృతజ్ఞుడినన్నారు. ఉపాధ్యక్షులు అందరికీ దగ్గరగా ఉంటూ సేవలు అందించానే తప్ప, ఎవరి మనిషిగాను ఉండలేదన్నారు. ప్రజా సంబంధాల అధికారి అంటే కళ్ళు, చెవులు అన్నారు.

రేడియోలో తన అనుభవాలు వివరించారు. ఎంతో మంది రాష్ట్రపతుల ప్రసంగాలను, ప్రధాన మంత్రుల ఉపన్యాసాలను అనువాదం చేసే అవకాశం తనకు లభించిందన్నారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్‌ను 12 సంవత్సరాలు అనువాదం చేసానన్నారు.

తనకున్న అభిరుచిని, అవకాశాలు తోడు చేసుకుని కృషి చేశానన్నారు. 26 సంవత్సరాలు విశ్వవిద్యాలయంలో జీవించానన్నారు. ఉద్యోగం తనకు సంతృప్తి ఇచ్చిందన్నారు. ఈ వేదిక నాకు మరోచోట దొరకదని ఆవేదన చెందారు. ఉద్యోగాన్ని బాగా ఆస్వాదించానన్నారు. 1200 మంది వరకు బయోడేటాలు రాసి చదివానన్నారు. ఆయా ప్రముఖుల సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించానని తెలిపారు. ఇది తనకు లభించిన గొప్ప అవకాశంగా భావించానన్నారు. ఆకాశవాణి కూడా తనకు మంచి పేరు తెచ్చిందన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి కోసం కొన్ని పుస్తకాలు అనువదించాననీ, అదే విధంగా సుర్జిత్ సింగ్ బర్నాలా జీవిత చరిత్రను కూడా తెలుగులోకి అనువదించానని గుర్తు చేసారు.

విశ్వవిద్యాలయానికి మంచి పేరు రావడానికి కవులకు, రచయితలకు పురస్కారాలు అందించేలా కృషి చేశానన్నారు. డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, డాక్టర్ దాశరథి రంగాచార్య, డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్, డాక్టర్ కపిలవాయి లింగమూర్తి లాంటి వారికి విశ్వవిద్యాలయం తరపున సత్కారాలు అందించే విషయంలో కృషి చేశానని తెలిపారు.

వ్యక్తిగత రాగ ద్వేషాలు తనకు లేవనీ, కవులు కళాకారులందరితో తనకు పరిచయం ఉందన్నారు. విస్తరణ సేవా విభాగంలో తనకు సహకరించిన ఉద్యోగులందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రకాల అవకాశాలు కల్పించిన విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తన ఉద్యోగ జీవితం సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విస్తరణ సేవా విభాగం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి ఆర్. రామమూర్తి నిర్వహించారు.

# ఆచార్య పూజారి అప్పారావు, వాల్మీకి రామచంద్రుడు పదవీ విరమణ





పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠం పీఠాధిపతి ఆచార్య పూజారి అప్పారావు, గ్రంథాలయంలో పని చేస్తున్న సెమి ప్రొఫెషనల్ వాల్మీకి రామచంద్రుడు 2016 మే 30వ తేదీన వయసు రీత్యా పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ వీడ్కోలు సభకు పీఠాధిపతి ఆచార్య జి. వెంకటరామయ్య అధ్యక్షత వహించారు. పదవీ విరమణ చేస్తున్న ఇరువురు ఉద్యోగులను విశ్వవిద్యాలయం తరపున ఘనంగా సత్కరించారు.

ఆచార్య జి. వెంకట్రామయ్య మాట్లాడుతూ పూజారి అప్పారావు చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠానికి వివిధ హోదాలలో చేసిన సేవలను తెలియజేస్తూ, అభినందించారు. వి. రామచంద్రుడు గ్రంథాలయం అభివృద్ధికి పాటుబడ్డారనీ వీరిద్దరి కృషి ప్రశంసనీయమన్నారు. డాక్టరు ముసుగు శ్రీనివాసరావు తన ప్రసంగంలో అప్పారావు గారితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో పథ సహాయకులుగా పనిచేస్తున్న డాక్టర్ యాదవ రఘు మాట్లాడుతూ రామచంద్రుడి నిబద్ధత, విద్యార్థుల పట్ల ఆయనకు ఉన్న ప్రత్యేక శ్రద్ధ గుర్తు చేశారు.

చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠంలో పథక సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దేవులపల్లి విశ్వనాథశాస్త్రి, డాక్టర్ ఎ. శోభన్ బాబుగార్లు మాట్లాడుతూ ఆచార్య అప్పారావు, వి. రామచంద్రుడు గార్లతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. విశ్వ విద్యాలయానికి వారు చేసిన సేవలను శ్లాఘించారు. వారితో తమకు గల ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేశారు. పరిశోధక విద్యార్థులు జె. గోపలక్ష్మి, నాగలక్ష్మి, అభిలాష్, దుర్గ, సురేష్ బాబు, కిరణ్ కుమార్‌లు ప్రసంగించారు. ఆచార్య పి. అప్పారావు తన స్పందనను తెలియజేస్తూ పదవీ విరమణ వయసుకే కాని మనసుకు కాదని అన్నారు. పదవీ విరమణ తర్వాత విద్యాత్మక కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగిస్తూ, నిరంతర విద్యార్థిగా ఉంటానన్నారు. వి. రామచంద్రుడు ప్రసంగిస్తూ గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి పరిశోధకులకు, విద్యార్థులకు విద్యాత్మక విషయాల్లో చేసిన సేవలు సంతృప్తినిచ్చాయన్నారు. 30 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని తీవ్ర భావోద్వేగానికి లోనై, కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల బంధువులు, ఆత్మీయులు పాల్గొన్నారు.

# తెలుగు భాషీయుల చరిత్ర - సంస్కృతి శాఖాధిపతి
# డాక్టర్ భూక్యా బాబూరావు



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలం ప్రాంగణంలోని తెలుగు భాషీయుల చరిత్ర - సంస్కృతి శాఖ అధిపతిగా డాక్టర్ భూక్యా బాబూరావు 2016, మే 30న పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఆచార్య పూజారి అప్పారావు వయసు రీత్యా మే 30న పదవీ విరమణ చేయడంతో వారి స్థానంలో తెలుగు భాషీయుల చరిత్ర - సంస్కృతి శాఖలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న బాబూ రావును శాఖాధిపతిగా విశ్వవిద్యాలయం నియమించింది. ఆ మేరకు బాబూరావు శాఖాధిపతి బాధ్యతలను ఆచార్య అప్పారావు నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు బాబూరావును అభినందించారు.

డాక్టర్ భూక్యా బాబూరావు 1995 సంవత్సరం నుండి చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరి పర్యవేక్షణలో పలువురు విద్యార్థులు ఎం.ఫిల్, పిహెచ్.డి. పట్టాల కోసం పరిశోధనలు చేస్తున్నారు.

## ఉత్తమ ప్రజా సంబంధాల అనువాదక పురస్కారం అందుకున్న డాక్టర్ జె. చెన్నయ్య

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ జె. చెన్నయ్య ఉత్తమ ప్రజా సంబంధాల అనువాదకులు పురస్కారాన్ని అందుకున్నారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో 2016, ఆగస్టు 6వ తేదీన నేషనల్ పబ్లిక్ రిలేషన్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యాత్మక సంచాలకులు ఆచార్య రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ పత్రిక సంపాదకుడు డాక్టర్ సి.వి. నరసింహారెడ్డి కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ డాక్టర్ ఘంటా చక్రపాణి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజా సంబంధాల అధికారులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ జె. చెన్నయ్యకు ఉత్తమ అనువాదకుని పురస్కారం ప్రదానం జరిగింది. అనువాద రంగంలో చెన్నయ్య చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వక్తలు ప్రశంసించారు.

“సాహిత్యానువాద రంగంలోనే కాకుండా, జర్నలిజం, ప్రజా సంబంధాల సాహిత్యానువాదంలో కూడా చేసిన విశేషమైన కృషి చేశారని వక్తలు ప్రశంసించారు.

# ఆచార్య జి. వెంకటరామయ్య పదవీ విరమణ



2016, జులై 30వ తేదిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైల ప్రాణంగం పీఠాధిపతి ఆచార్య జి. వెంకటరామయ్య వయసు రీత్యా పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వీడ్కోలు సభ సమావేశమందిరంలో ఉదయం జరిగింది. సమావేశానికి సభాధ్యక్షులుగా నూతన పీఠాధిపతి ఆచార్య పి. చెన్నారెడ్డి వ్యవహరించారు. ఆచార్య జి. వెంకటరామయ్య తాను 30 ఏళ్ళుగా పీఠంలోనూ, హైదరాబాదు ప్రాంగణంలోనూ కలిసి పని చేశానని తెలిపారు. ఉద్యోగ జీవితంలో అప్పుడప్పుడు చిన్న చిన్న మనస్పర్ధలు వస్తూ ఉంటాయి, అవి టీ కప్పులో తుఫానులు లాగా సమసిపోతుంటాయని తెలిపారు. విశ్వవిద్యాలయం పక్షాన ఘనంగా జి. వెంకట్రామయ్యను సత్కరించారు. అటు తరువాత సన్మాన కార్యక్రమం జరిగింది. వెంకట్రామయ్య గారిని సన్మానించిన వారిలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, ప్రచురణల విభాగం సంచాలకులు ఆచార్య వి. నిరీక్షణ బాబు, కంప్యూటర్ సెల్ / యు.జి.సి. డైరెక్టర్ డాక్టర్ కె. సుధీర్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం ఇ.ఇ. దిలీప్ కుమార్ రెడ్డి, అంతర్జాతీయ తెలుగు కేంద్రం డైరెక్టర్ ఆచార్య డి. మునిరత్నం నాయుడు, నాగార్జున విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయన కేంద్రం అధ్యాపకులు ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి తదితరులు ఉన్నారు.

కేంద్ర కార్యాలయం నుండి పరీక్షల విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ అజయ్ చంద్ర, ప్రభాకర రెడ్డి, రవీంద్రరెడ్డి, మ్యూజియం ఇన్‌ఛార్జి బి. శ్రీనివాసగౌడ్, రంగారెడ్డి వారితో పాటు నాల్గవ తరగతి సిబ్బంది ఆంజనేయులు, ఎం. నాగేశ్వరరావు, రమణ, చంద్రశేఖరరెడ్డి, డ్రైవర్ రత్నకుమార్

మొదలగువారు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పైవారందరితో పాటు శ్రీశైల ప్రాంగణ బోధన, బోధనేతర నాల్గవ తరగతి సిబ్బంది అందరూ కలిసి ఆచార్య వెంకట్రామయ్య దంపతులను సత్కరించారు.

ఈ సందర్భంగా పీఠంలోని బోధనా సిబ్బంది పక్షాన ఆచార్య ఆర్. చంద్రశేఖరరెడ్డి, డా. బి. బాబూరావు, డాక్టర్ ఎం. ముసుగు శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్లంటి శోభన్‌బాబు, డాక్టర్ డి. విశ్వనాథ శాస్త్రి తదితరులు ప్రసంగించారు. ప్రసంగం అనంతరం ఆచార్య వెంకట్రామయ్య తన స్పందనను తెలియజేస్తూ తనకి ఈ రోజు గర్వకారణంగా ఉందనీ, తాను వారి నాన్నకు ఇచ్చిన మాట ప్రకారం విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అయ్యాననీ ఈ జన్మకు ఇంతకంటే అదృష్టం ఏమీ లేదన్నారు. అలాగే ఈ సన్మాన కార్యక్రమానికి హాజరైన వారందరికీ, తన ఉద్యోగ జీవితంలో సహకరించి తనను ఇంతవాడిని చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ చివరగా ఈ కార్యక్రమాన్ని తన స్వాగతోపన్యాసం నుండి ముగింపు వరకు ముందుండి నడిపిన ఆచార్య పి. చెన్నారెడ్డి, డా. ముసుగు శ్రీనివాసరావు గార్లకు ఇతర శ్రీశైల ప్రాంగణ సిబ్బంది అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆచార్య జి. వెంకట్రామయ్య పదవీ విరమణ సందర్భంగా, 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ హిస్టారికల్ కల్చరల్ స్టడీస్' అనే గ్రంథాన్ని డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్. అచ్చమాంబగార్ల సంపాదకత్వంలో వెలువరించారు.

## చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో 2016 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పీఠాధిపతి ఆచార్య పి. చెన్నారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పీఠంలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తులనాత్మక అధ్యయన కేంద్రం సంచాలకులుగా డాక్టర్ ఎం. గీతావాణి



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని లలిత కళాపీఠంలోని తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం. గీతావాణి తులనాత్మక అధ్యయన కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులుగా నియమించబడ్డారు. అప్పటివరకు సంచాలకులుగా ఉన్న ఆచార్య సి. మృణాళిని వయసురీత్యా పదవీ విరమణ చేయడంతో డాక్టర్ గీతావాణి 2016 జూన్ 30న మృణాళిని నుంచి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ఎం. గీతావాణి దూరవిద్యా కేంద్రం ఇన్‌ఛార్జి సంచాలకులుగా కూడా విధులు నిర్వహించారు. 2011 నుంచి వీరు విశ్వవిద్యాలయంలో సేవలు అందిస్తున్నారు.

# శ్రీశైల పీఠం అధిపతిగా ఆచార్య పి. చెన్నారెడ్డి



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠం పీఠాధిపతిగా ఆచార్య పెద్దారపు చెన్నారెడ్డి 2016, జూలై 30న పదవీ బాధ్యతలు స్వీకరించారు. పీఠాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య జి. వెంకట్రామయ్య 2016, జూలై 30న పదవీ విరమణ చేసిన దృష్ట్యా, వారి స్థానంలో చెన్నారెడ్డి పీఠాధిపతి బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య పి. చెన్నారెడ్డి చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో 1987లో అధ్యాపకునిగా చేరారు. 2004లో వీరు తొలిసారిగా పీఠాధిపతి బాధ్యతలు స్వీకరించారు. చరిత్ర – సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠంలో అప్పటి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన 21వ శతాబ్దం గురు కులానికి డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

అప్పటి ఉమ్మడి రాష్ట్ర పురావస్తు ప్రదర్శన శాల డైరెక్టర్‌గా నియమితులై 2008 నుండి 2012 వరకు నాలుగు సంవత్సరాలు ఆ సంస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు తెచ్చారు. 2013 నుంచి 2015 వరకు విద్యాత్మక వ్యవహారాల పీఠాధిపతిగా విధులు నిర్వహించారు. బాచుపల్లి ప్రాంగణ అభివృద్ధి కన్వీనరుగా పనిచేశారు. లలిత కళాపీఠంలోని పర్యాటక, సంస్కృతి శాఖకు అధిపతిగా సేవలందించారు.

ఆచార్య చెన్నారెడ్డి చరిత్ర – పురావస్తు పరిశోధనకు సంబంధించి 25 గ్రంథాలు వెలువరించారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 72 పరిశోధన వ్యాసాలు ప్రచురింపజేశారు. 102 జాతీయ అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొన్నారు. 18 వర్క్ షాపులకు హాజరయ్యారు. 15 జాతీయ సమావేశాలను నిర్వహించారు. ఆచార్య పి. చెన్నారెడ్డి పలు విద్యా సంస్థల్లో, వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. అటవీ ప్రాంతమైన శ్రీశైలంలో ఉన్నత విద్యా సౌకర్యాలు కల్పించడానికి ఎంతో కృషి చేశారు. విద్యారంగానికి వీరు చేసిన సేవలకు గుర్తింపుగా పలు సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. చెన్నారెడ్డి పర్యవేక్షణలో ఎం.ఫిల్, పిహెచ్.డి. కోసం పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఆచార్య పి. చెన్నారెడ్డి చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పీఠంలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# ఆచార్య పొన్నా లీలావతి ఉద్యోగ విరమణ



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమండ్రిలోని సాహిత్య పీఠంలో పీఠాధిపతిగా విధులు నిర్వహించిన ఆచార్య పొన్నా లీలావతి వయసు రీత్యా 2016 జూలై 31న పదవీ విరమణ చేశారు. దీంతో వీరు ఉద్యోగిగానే గాకుండా సాహిత్య పీఠాధిపతి బాధ్యతల నుంచి కూడా తప్పుకున్నారు.

డాక్టర్ పొన్నా లీలావతి 1987, జూన్ 10న సాహిత్య పీఠంలోని భక్తి పదకవితా శాఖలో అధ్యాపకులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1993లో సీనియర్ లెక్చరర్‌గా, 1996లో అసిస్టెంట్ ప్రొఫెసర్ సెలక్షన్ గ్రేడ్ స్కేల్ హోదా సంపాదించారు. 1998 జూలై 27న అసోసియేట్ ప్రొఫెసర్ అయిన వీరు 2006, జూలై 27న ప్రొఫెసర్ అయ్యారు.

డాక్టర్ పొన్నా లీలావతి సాహిత్య పీఠంలో వివిధ హోదాల్లో సమర్థనీయంగా సేవలందించారు. దేశి సాహిత్య శాఖ, తెలుగు సాహిత్య అధ్యయన శాఖలకు అధిపతిగా రెండేసిసార్లు పని చేశారు. రెండు సార్లు సాహిత్య పీఠం పీఠాధిపతిగా పని చేసిన వీరు పీఠం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. వీటితో పాటు సాహిత్య పీఠం హాస్టల్ వార్డన్‌గాను, ఇన్‌ఛార్జి లైబ్రేరియన్‌గాను బాధ్యతలు నిర్వహించారు. 'వాఙ్మయి' సాహిత్య పత్రికకు సబ్–ఎడిటర్‌గా కూడా సేవలందించారు. సాహిత్యపీఠం ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శిగాను, అకడమిక్ స్టాఫ్ అసోసియేషన్ వైస్–ప్రెసిడెంట్‌గాను బాధ్యతలు నిర్వహించి విద్యార్థులకు మేలైన సేవలు అందించడంతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేశారు.

డాక్టర్ పొన్నా లీలావతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి అన్నమాచార్యుని సంకీర్తనలపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పొందారు. 50 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. మూడు పునశ్చరణ తరగతులకు హాజరయ్యారు. మూడు ప్రాజెక్టులు పూర్తి చేశారు. వీరి పర్యవేక్షణలో మొత్తం 95 ఎం.ఫిల్, 25 పిహెచ్.డి.లు వెలువడ్డాయి.

అధ్యాపకురాలుగానే కాకుండా రచయిత్రిగా కూడా వీరు ఖ్యాతి పొందారు. పలు ప్రక్రియలో 26 గ్రంథాలు వెలవరించారు. సాహిత్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రవేశం సభ్యత్వం ఉన్న వీరు అనేక రూపాల్లో సేవలందించారు. వీరి సేవలకు గుర్తింపుగా పలు సంస్థలు సన్మానించాయి.

ఆచార్య పొన్నా లీలావతి పదవీ విరమణ సందర్భంగా సాహిత్య పీఠానికి చేసిన సేవలు, సాహిత్య రంగంలో చేసిన కృషిని తెలియ జేస్తూ పలువురు అభినందనలు తెలిపారు.

# తమిళనాడు భాషా సమస్యను చర్చించిన రాష్ట్రేతర తెలుగు సమాఖ్య




న్యూఢిల్లీలోని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భవనంలోని గురజాడ సభా మండపంలో 2016 మార్చి 25, 26 తేదీలలో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య కార్యవర్గ సమావేశాలు జరిగాయి.

మార్చి 25వ తేదీ ప్రారంభించిన సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా విశ్రాంత హైకోర్ట్ న్యాయమూర్తి పి.ఎస్. నారాయణ, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మరియు ఒరిస్సా కేడర్ విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి రామచంద్రతేజావత్ పాల్గొన్నారు. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షులు పి.వి.పి.సి. ప్రసాద్, ఉపాధ్యక్షులు డా॥ కె.వి.ఆర్. మూర్తి, ఢిల్లీ ప్రాంతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎస్. కామేశ్వరరావు, 4వ జోన్ ఉపాధ్యక్షులు పూడిపెద్ది సత్యనారాయణ బాబు, ప్రధాన సమన్వయకర్త రాళ్ళపల్లి సుందరరావు వేదికను అలంకరించారు.

తమిళనాడు నుంచి వచ్చిన తెలుగు సంఘాల ప్రతినిధులు ఎమ్. సత్యనారాయణ రెడ్డి, ఎమ్.ఎస్. విజయకుమార్, కె.ఎస్. కృష్ణప్ప, రామచంద్రప్ప తమిళనాడులో తెలుగు విద్యార్థుల ఇక్కట్లను వివరించారు. ఈ సందర్భంగా తమిళనాడులో తెలుగు భాషా పరిరక్షణ విషయమై సమావేశంలో చర్చ జరిగింది. అతిథిగా

విచ్చేసిన హైకోర్టు పూర్వ న్యాయమూర్తి పి.ఎస్. నారాయణ ఈ సమస్యకు స్పందించి తన సహకారం అందిస్తానని తెలియజేశారు. రాష్ట్రేతర తెలుగు సంఘాల ప్రతినిధులనేక మంది ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వ వైఖరిని ఖండించారు. తమిళనాడు తెలుగు ప్రజలకు తమ సంఘీభావాన్ని ప్రకటించే క్రమంలో 2016 ఆగస్టులో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య తదుపరి కార్యవర్గ సమావేశం హోసూరులో జరపటానికి నిశ్చయించారు.

ఒడిశాలో తెలుగు విద్యార్థుల సమస్యలను పర్లాకిమిడి నుంచి వచ్చిన రాష్ట్రేతర తెలుగు సమాఖ్య విద్యా విభాగం సమన్వయ కర్త పి. కృష్ణమూర్తి సభ దృష్టికి తెచ్చారు.

అనంతరం రా.తె.స. సాహిత్య విభాగం సహ సమన్వయ కర్త డా॥ తుర్లపాటి రాజేశ్వరి రచించిన అభినవాంధ్ర సభ – 1933, బరంపురం, ఆధునిక సాహితీ రూపకం గ్రంథాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి రామచంద్ర తేజావత్, సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి పి.ఎస్. నారాయణ ఆవిష్కరించారు.

ఇదే వేదికపై శ్రీమతి గెద్దాడ విజయలక్ష్మి రచించిన పాటల పుస్తకం 'సంగీత స్రవంతి' ఆవిష్కరించబడింది. రా.తె.స. ప్రచురించిన ప్రథమ రాష్ట్రేతర తెలుగు సమ్మేళనం ప్రత్యేక సంచిక 'తెలుగు స్రవంతి'ని అతిథులు ఆవిష్కరించారు.

26వ తేదీ 10 గంటలకు గురజాడ భవన్‌లో ప్రారంభమైన సమావేశంలో తెలుగు సాహిత్యం, తెలుగు నాటక కళ, కూచిపూడి నృత్యం, జానపద నృత్యాలు వీటిపై రాష్ట్రేతర ప్రాంతాలలో బాగా ప్రచారం చెయ్యాలని సభ్యులు చెప్పారు. పూనాలో 2016 జూన్ నెలాఖరులో సాహిత్య కార్యక్రమం చేపట్టాలని రా.తె.స. సాహితీ విభాగం సహ సమన్వయకర్త డా॥ తుర్లపాటి రాజేశ్వరి, వెబ్‌సైట్ సమన్వయకర్త శ్రీమతి రవీనాచవాన్ (పూనా) ప్రతిపాదించారు. త్యాగరాజు 250వ జయంతి ఉత్సవాలను మే 4, 2016న మొదలుపెట్టి సంవత్సరమంతా వివిధ రాష్ట్రాలలో జరపటానికి సభ్యులందరూ అంగీకరించారు. తదుపరి రా.తె.స. ద్వితీయ వార్షిక సమావేశం 2016 అక్టోబరు / నవంబరు నెలల్లో ముంబాయిలో నిర్వహించటానికి ముంబాయి ప్రముఖులు ముందుకొచ్చారు. దీన్ని సభ ఆమోదించింది.

ఢిల్లీ నగరంలో నివసిస్తున్న ప్రముఖ తెలుగు కళాకారులు పద్మవిభూషణ్ డా॥ యామినీ కృష్ణమూర్తి, పద్మభూషణ్ రాజారెడ్డి, పద్మశ్రీ జయరామారావు, పద్మశ్రీ డా॥ యస్.వి. రామారావు, కళా విమర్శకుడు విజయ సాయిలను రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ఘనంగా సన్మానించింది.

ఈ రెండు రోజుల సమావేశాలలో తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గుజరాత్, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల తెలుగు సంఘాల ప్రతినిధులు సుమారు 60 మంది పాల్గొన్నారు.

## దేశ భాషలందు తెలుగు లెస్స

# సూరత్ సిటీ తెలుగు సమాజ్ సాంస్కృతిక కార్యక్రమాలు



సూరత్ సిటీ తెలుగు సమాజ్ అసోసియేషన్, సూరత్‌వారు ప్రాథమిక పాఠశాల స్థాయిలోనూ, కళాశాల స్థాయిలోనూ వివిధ మాధ్యమాలలో చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతీ సంవత్సరం సత్కరించి వారిని ప్రోత్సహించడం జరుగుతోంది. ఇందులో భాగంగానే 2016, ఫిబ్రవరి 28న సూరత్‌లోని ప్రతాప్‌నగర్ – లింబాయి శ్రీ మార్కొండేశ్వర మహాదేవ్ మందిరం ప్రాంగణంలో 2014–15 విద్యా సంవత్సరంలో ఉత్తమ శ్రేణి ప్రతిభ కనబరిచిన 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 10వ తరగతి నుండి 12వ తరగతి వరకు 80 శాతం పైన మార్కులు సాధించిన తెలుగు విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది.

కార్యక్రమాన్ని తొలుత సూరత్ సిటీ తెలుగు సమాజ్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి కోట గోపి ప్రార్థనా గీతం ఆలపించి ప్రారంభించారు. అధ్యక్షులు బి.వి. సాంబశివరావు, ముఖ్యఅతిథి జక్కని రవి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు సూరత్ సిటీలో తెలుగు ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉత్తమ శ్రేణిలో పాఠశాల, కళాశాలల్లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారిలో భాషపట్ల సంస్కృతి పట్ల గౌరవాన్ని

పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్, జ్ఞాపిక, ట్రోఫీలను అందజేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన నాట్య ప్రదర్శనలో పాల్గొన్న వారికి గ్రూఫ్ ఫొటోతో పాటు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాపోలు బుచ్చిరాములు, విలేజ్ ఆఫ్ వర్కులు, వర్కుల సత్యనారాయణ, వర్కాల రామచందర్, వర్కాల శివరామ్, మిట్టుకుల శ్రీనివాస్, సాదుల లక్ష్మీనారాయణ, వడ్డేపల్లి లక్ష్మణ్ హాజరయ్యారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరైనారు. సభ్యులు చెన్నూరి సాంబరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సహాయ కార్యదర్శి కోటగోపి, కోశాధికారి రచ్చ సతీష్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమాన్ని సూరత్ సిటీ తెలుగు సమాజ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాటేటి సోమన్న పర్యవేక్షించారు.

## దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా డాక్టర్ భాగవతుల సేతురామ్



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నృత్యశాఖలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ భాగవతుల సేతురామ్ దూరవిద్యా కేంద్రం సంచాలకులు (ఇన్‌ఛార్జి)గా నియమితులు అయ్యారు. వీరు 2016 జూలై 14న పదవీ బాధ్యతలు స్వీకరించారు. అప్పటివరకు డైరెక్టర్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. గీతావాణి తులనాత్మక అధ్యయన కేంద్రం ఇన్‌ఛార్జ్ సంచాలకులుగా నియమితులు కావడంతో వారి స్థానంలో డాక్టర్ భాగవతుల సేతురామ్ నియామకం జరిగింది.

## విజ్ఞాన సర్వస్వ కేంద్రం సంచాలకులుగా ఆచార్య డి. మునిరత్నం నాయుడు



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఇన్‌ఛార్జ్ సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు విజ్ఞాన సర్వస్వ కేంద్రం ఇన్‌ఛార్జ్ సంచాలకులు నియమితులు అయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జ్ సంచాలకులుగా వ్యవహరించిన ఆచార్య సి. మృణాళిని వయసు రీత్యా పదవీ విరమణ చేయడంతో, వీరి స్థానంలో ఆచార్య డి. మునిరత్నం నాయుడును నియమించడం జరిగింది. వీరు 2016 జూలై 30న పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

# ఉగాది ఉత్సవాలు




చెన్నైలోని తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీ దుర్మిఖి నామ సంవత్సరం ఉగాది వేడుకలు అత్యంత ఆహ్లాదకరంగా జరిగాయి. కార్యక్రమానికి హైకోర్టు జడ్జి వల్లియనాయగన్ అధ్యక్షత వహించారు. సంప్రదాయబద్ధంగా ఉగాది ఉత్సవాలు నిర్వహించిన అనంతరం 40 మంది ప్రముఖులను జ్ఞాపిక, లాకెట్, శాలువాలతో సత్కరించారు. ఉగాది ఉత్సవాల్లో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ, అతిథితుల ఆశీర్వచనాల అనంతరం అందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త విశ్రాంత ఉపాధ్యాయులు బాలబాంధవ గంగరాజు మోహనరావును జస్టిస్ వల్లియనాయగన్ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా కీర్తి గడించినందుకు అభినందించారు. ఉగాది ఉత్సవాల్లో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళాపీఠంలో 2016 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ఆయన స్వాతంత్ర్యోద్యమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాపీఠంలోని బోధన బోధనేతర సిబ్బంది, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బళ్ళారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు




బళ్ళారిలోని బళ్ళారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2016, ఏప్రిల్ 8న శ్రీ దుర్ముఖినామ సంవత్సర ఉగాది వేడుకలు స్థానిక శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

పండిత్ మఠం గురు ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు శీలా బ్రహ్మయ్య, పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, శ్రీ కనకదుర్గ దేవస్థానం ప్రధాన ధర్మకర్త పి. గాదెప్ప ఇతర ధర్మకర్తలు ప్రకాశ్‌రావు, కార్యనిర్వహణాధికారి బి.సి.ఎ.ఎ. కోశాధికారి అల్లం దొడ్డప్ప, పూర్వ అధ్యక్షులు ఎన్. నాగరాజు, డాక్టర్ యశ్వంత్ భూపాల్, భారతీయ జనతా పార్టీ ప్రముఖులు కె. రామలింగప్ప, మాజీ అధ్యక్షులు ఎ.పి.ఎం.సి. శ్రీరామకృష్ణ, విశ్రాంత ఆర్.టి.ఓ. కె. పంపాపతి, సాహితిశ్రీ టి.హెచ్.ఎం. బసవరాజ్, ఎం. మంజునాథ్, ఎల్. ప్రకాశ్, అడ్వకేట్ వి.వై. దేవరెడ్డి, ఎం. రామాంజనేయులు, కె. సురేంద్రబాబు, డి.ఎస్. కృష్ణమూర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అధ్యక్షులు శీలా బ్రహ్మయ్య బళ్ళారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ స్వాగతం పలికి, సంస్థను పరిచయం చేసారు, పండిత్, జ్యోతిష్యరత్న, వాస్తు బ్రహ్మ మఠం గురు ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ, లక్ష్మీ కుబేర యంత్రములు, పంచాంగములు ఉచితంగా పంచారు. కార్యక్రమంలో తొలుత సంగీత కళాకారులైన కె.సి. సుంకణ్ణ (అభిషేక్) బృందంచే సంగీతం కార్యక్రమం, బి.కె. అర్చన ప్రార్థనతో ఉగాది వేడుకలు ప్రారంభమైనాయి. ఉగాది వేడుకల్లో స్థానిక తెలుగు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నమయ్య కీర్తనలు ఆధ్యాత్మిక పరిమళాలు

అన్నమయ్య సంకీర్తనలు పాడటం, వినడం వల్ల దివ్యమైన అనుభూతిని కలిగిస్తాయనీ, అన్నమయ్య మహాభక్తుడు, శృంగార, నీతి, వైరాగ్య, ఆధ్యాత్మిక భావాలతో సంకీర్తనలు రచించి, పాడి తాను తరించడమే గాక, ప్రజల్ని కూడా తరింపజేశాడని తెలుగు సంస్కృతి సమితి అధ్యక్షులు జి. గోపాలకృష్ణ అన్నారు. బళ్ళారిలోని బళ్ళారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ తిరుమల–తిరుపతి దేవస్థానం సహకారంతో అన్నమాచార్య కీర్తనల గానం కార్యక్రమం 2016, జూన్ 25న జరిగింది.

బళ్ళారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ అధ్యక్షులు శీలా బ్రహ్మయ్య కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ, సంస్థ నివేదికను సమర్పించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అన్నమయ్య సామాన్య ప్రజానీకాన్నీ సముద్ధరించడానికి నీతి, ఆధ్యాత్మిక సంకీర్తనలను రచించి ప్రజాకవిగా ఖ్యాతి గాంచారన్నారు. అనంతరం జరిగిన సంగీత కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ తరఫున వచ్చిన కళాకారులు మణి, గురు ప్రసాద్, జగన్‌మోహన్, వెంకటేష్‌లు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు శ్రోతలను భక్తి భావాలతో పరవశింపజేశాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుంగభద్ర సోషియల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, దల్లాలి వర్తకుల సంఘం అధ్యక్షులు మహారుద్ర గౌడ ఎం. మంజునాథ, ఎన్. నాగరాజ్ వేదికను అలంకరించారు. కార్యక్రమానికి ముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు, అతిథులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమాన్ని కె. సురేంద్రబాబు ప్రారంభించారు. వందన సమర్పణ సంస్థ సహకార్యదర్శి ఎన్. యశ్వంత్ రాజ్ చేశారు. శ్రీమతి నళిని ప్రార్థనా గీతం ఆలపించారు. జి. ప్రభాకర్, వి. రామచంద్ర, కె. రుద్రప్ప, బి. సిద్ధన గౌడ, రమేష్ గౌడ పాటిల్, జి.ఆర్. వెంకటేశులు, అమరేంద్రనాథ్ చేరవి, ఎ. లక్ష్మీనారాయణ, ఆర్. దేవణ్ణ, మేతి రఘురాం, కె. ఈశ్వరయ్య, తదితర ప్రముఖులతో పాటు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాహిత్య పీఠంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పీఠంలో 2016 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్యోద్యమ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో పీఠంలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
# దూరవిద్యాకేంద్రం

పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్-4, ఫోన్: 040-23241923

నం.పొశ్రీతెవివి/దూవికేం/ప్ర.ప్ర/2016

## ప్రవేశ ప్రకటన

2016-17 విద్యాసంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, దూరవిద్యాకేంద్రం ద్వారా నిర్వహించే ఈ క్రింది కోర్సుల్లో ప్రవేశం కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైంది.

| కోర్సు పేరు | అర్హత |
|---|---|
| 1. ఎం.ఎ.జ్యోతిషం (తె.మీ.,ఇం.మీ.) | డిగ్రీ |
| 2. ఎం.ఎ.సంస్కృతం (తె.మీ.,ఇం.మీ.) | డిగ్రీ |
| 3. ఎం.ఎ. తెలుగు | డిగ్రీ |
| 4.ఎం.ఎ. ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచింగ్ | డిగ్రీ |
| 5. ఎం.ఎ. టూరిజం మేనేజ్‌మెంట్ (తె.మీ.,ఇం.మీ.) | డిగ్రీ |
| 6. ఎం.ఎ. కమ్యూనికేషన్, జర్నలిజం (తె.మీ.) | డిగ్రీ |
| 7. బి.ఎ. కర్ణాటక సంగీతం (తె.మీ.,ఇం.మీ.) | ఇంటర్ |
| 8. బి.ఎ. స్పెషల్ తెలుగు | ఇంటర్ |
| 9. పి.జి. డిప్లమా ఇన్ జ్యోతిర్వాస్తు (తె.మీ.,ఇం.మీ.) | డిగ్రీ |
| 10.పి.జి.డిప్లమా ఇన్ టి.వి. జర్నలిజం(తె.మీ.,ఇం.మీ.) | డిగ్రీ |
| 11. డిప్లమా ఇన్ జ్యోతిషం (తె.మీ.,ఇం.మీ.) | ఇంటర్ |
| 12. డిప్లమా ఇన్ ఫిల్మ్‌రైటింగ్ (తె.మీ.,ఇం.మీ.) | టెన్త్‌పాస్ |
| 13. డిప్లమా ఇన్ లైట్ మ్యూజిక్ (తె.మీ.,ఇం.మీ.) | చదవడం, రాయడం |
| 14. సంగీత విశారద (తె.మీ.,ఇం.మీ.) | 12 సం.లు నిండి ఉండాలి. |
| 15. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ జ్యోతిషం (తె.మీ.,ఇం.మీ.) | టెన్త్ పాస్ |
| 16. సర్టిఫికెట్ కోర్స్ ఇన్ మోడ్రన్ తెలుగు | టెన్త్ పాస్ |

దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్‌లను డైరెక్టర్, దూరవిద్యాకేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ నుండి రూ. 300/-లు డిమాండ్ డ్రాఫ్టును **"రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాద్"** పేరిట ఏదేని జాతీయ బ్యాంకు నుండి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యేలా తీసి పొందవలసి ఉంటుంది. పోస్టు ద్వారా దరఖాస్తు ఫారాన్ని పొందగోరే వారు 30x22 సెం.మీ సైజు గల క్లాత్ కవరుపై స్వంత చిరునామా రాసి రూ.60/-ల పోస్టల్ స్టాంపులు అతికించి పంపాలి. పూర్తి చేసిన దరఖాస్తులు స్వీకరించడానికి ఆఖరు తేది:31.12.2016 రూ.200/-లు ఆలస్య రుసుంతో ఆఖరు తేది:31.3.2017 మిగతా వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడగలరు. www. teluguuniversity.ac.in. **గమనిక:** ఎం.ఎ. జ్యోతిషం, ఎం.ఎ. సంస్కృతం, ఎం.ఎ. టూరిజం కోర్సులకు మాత్రం స్టడీ మెటీరియల్ ఇంగ్లీషులో అందుబాటులో ఉంటుంది.

ఆచార్య వి. సత్తిరెడ్డి, రిజిస్ట్రార్